ANDHRA JYOTI, Vijayawada. Regd. No. H 548 . 19-8-67 ఉదయం 122396 ★★ Telephone : 4343

చందా రేట్లు

	ఏజెంటు ద్వారా	పోస్టు ద్వారా
మూడు మాసాలకు	రు. 5-20	రు. 5-60
ఆరు మాసాలకు	,, 10-40	,, 11-2
సంవత్సరానికి	,, 20-80	,, 22-4

విడిప్రతి — 40 పైసలు

ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక
పోస్టు బాక్సు నెం. 334, విజయవాడ-2.

ఆంధ్రజ్యోతి

ఎడిటర్ : నార్ల వెంకటేశ్వరరావు

చందా రేట్లు

	ఏజెంటు ద్వారా రు. న.పై.	పోస్టుద్వారా రు. న.పై.
ఒక మాసానికి	3-75	4-25
మూడు మాసాలకు	11-25	12-75
ఆరు మాసాలకు	22-50	25-50
సంవత్సరానికి	45-00	50-00

సర్క్యులేషన్ మేనేజర్
ఆంధ్రజ్యోతి, పో. బా. నెం. 334, విజయవాడ-2.

సంపుటి 8 :: సంచిక 48 | విజయవాడ, ఆగస్టు 18, 1967 శుక్రవారం | 6 పేజీలు :: 12 పైసలు

"బిర్లాలపై వచ్చిన అవినీతి ఆరోపణలను దర్యాప్తు జరపాలి"

సత్వరమే కమిషన్‌ను నియమించాలని రాజ్యసభలో అన్నిపక్షాలకు చెందిన సభ్యుల విజ్ఞప్తి

ఆరోపణలకు ఆధారాలుంటే తగు చర్య గైకొనగలమని మంత్రి వివరణ

న్యూఢిల్లీ అగస్టు 17

బిర్లాల పరిశ్రమలపై వచ్చిన ఆరోపణలను గురించి దర్యాప్తు జరపడానికి ఒక సంఘాన్ని నియమించాలని కాంగ్రెసు సభ్యులతో సహా పలువురు సభ్యులు నేడు రాజ్యసభలో కోరారు.

ప్రశ్నోత్తరాలకు కేటాయించిన వ్యవధిని ఈ సమస్యపైనే చర్చకు వినియోగించారు. ప్రశ్నోత్తరాల సమయాన్ని ఒకే ప్రశ్నకు వినియోగించడం రాజ్యసభ చరిత్రలోనే ప్రథమం.

బిర్లాలు పెక్కు అవినీతి చర్యలకు మోసాలకు పాల్పడ్డారని వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు జరపాలని అన్ని పక్షాలకు చెందిన సభ్యులు కోరారు.

ఈ ఆరోపణలపై దర్యాప్తుకు సంఘాన్ని నియమిస్తున్నట్లు వెంటనే ప్రకటించాలని లేదా రాజ్యసభ శీతాకాల సమావేశం ప్రారంభంకావడానికి ముందుగానైనా ప్రకటించాలని సభ్యులు కోరారు.

రాజ్యసభ చైర్మన్ స్వయంగా ఈ ఆరోపణలను పరిశీలించి, దర్యాప్తుకు తగు ఏర్పాట్లు చేయాలని ఒక దశలో కొంతమంది ప్రతిపక్ష సభ్యులు వాదించారు.

ఈ విషయమై సభ్యుల అభిప్రాయాలను సభాపతికి తెలియజేయగలమని సభా నాయకుడు శ్రీ ఎం. సి. చాగ్లా [illegible] హామీ ఇచ్చిన తర్వాత ఈ గందరగోళం సమసిపోయింది.

దాదాపు గంటసేపు సభ్యులు కోపోద్రేకంతో ప్రశ్నల వర్షం కురిపించారు. సభ్యుల గందరగోళం మధ్య సభా కార్యక్రమం కూడా వినపడలేదు. సభ వాయిదా పడడానికి ముందుగా దర్యాప్తు కమిషన్ నియమించాలని కాంగ్రెసు సభ్యుడు ఎం. పి. భార్గవ నాయకత్వాన పలువురు సభ్యులు పట్టుబట్టారు.

సభ్యుల ప్రశ్నలకు పరిశ్రమల మంత్రి శ్రీ ఫకురుద్దీన్ అలీ అహమ్మద్ సమాధానం చెబుతూ బిర్లాల పరిశ్రమలపై ఆరోపణలతో ఒక మెమొరాండం ప్రభుత్వానికి చేరినదనీ, దాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నదని తెలియజేశారు. ఆ మెమొరాండంలో పేర్కొన్న ఆరోపణలకు ఆధారాలున్నవని భావిస్తే ప్రభుత్వం అవసరమైన చర్య గైకొనగలదని ఆయన స్పష్టంచేశారు.

శ్రీ భార్గవ, తదితరులు ఈ సమాధానానికి సంతృప్తి చెందలేదు. బిర్లాలు పన్నులు ఎగవేస్తున్నారనీ, బ్లాకు మార్కెట్ చేస్తున్నారనీ విదేశీ మారక ద్రవ్యం నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని వారు ఆరోపించారు.

ఈ ఆరోపణలతో పది మంత్రిత్వ శాఖలు, రెండు రాష్ట్రప్రభుత్వాలకు సంబంధం కలదని శ్రీ ఫకురుద్దీన్ అలీ అహమ్మద్ అన్నారు.

దానిపై సమగ్రమైన సమాధానాన్ని అందచేయవలసిందిగా ఆ యా శాఖలను తాము కోరామనీ, తగు సమాధానాన్ని అందచేయగలమని ఆశాఖలు సమాధానం పంపినవని మంత్రి చెప్పారు.

పూర్తి సమాచారం లభించిన తర్వాత ఆరోపణలకు ఆధారాలు కలవని అభిప్రాయపడినప్పుడు ప్రభుత్వం అవసరమైన చర్య గైకొనగలదని మంత్రి చెప్పారు.

ఎక్కువ లాభాలు ఆర్జించి, ప్రభుత్వానికి అధిక పన్నులు చెల్లించడం నేరమా? అని కాంగ్రెసు సభ్యుడు శ్రీ అబిద్ అలీ పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తినప్పుడు అన్ని పార్టీలకు చెందిన సభ్యులు ఆయనను గేలిచేశారు.

రాజ్యసభ చరిత్రలో ఎన్నడు ఇంత ఐక్యమైన అభిప్రాయాలను సభ్యులు వ్యక్తం చేయలేదని శ్రీ భూపేశ్ గుప్తా పేర్కొంటూ ఈ విషయాన్ని ప్రధాని దృష్టికి తీసుకొని వెళ్ళాలని చెప్పారు.

మెమొరాండంలో పేర్కొన్న పెక్కు ఆరోపణలకు హజారివివేదికను పార్లమెంటు పరిశీలించినప్పుడు చర్చించడం జరిగినదని మంత్రి శ్రీ అహమ్మద్ చెప్పారు.

మంత్రి వివిధ సమస్యలను [illegible]స్తున్నారని శ్రీ భార్గవ ఆరోపించారు.

బిర్లాలు తమ సంస్థలకు సంబంధించిన రికార్డులను దాచివేయగలరని, అందువల్ల అసలు లోపాలను కనుగొనడం అసాధ్యం కాగలదని శ్రీ భార్గవ ఆరోపించారు.

కొంతమందిని ప్రభుత్వం కాపాడుతున్నదని, వారిపై చర్య గైకొనడానికి వెనుకాడుతున్నదని ఆయన ఆరోపించారు.

ఎవరిని కాపాడే సమస్య లేదని మంత్రి స్పష్టంచేశారు.

లోకంతీరు



"గత ఇరవై ఏళ్ళలో మనం సాధించింది అభివృద్ధి కాదని ఎవరంటారు? కావలిస్తే నను చూడండి......"

ముఖ్యమంత్రి వర్గంచే అధికార దుర్వినియోగం

దర్యాప్తుకు వివిధజిల్లాలలో సయోధ్య నాయకుల బృందం పర్యటన ప్రారంభం

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి) హైదరాబాద్. అగస్టు 17—

ముఖ్యమంత్రివర్గం వారు స్వప్రయోజనాల సాధనకు అధికారాన్ని దుర్వినియోగం చేసిన సందర్భాలను దర్యాప్తు చేయడానికి మాజీ మంత్రులు, ప్రముఖ శాసనసభ్యులతో కూడిన సయోధ్య కాంగ్రెసు నాయకుల బృందం నేడు రాష్ట్రంలోని జిల్లాలలో పర్యటనకు బయలుదేరింది.

తమ పర్యటనలో తొలి భాగంగా ఈ బృందం కర్నూలు, అనంతపురం జిల్లాలలో నాలుగు రోజుల పాటు పర్యటిస్తుంది. మొత్తం రాష్ట్రంలో పర్యటించిన తరువాత, సయోధ్య నాయకులు తమ దర్యాప్తు వివరాలను కాంగ్రెసు అధిష్ఠానవర్గానికి సమర్పిస్తారు.

శ్రీయుతులు ఎన్. రామచంద్రారెడ్డి, ఎం. ఆర్. అప్పారావు డాక్టర్ ఎం. ఎన్. లక్ష్మీనరసయ్య (మాజీమంత్రులు). జె. వెంగళరావు (రాష్ట్ర పంచాయతీ మండలి అధ్యక్షుడు), మూర్తిరాజు వి. వి. సుధాకర్, ఎం. ఎన్. ఎస్. సుబ్బరాజు (పార్టీ మాజీ విప్). రామభూపాల్‌రెడ్డి జి. రాజారాం, సి. జగన్నాధరావు, [illegible] బేగ్ ఈ బృందంలో వున్నారు.

శ్రీయుతులు సిద్ధల రంగారెడ్డి మాజీ మంత్రి, బండి జె. రామేశ్వరరావు, కె. సంజీవరెడ్డి (ఐ. ఎన్. టి. యు. సి. నాయకుడు) ప్రభృతులు కర్నూలు వద్ద ఈ బృందంలో చేరతారు.

"డాక్టర్ సుకర్ణో తిరిగి అధికారానికి రావడం కల్ల"

ప్రెసిడెంట్ సుహార్తో స్పష్టీకరణ

జకర్తా, అగస్టు 17— డాక్టర్ సుకర్ణో ఇండొనేసియాను మహా సంక్షోభం వైపుకు తీసుకొని వెళ్ళారని ఆయన తిరిగి అధికారంలోకి రావడానికి ఎన్నడూ అనుమతించబోమని ప్రెసిడెంట్ జనరల్ సుహార్తో నిన్న ప్రకటించారు.

ఇండొనేసియా స్వాతంత్ర్య దినోత్సవాల సందర్భంలో పార్లమెంటులో ప్రసంగిస్తూ డాక్టర్ సుకర్ణో తిరిగి అధికారంలోకి రాజాలరని జనరల్ సుహార్తో ఉద్ఘాటించారు.

జనరల్ సుహార్తో సైన్యాధికారుల వత్తిడికి లొంగి ప్రెసిడెంట్ సుకర్ణోను ఇంత తీవ్రంగా విమర్శించినట్లు అనుకొంటున్నారు.

కొన్ని సంవత్సరాల సంక్షోభం తర్వాత ఇండొనేసియా ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుకొనడానికి కృషిచేస్తున్నామని ఆయన అన్నారు.

పశ్చిమ ఇరియన్ సమస్య

జకర్తా ఆగస్టు 17— తమ భవిష్యత్తును నిర్ణయించుకొనడంలో 1969లో పశ్చిమ ఇరియన్‌కు పూర్తి స్వేచ్ఛ నివ్వగలమని ఇండొనేసియా ప్రెసిడెంట్ సుహార్తో నిన్న ఇక్కడ పునరుద్ఘాటించారు.

ఇండొనేసియా 22 వ స్వాతంత్ర్య దినోత్సవాల సందర్భంలో పార్లమెంటుకు ఒక సందేశమిస్తూ ఆయన పైవిధంగా చెప్పారు.

బస్సు బోల్తాపడి 45 మందికి గాయాలు

మదురై అగస్టు 17— కుర్తాళం నుంచి కోయంబత్తూరుకు తిరిగివస్తున్న యాత్రికుల బస్సు ఇక్కడికి 45 మైళ్ళదూరంలో ప్రమాదానికి గురిఅయి 45 మందికి గాయాలు తగిలాయి. ఈ బస్సులో మొత్తం 69 మంది ప్రయాణీకులు ఉన్నారు. ఇది ఒక చిన్న వంతెనకు గుద్దుకొని ప్రక్కనున్న గుంటలో పడింది.



ఉపప్రధాని శ్రీ మొరార్జీ దేశాయ్ జపాన్ పర్యటనకు వెళ్ళిన సందర్భంలో ఢిల్లీ విమానాశ్రయంలో ఆయనకు వీడ్కోలివ్వబడినప్పటి చిత్రం

చరణ్‌సింగ్ నాయకత్వంపట్ల దళ్ నాయకుల విశ్వాస ప్రకటన

ఆయన వెంటనే రాజీనామానిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి

లక్నో. అగస్టు 17—

సంయుక్త విధాయక్‌దళ్ పార్టీలోని వివిధ పార్టీల నాయకులు ముఖ్యమంత్రి శ్రీ చరణ్‌సింగ్ నాయకత్వంలో తమ పరిపూర్ణ విశ్వాసాన్ని ఏకగ్రీవంగా నేడు వ్యక్తం చేశారు. శ్రీ చరణ్‌సింగ్ తమ రాజీనామాను వెంటనే ఉపసంహరించుకొనాలని కూడా వారు కోరారు.

సంయుక్త విధాయక్‌దళ్ సమన్వయ కమిటీ సమావేశం నేడు నాలుగు గంటలపాటు అసంపూర్తిగా జరిగింది. శ్రీ చరణ్‌సింగ్ ఈ సమావేశానికి హాజరుకాలేదు.

జనసంఘం లెజిస్లేచర్ పార్టీ నాయకుడు శ్రీ పీతాంబర్‌దాసు అధ్యక్షత వహించారు. ఈ కమిటీ నేటి సాయంత్రం కూడా తిరిగి సమావేశమౌతుంది.

సంయుక్త విధాయక్‌దళ్‌లోని వివిధ పార్టీలు ముఖ్యమంత్రి శ్రీ చరణ్‌సింగ్‌కు పూర్తి సహకారాన్ని ఇవ్వడానికి పెక్కు సూచనలు చేశారు.

ముఖ్యమంత్రి శ్రీ చరణ్‌సింగ్‌కు సంయుక్త విధాయక్‌దళ్‌లోని వివిధ పార్టీల మధ్య సమన్వయం సాధించాలనే ప్రశ్న గురించి కూడా చర్చించడం జరిగింది. సంయుక్త విధాయక్‌దళ్ కార్యక్రమాలను అమలుచేయడంలో సాధించిన అభివృద్ధిని గురించి సంయుక్త విధాయక్‌దళ్‌లోని పార్టీలు విమర్శించడం సముచితంకాదని సమావేశంలో అభిప్రాయపడినారు.

చిన్న చిన్న విషయాలను విభేదించి ప్రభుత్వం నుంచి వైదొలగగలనన్న బెదిరింపులను ముఖ్యమంత్రి శ్రీ చరణ్‌సింగ్ దిగిరాడానికి కూడా కొందరు సభ్యులు వారి అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

సంయుక్త విధాయక్‌దళ్‌లోని పార్టీల మధ్య విభేదాలను పరస్పర సంప్రతింపుల ద్వారా పరిష్కరించుకోవాలని నిర్ణయించారు.

రైల్వే పనివారల సమ్మె నోటీసు

అందినట్టు రాజ్యసభలో శ్రీ పూనాచా వెల్లడి

న్యూఢిల్లీ ఆగస్టు 17— రైల్వే పనివారు సెప్టెంబర్ 11వ తేదీ ఒక గంట సమ్మె చేయగలరని తెలుపుతూ భారతీయ రైల్వే పనివారల జాతీయ సమాఖ్య నుంచి నోటీసు అందినట్టు రైల్వేల మంత్రి శ్రీ సి. ఎమ్. పూనాచా నేడు రాజ్యసభలో శ్రీ ఎన్. ఆర్. మునిస్వామికి తెలియజేశారు.

కరవు భత్యం విషయమై గజేంద్రగడ్కర్ కమిషన్ చేసిన సిఫారసులు ప్రభుత్వం పరిశీలనలో వున్నవని. ఈ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రుల అభిప్రాయాలను కూడా సేకరించడం జరిగినదని, త్వరలో ఈ విషయమై ఒక నిర్ణయం గైకొనబడగలదని. రైల్వే పనివారికి కూడా ఈ నిర్ణయం వర్తించ గలదని శ్రీ పూనాచా చెప్పారు.

కాంటన్ శివార్లలో చైనా సైన్యం తిరుగుబాటు

అణచివేతకై పీకింగ్‌నుంచి 47 వ సైనికదళం ప్రయాణం

హాంకాంగ్ ఆగస్టు 17—

చైనా ప్రజావిముక్త సైన్యంలోని 48 వ డివిజన్ కాంటన్ శివారులలో తిరుగుబాటు జరిపిందనీ, ఈ తిరుగుబాటు అణచివేతకు పీకింగ్ అధికారులు 47 వ డివిజన్‌ను పంపించారని ఇక్కడికి సమాచారమందింది.

ఉభయ సైనికదళాల మధ్య పెద్దపెట్టున పోరాటం ప్రారంభం కాగలదని కాంటన్ ప్రజలు భయపడుతున్నారు.

చైనా 47వ సైనిక దళం మంగళవారం రాత్రి నుంచి కాంటన్ వీధులలో కావలా కాస్తున్నది.

సోమవారం రాత్రి కాంటన్‌కు వచ్చిన 47 సైనిక దళం రెండు బెటాలియన్‌లతో మావో వ్యతిరేక సైనికులు పోరాటాన్ని ప్రారంభించారు. రాత్రి అంతా తుపాకి కాల్పులు వినబడుతూనే ఉన్నాయి. 43వ సైనిక దళం బెటాలియన్లను కొన్నింటిని 47వ సైన్యం ఇక్కడికి రాగానే నిరాయుధం చేసిందట.

పెద్దపెట్టున అంతర్యుద్ధం ప్రారంభం కాగలదన్న భయంతో కాంటన్ ప్రజలు చాలా మంది ఆ నగరం నుంచి వెళ్ళిపోతున్నారు. కాంటన్ నగరం నుంచి వెళ్ళిపోయే ప్రజలు బస్సులు రైళ్ళ కొరకు తొక్కిసలాడుకోవడంతో చాలా మంది స్త్రీలు పిల్లలు చనిపోయారని తెలుస్తున్నది.

మారిషస్ దీవులు

వచ్చే సంవత్సరం స్వాతంత్ర్య ప్రదానం

బొంబాయి ఆగస్టు 17— వచ్చే సంవత్సర ప్రారంభంలో మారిషస్ దీవులకు బ్రిటిషువారు స్వాతంత్ర్యాన్ని ఇస్తారని ఈ దీవుల ప్రధాని ఎస్. రామ్‌గులామ్ తెలిపారు.

వచ్చే అక్టోబర్ నెలలో మారిషస్ దీవుల స్వాతంత్ర్య చట్టాన్ని బ్రిటిషు పార్లమెంటు ఆమోదించనున్నది.

హిందూ మహాసముద్రంలోని ఈ దీవి వైశాల్యం 720 చదరపు మైళ్ళు

ఉపరాష్ట్రపతి శ్రీ వి. వి. గిరి అగస్టు మూడవ, నాల్గవ వారాలలో మద్రాసు. కేరళ రాష్ట్రాలలో పర్యటించనున్నారు.

కేరళ - సింహళం విమాన సర్వీసు

తిరువేంద్రం ఆగస్టు 17— నేడు కేరళకు సింహళంతో విమాన సంబంధం ఏర్పడింది. భారతదేశంలో నిర్మించిన హెచ్ ఎస్-748 విమానం తిరువేంద్రంలోని అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి పగలు 1-05 నిమిషాలకు సింహళానికి బయలుదేరింది. ఈ విమాన సర్వీసు వారానికి ఒక మారు ఉంటుంది.

మద్రాసులో 'సౌభాగ్యదళం'

మద్రాసు. అగస్టు 17— మద్రాసు ప్రభుత్వ పథకం ప్రకారం రాష్ట్రంలో ప్రథమ 'సౌభాగ్యదళం' అవతరించింది. దీనికి ముఖ్యమంత్రి శ్రీ సి. ఎన్. అన్నాదురై నిన్న సాయంత్రం ప్రారంభోత్సవం చేశారు. ఈ దళంలో దాదాపు 1300 మంది సభ్యులు వున్నారు. వారిలో నూరుమంది కాలేజీ విద్యార్థులు. యాభై మంది మహిళా వలంటీరు వున్నారు.

ఈ సౌభాగ్యదళం తన తొలి ప్రజా సేవాపథకాన్ని చేపట్టనున్నది. దాని ప్రకారం నగరం సమీపానగల ఉరూరులో ఒక పాఠశాలకు ఆరు క్లాసు రూములు నిర్మితమౌతాయి.

దళ సభ్యులు ఆకుపచ్చని బ్యాడ్జిని ధరిస్తారు. ఆ బ్యాడ్జిమీద "తమిళగ్ సీరాణి" అను పదం సువర్ణాక్షరాలతో లిఖితమైంది. తమ శ్రమకు ప్రతిఫలాపేక్ష లేకుండా స్వార్థరహితంగా ప్రజలకు సేవ చేయగలమని దళ సభ్యులు ప్రతిన బూనారు. రాష్ట్ర పబ్లిక్ వర్క్సు మంత్రి శ్రీ ఎం. కరుణానిధి వారిచేత శపథం చేయించారు.

శ్రీ కరుణానిధి ఈ దళ కార్యకలాపాలను వివరించి దళసూత్ర కార్యక్రమాన్ని చదివి వినిపించారు. వ్యవసాయం, వయోజన విద్య, ప్రజారోగ్యం, అస్పృశ్యతా నిర్మూలన, సాంఘిక సంస్కరణలు, నిర్భాగ్యుల పరిత్రాణం—ఈ కార్యక్రమంలో ప్రధానాంశాలు.

మద్రాసు ముఖ్యమంత్రి జూన్‌లో రాష్ట్రప్రభుత్వం బడ్జెట్టును ప్రతిపాదించినప్పుడు ప్రతి జిల్లాకు ఒకటి చొప్పున కనీసం వెయ్యిమంది సభ్యులతో సౌభాగ్య దళాలను నిర్మించడానికి ప్రభుత్వం కృతనిశ్చయమైనట్లు ప్రకటించారు. ఈ పథకం అమలు నిమిత్తం ప్రస్తుత సంవత్సరానికి బడ్జెటులో పది లక్షలు ప్రత్యేకించారు.

ఉన్నత విద్యారంగంలో ప్రాంతీయ భాషలో బోధన

గడువు నిర్ణయించడం పట్ల ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి విముఖత

ఇంగ్లీషుకున్న సముచిత స్థానాన్ని తిరస్కరించరాదని 29 మంది ఎం. పీ. ల మెమొరాండం

న్యూఢిల్లీ. ఆగస్టు 17—

ఇంగ్లీషు స్థానే బోధన భాషగా ప్రాంతీయ భాషలను ప్రవేశపెట్టాలనే విషయంలో నిర్ణీత గడువును విధించడం పట్ల తాను సుముఖంగా లేనని ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి వివిధ రాష్ట్రాలకు చెందిన పార్లమెంటు సభ్యుల ప్రతినిధివర్గానికి వివరించినట్టు తెలుస్తున్నది.

అయితే చిరకాలం ఇంగ్లీషును బోధనా భాషగా మాత్రమే వుంచడం సాధ్యం కాదని మాత్రం ఆమె స్పష్టపరచినట్టు తెలుస్తున్నది.

విద్యారంగంలో ఇంగ్లీషుస్థానే ప్రాంతీయ భాషలను బోధనా భాషలుగా ప్రవేశపెట్టే విషయంలో త్వరపడి సంస్కరణలను తలపెట్టరాదని 29మంది పార్లమెంటు సభ్యులు ప్రధానికి సమర్పించిన మెమొరాండంలో కోరారు. ఈ చర్యవలన ఇంగ్లీషుకు సముచిత స్థానం లభించరాదని వారు వివరించారు. ఇదే విధమైన విజ్ఞప్తి వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు వారు చేశారు.

మాతృభాషపట్ల ఎవరికి ఎటి అభిమానం వున్నప్పటికి ఉన్నత విద్యారంగంలో ఇంగ్లీషుకు వున్న స్థానాన్ని తొలగించాలని ఎవరూ ఊహించరాదని ఆ మెమొరాండంలో పేర్కొనడం జరిగింది.

పార్లమెంటు సభ్యుల ప్రతినిధివర్గంతో ప్రధాని చర్చలు జరిపారు. ఈ సందర్భంలో ఏదో ఒక దశలో సంధానభాష అవసరం అని ఆమె తెలియజేశారు. అఖిల భారత స్థాయిలో ఆ స్థానం హిందీకి లభిస్తుందని ఆమె అన్నారు.

మూడు భాషలు (ప్రాంతీయ భాష, హిందీ, ఇంగ్లీషు) నేర్చుకొనవలసిన అవసరం వున్నదని ప్రధాని అన్నారు.

హిందీ మాట్లాడే ప్రజలు ఇంగ్లీషును మరొక భాషను కూడా నేర్చుకోవాలని, ముఖ్యంగా దక్షిణాది భాషను నేర్చుకొనాలని ప్రధాని సూచించారు.

హిందీయేతర ప్రాంతాలవారు ఇంగ్లీషును హిందీని నేర్చుకోవాలని ప్రధాని అన్నారు.

మెమొరాండంపై సంతకాలు చేసిన వారిలో శ్రీయుతులు ఆర్. టి. పార్థసారథి, ఫ్రాంక్ ఆంథోని, సి. ఎన్. [illegible] శ్రీమతి శ్యామ్‌కుమారీఖాన్, దివాన్ చమన్‌లాల్, ఎ. కె. [illegible] డి. ఎల్. సేన్‌గుప్త బి. హెచ్. జైదీ సి. డి. పాండే ఎం. పి. భార్గవ వున్నారు.

ఒక్కసారి నన్ను చూడు మగడా! ఓ మగడా!
శేఖర్ ఫిలిమ్సు
భామావిజయం
వినోదానికి సాటిలేని చిత్రం!

1967 ఆగస్టు 18 శుక్రవారం
శ్రీ ప్లవంగనామ సంవత్సర
శ్రావణ శుద్ధ త్రయోదశి
త్రయోదశి: ఉ॥ 7-29 ఉత్తరాషాఢ: ప॥ 1-50
వర్జ్యం: పా॥ 5-56 నుంచి 7-35 వరకు

• • •

1967 ఆగస్టు 19 శనివారం
శ్రీ ప్లవంగనామ సంవత్సర
శ్రావణ శుద్ధ చతుర్దశి
చతుర్దశి ఉ॥ 7-17 శ్రవణం: ప॥ 2-29
వర్జ్యం: రా॥ 6.40 నుంచి 8.21 వరకు

ఆంధ్రజ్యోతి

"తమసోమా జ్యోతిర్గమయ"

మిశ్రమ మంత్రివర్గాలు

ఉత్తరప్రదేశ్ మిశ్రమ మంత్రివర్గంలో తీవ్రమైన అంతర్విభేదాలున్న సంగతి అందరికీ తెలిసినదే. అందువల్ల ముఖ్యమంత్రి శ్రీ చరణ్‌సింగ్ రాజీనామా ఇవ్వడానికి సిద్ధపడినారన్న వార్త ఆశ్చర్యం కలిగించనక్కర లేదు.

శ్రీ చరణ్‌సింగ్ తన రాజీనామాను గవర్నరుకు పంపించలేదు. కాని, మంత్రివర్గంలో భాగస్వాములైన సంయుక్త విధాయక్‌దళ్ పార్టీలకు తన నిశ్చయాన్ని తెలియజేశారట. ఆయన నిశ్చయాన్ని సంయుక్తదళ్ సమన్వయ సంఘం చర్చించి ఒక నిర్ణయం చేయనున్నది. మేమిది వ్రాస్తున్న సమయానికి సమన్వయ సంఘం నిర్ణయం తెలియరాలేదు. అందుచేత శ్రీ చరణ్‌సింగ్ మంత్రివర్గ భవితవ్యాన్ని ఇప్పుడు ఊహించి చెప్పడం కష్టం. అయితే, కొందరు మంత్రులు శ్రీ చరణ్‌సింగ్‌ను కలుసుకొని, రాజీనామా ఇవ్వవద్దని గట్టిగా కోరినట్లు తెలుస్తున్నది. ఇదే విధంగా సమన్వయ సంఘంలోని పక్షాలందరు కోరేపక్షంలో శ్రీ చరణ్‌సింగ్ తన నిశ్చయాన్ని మార్చుకోవచ్చు.

ఈ విధంగా జరిగినప్పటికి యు.పి. మిశ్రమ మంత్రివర్గం ఎదుర్కొంటున్న దైనందిన సంక్షోభం తొలగిపోబోదని మాత్రం చెప్పవచ్చు. ఏప్రిల్‌లో ఏర్పడిన ఈ మిశ్రమమంత్రివర్గంలో వివిధ పక్షాలవారు – జనసంఘం నుంచి రైట్ కమ్యూనిస్టుల వరకు – వున్నారు. వీరికి సిద్ధాంతాలలో, విధానాలలో, దైనందిన పరిపాలనా నిర్వహణ విషయాలలో ఎక్కడా పొంతన లేదు. ఒకరు ఏటికి లాగితే, ఒకరు కోటకు లాగుతున్న పద్ధతిగా వుంది. వారు ఏకీభవిస్తున్నది ఏదైనా వుంటే అది కాంగ్రెసును తిరిగి అధికారానికి రాకుండా చేయడం మాత్రమే. అయితే, రాష్ట్రానికి సుస్థిరమైన, సమర్థమైన పరిపాలనను సమకూర్చడానికి ఇది చాలునా?

శ్రీ చరణ్‌సింగ్ తన రాజీనామా నిర్ణయానికి కారణాలు వెల్లడించలేదు కాని, ఇటీవల ఉప ముఖ్యమంత్రి శ్రీ రాంప్రకాష్ చేసిన ఒక ప్రకటన ఆయన నిర్ణయానికి తక్షణ కారణమైనట్లు తెలుస్తున్నది. ముఖ్యమంత్రికి ఇతోధిక స్వేచ్ఛను ఇవ్వకపోతే మిశ్రమ మంత్రివర్గం నుంచి తాము వైదొలగగలమని జనకాంగ్రెసు నాయకులొకరు చేసిన ప్రకటనను ఖండిస్తూ, జనకాంగ్రెసు బెదరిస్తున్నదని, అది వైదొలగదని శ్రీ రాంప్రకాష్ హేళన చేశారట. బహుశా దీనికి ఒళ్లుమండి శ్రీ చరణ్‌సింగ్ రాజీనామా చేయనిశ్చయించారేమో తెలియదు.

ఇది తక్షణ కారణం కావచ్చుగాని, యు.పి. మంత్రివర్గంలో ఇంకా పెక్కు విషయాలపై అభిప్రాయభేదాలున్నాయి. ఉర్దూ సమస్యపై జనసంఘానికి, మిగతా పార్టీలకు పడడంలేదు. అలాగే ధాన్యసేకరణ, ధరల అదుపు సమస్యలపై ముఖ్యమంత్రి తమ విధానానికి అంగీకరించకపోతే తాము మంత్రివర్గం నుంచి తప్పుకోగలమని రైట్ కమ్యూనిస్టులు బెదరిస్తున్నారు. ఇలాగే ఎస్.ఎస్.పి.తో కూడా ముఖ్యమంత్రికి ఏవో అభిప్రాయభేదాలున్నాయి.

విధానాలలో విభేదాలే కాకుండా, సంయుక్తదళ్‌లోని ఏ పార్టీకి ఆ పార్టీ తమకు లభించిన అవకాశాన్ని వినియోగించుకుని, అధికారం వుండగానే బలపడాలని ప్రయత్నిస్తున్నది.

ఈ నాడు అభిప్రాయభేదాలవల్ల తరచుగా సంక్షోభాలకు లోనౌతున్నది యు.పి. మంత్రివర్గమేకాదు; కాంగ్రెసేతర పక్షాలు మిశ్రమ ప్రభుత్వాలు స్థాపించిన దాదాపు అన్ని రాష్ట్రాలలోను పరిస్థితి అలాగే వుంది. కేరళ, పశ్చిమ బెంగాల్‌లలో మంత్రివర్గ పక్షాల వైరుధ్యాలు మరింత తీవ్రంగా బయటపడుతున్నాయి. హర్యానా, పంజాబ్, బీహార్‌లలో కూడా పరిస్థితి అంతే. ఏకపక్షపాలన ఏర్పడిన ఒక్క మద్రాసులో మాత్రమే డి.ఎం.కె. ప్రభుత్వం సుస్థిరంగా కొనసాగుతున్నది.

దేశానికి ప్రస్తుత ఘట్టంలో సుస్థిర ప్రభుత్వాలు అవసరమని మొన్న స్వాతంత్ర్యోత్సవ సందేశంలో రాష్ట్రపతి డాక్టర్ జాకిర్‌హుస్సేన్ హెచ్చరించారు. నిజమే, కాంగ్రెసేతర పక్షాలు ప్రభుత్వాలను స్థాపించగలగడం హర్షించదగు విషయమే కాని, అవి ఏకీభావంతో వ్యవహరించగలగాలి. తాము నిర్ణయించుకున్న విధానాలను ఎట్టి సంకోచాలు లేకుండా అమలుచేయగలిగి వుండాలి. ఒక పార్టీకి మరొక పార్టీ ఒదిగి ఒదిగి వుండవలసివచ్చి అసలు ఏ విధానమూ లేని పరిస్థితిని తీసుకురాకూడదు. అదే జరిగితే ప్రజలు ఆశిస్తున్న సమర్థమైన పరిపాలన సమకూరదు. దేశాభివృద్ధి కార్యక్రమాలకు సయితం అంతరాయం కలుగుతుంది.

శోచనీయం

ఏదో రాష్ట్రంలో, ఏదో ఒక నగరంలో ఆందోళనలు, అల్లర్లు సంఘర్షణలు జరగడం కడచిన రెండు మూడేళ్లుగా సర్వసామాన్యమైపోయింది. విద్యార్థులలో, కార్మికులలో, మత, భాషావర్గాలలో విభిన్న వర్గాలకు చెందిన వారి సంఘర్షణలు తరుచుగా జరుగుతున్నాయి.

కాని, ఇంతవరకు ఎన్నడు ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవంనాడే అల్లర్లు జరగడం వినలేదు. మొన్న ఆ విధంగా జరగడం దేశ హితైషులకు ఎంతైనా విచారం కలిగిస్తుంది.

దేశంలో పెక్కుచోట్ల ఇట్టి అల్లర్లు జరిగాయి. కాని, బొంబాయి, మద్రాసు నగరాలలో జరిగినవి కొంత తీవ్రస్థాయిలో వున్నాయి. బొంబాయిలో శివసేన అనుయాయులకు, దక్షిణాదివారికి మధ్య సంఘర్షణలు జరిగాయి. ఈ ఉభయ వర్గాలవారు తమవల్ల తప్పులేదంటే తమవల్ల లేదని, ఎదుటి వర్గమే దౌర్జన్యం ప్రారంభించిందని ఆరోపణలు చేస్తున్నారు. ఎవరు ప్రారంభించినప్పటికి జరగవలసిన అల్లరి జరిగిపోయింది.

అదే విధంగా మద్రాసులో కూడా తీవ్రంగా సంఘర్షణలు జరిగి పెక్కుమంది గాయపడ్డారు. బొంబాయిలో భిన్న భాషావర్గాల మధ్య సంఘర్షణ జరిగితే, మద్రాసులో భిన్న రాజకీయ పక్షాలమధ్య – డి.ఎం.కె., కాంగ్రెసు అనుయాయుల మధ్య – కొట్లాటలు జరిగాయి. వీరు కూడా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేస్తూ, బాధ్యతను ఒకరిపై ఒకరు నెట్టివేస్తున్నారు.

బొంబాయిలో శివసేన సంగతి తెలిసిందే. అది బొంబాయిలోని దాక్షిణాత్యులపై ధ్వజమెత్తింది. దాన్ని నిగ్రహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏమీ చేయడంలేదని ఆరోపణ సయితం వున్నది. ఇదే నిజమైతే ముందు ముందు బొంబాయిలో శివసేన మరింతగా బలపడడం, అక్కడి మహారాష్ట్రేతరులకు పోనుపోను పెక్కు ఇబ్బందులు వాటిల్లడం తప్పదు.

మద్రాసులో డి.ఎం.కె. పార్టీ అధికారానికి వచ్చిన తర్వాత శాంతిభద్రతల పరిస్థితి దిగజారిందని కాంగ్రెసు నాయకులు ఆరోపిస్తున్నారు. ఇది నిజమైనా, కాకపోయినా, అధికారం కోల్పోయిన కాంగ్రెసు తిరిగి ప్రజలలో పలుకుబడి సంపాదించుకొనడానికి యత్నిస్తుండడంతో అధికారపక్షం అనుయాయులకు, దానికి సంఘర్షణలు జరుగుతూ వుండవచ్చు. అందువల్ల ఉభయ పక్షాలు బాధ్యతాయుతంగా మెలగవలసిన అవసరం ఎంతైనా వుంది. ముఖ్యంగా పెద్ద మెజారిటీతో గెలిచి అధికార బాధ్యత వహించిన డి.ఎం.కె. పార్టీ మరింత నేర్పుతో ఓర్పుతో వ్యవహరించడం అవసరం.

ఏమైనా జాతీయ స్వాతంత్ర్యానికి, సమైక్యానికి ఉజ్వల చిహ్నమైన ఆగస్టు 15వ తేదీన ఇట్టి సంఘటనలు జరగడం దేశానికే అప్రతిష్ఠాకరం. దీనికి బాధ్యులైన వివిధ వర్గాలవారు సిగ్గుతో తల వంచుకోవాలి.

ఇండియా సమస్యలు – ప్రజాస్వామ్యం పరిష్కరించగలదా?

శ్రీమతి

వేరా మిచెల్స్ డీన్

1885 ప్రాంతాలనుంచి బ్రిటిష్‌వారితో తీవ్రంగా పోరాడి స్వాతంత్ర్యం సంపాదించిన ఇండియా 20 సంవత్సరాల స్వతంత్ర జీవితం తరువాత ఇప్పుడు ప్రత్యేక రాష్ట్రాలుగా చీలిపోగలదని భారతీయ, విదేశీయ నిరాశావాదులు కొందరు జోస్యం చెబుతున్నారు.

562 సంస్థానాల కలయిక ఫలితంగా ఏర్పడిన ఇండియన్ యూనియన్ ఒకే రాజ్యంగా ఎంతో కాలం మనజాలదని, రాజకీయ భేదాలు, మతవిశ్వాసాలు, భాషా విద్వేషాలు, ఆర్థిక ప్రయోజనాలను పురస్కరించుకుని చీలిపోగలదని వీరి జోస్యం.

ఈ జోస్యాలే ఫలిస్తే, ఇండియా త్వరలోనే బ్రిటన్, ఫ్రాన్సు, పశ్చిమ జర్మనీ అంతటి హెచ్చు జనాభాగల రాష్ట్రాలుగాను, పాకిస్తాన్, కమ్యూనిస్టు చైనా వంటి దేశాలకు ఎరకాగల చిన్న రాష్ట్రాలుగాను చీలిపోగలదు.

ఈ జోస్యాలలో వాస్తవం వున్నదా? 20 సంవత్సరాల క్రితం హిందూ, ముస్లిం మధ్య విభేదాలకు ప్రాతిపదికలు వేసిన బ్రిటిష్ వారినుంచి స్వాతంత్ర్యాన్ని సంపాదించిన భారత దేశం స్వాతంత్ర్యం వచ్చిన తొలి దినాలలో ఏర్పడిన యిబ్బందులను అధిగమించినట్లే ఇప్పుడు కూడా తన జాతీయ సమైక్యానికి ఏర్పడిన అవరోధాలను దాటగలదా?

కాని, నన్ను ఎవరైనా ఆశావాదిగా జమకడితే కడుదురుగాక. కాని, ఇండియా ఈ సమస్యలన్నింటిని అధిగమించి, పురోగమించగలదని ఈ రచయిత విశ్వాసం. గత 20 సంవత్సరాలలోను ఇండియా తన ప్రజాస్వామిక వ్యవస్థకు గట్టి పునాదులు వేసుకొనడమే ఇందుకు కారణం.

1947 నుంచి 1967 వరకు ఒకే ఒక పార్టీచే పరిపాలించబడడం ఇండియా అదృష్టమనిచెప్పాలి. కాంగ్రెసుపార్టీలో మితవాద, మధ్యమవాద, అతివాద వర్గాలున్నాయి. అయితే, దేశంలో జనసంఘం, స్వతంత్రపార్టీ మొదలైన మితవాద పక్షాలు సోషలిస్టు, కమ్యూనిస్టుపార్టీవంటి అతివాద పక్షాలు వున్నాయి.

ఇలాంటి విభిన్నమైన పార్టీలున్న ఫ్రాన్సువంటి చోట్ల అవి అక్కడి ప్రజాస్వామ్యాన్ని విఫలం చేయగా, ఇండియాలో మాత్రం ఇందుకుభిన్నంగా అవి అక్కడి ప్రజాస్వామ్యాన్ని పటిష్ఠం చేశాయి.

ప్రజాసామ్యం: జవహర్‌లాల్

జవహర్‌లాల్‌లో ఏమి లోపాలున్నప్పటికీ, ఆయనకు రాజకీయ ప్రజాస్వామ్యంలో సుస్థిర విశ్వాసం వుండేది. ఆయన అంటే ఆయన విమర్శకులు, ప్రత్యర్థులు సయితం గౌరవించేవారు. అందువల్ల, ఆయన ప్రజలలో అపారమైన విశ్వాసాన్ని సంపాదించగలిగారు. తత్ఫలితంగా ఆయన చైనానుంచి ఇండోనేసియావరకు, నైజీరియానుంచి అరబ్ రాజ్యాలవరకు లేని జాతీయ సమైక్యతను ఇండియాలో సాధించగలిగారు.

నెహ్రూ సృష్టించిన ఈ సమైక్యతావాతావరణం ఆయన మరణానంతరం పూర్తిగా సమసిపోగలదని కొందరు భావించారు. అంతేకాక ఇండియాలో రాజకీయ ప్రజాస్వామిక వ్యవస్థ బీటలువారిపోగలదని కూడా భావించబడింది. కాని అలా జరగలేదు. ఒక ప్రక్క కేంద్రంలో కాంగ్రెసు పార్టీయే అధికారంలో వుండగా, తొమ్మిది రాష్ట్రాలలో రకరకాల రాజకీయవర్గాలతో కూడిన మిశ్రమ ప్రభుత్వాలు అధికారంలో వున్నాయి. ఈ సందర్భంలో పేరు మార్చుకున్న కాంగ్రెసు [illegible] ఈ మిశ్రమ మంత్రివర్గ నిర్మాణానికి ఉపయోగపడుతున్నారు.

అయితే, ఇన్ని జరిగినా రాష్ట్రాలలో తిరుగుబాట్లు రావడంగాని, కాంగ్రెసేతర రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రం అధికారాన్ని ధిక్కరించడంగాని జరగలేదు. గతంలో తమకు అన్యాయం జరిగిందని బాధపడే మద్రాసు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు ఇండియానుంచి విడిపోవడానికి ప్రయత్నించగలవని కొందరు భావించినా, అవికూడా ఆ పని చేయలేదు.

ఆరు అత్యవసర సమస్యలు

కొందరు విరుద్ధ జోస్యాలు చెప్పినా, రానున్న సంవత్సరాలలో కాంగ్రెసు జాతీయ నాయకత్వాన్ని సమకూర్చగలిగితే, ఇండియా మరింత పటిష్ఠంగా వుండగలుగుతుంది. అప్పుడు ఈ క్రిందిఆరుఅత్యవసర సమస్యలపై అది తన దృష్టిని కేంద్రీకరించ గలుగుతుంది.

వ్యవసాయాభివృద్ధి, పారిశ్రామిక విస్తరణ, ఎగుమతుల అభివృద్ధి జనాభా పెరుగుదల అదుపు, విదేశీయ సహాయం, భాషా వివాదాల పరిష్కారం.

ఈ ఆరు విషయాలలోను ఇండియా సమర్థంగా వ్యవహరించాలంటే, అది సమైక్య జాతిగా వుండాలి. అంతే కాని అది భాషా ప్రాంతీయ వివాదాలలో చిక్కుకోరాదు. దక్షిణ భారతీయులు ప్రతిఘటిస్తున్నప్పటికి, హిందీ జాతీయ భాష కావాలా? ప్రాథమిక విద్యా దశనుంచి యూనివర్సిటీ దశవరకు ప్రాంతీయ భాషలలోనే విద్యాబోధ జరగాలా? ఇంగ్లీషు ఒకప్పుడు ఈ దేశాన్ని పాలించిన జాతివారి భాష కాబట్టి, దాన్ని ప్రపంచమంతటా వాడుతున్నప్పటికి, దాన్ని యూనివర్సిటీ స్థాయిలో కూడా ఇండియాలో వదలివేయాలా?

ఈ సమస్యలను సక్రమంగా పరిష్కరించలేకపోతే, ఇండియా విచ్ఛిన్నం కాకతప్పదు.

అయితే, ఇంగ్లీషును పూర్తిగా తొలగించడమే జరిగితే యువతరం వారు ప్రపంచ సంస్థల చర్చలలో పాల్గొనడం జరగబోదు.

ఈ రచయిత్రిది రష్యా దేశం. అయినప్పటికీ, ఇంగ్లీషు చదివి దానిలో వ్రాయడం సాధ్యమైనది కాగా, 20వ శతాబ్దంలో స్వతంత్ర దేశమైన ఇండియా ఇంగ్లీషును వదులునాడితే దానికి చాలా నష్టమే వాటిల్లుతుంది.

భారతీయ నాయకులు మేధావులే. భవిష్యత్తులో విచ్ఛిన్నకర పోకడలకు దారితీసే ఎలాంటి చర్యలను వారు తీసుకోరు.

అణుశక్తిరంగంలో ఇండియా ముందంజ

శ్రీ

ఎం. ఎస్. గురుపాదస్వామి

(అణుశక్తిశాఖ మాజీ సహాయమంత్రి)

స్వాతంత్ర్యం రావడానికి ముందునుంచే దేశంలో అణుశక్త్యుత్పాదన కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయి. 1945లో ప్రాతిపదిక పరిశోధన శాఖా సంస్థ ఏర్పాటు అయింది. ఇది క్రమంగా దేశంలో అణు విజ్ఞానశాస్త్ర అధ్యయన పీఠంగా రూపొందింది. ఈ సంస్థలో శిక్షణ పొందినవారు అనేకులు ప్రముఖ అణు భౌతిక శాస్త్రవేత్తలుగా ప్రఖ్యాతిగడించారు. వీరంతా ఓం ప్రథమంలో ప్రారంభించిన ప్రాజెక్టులలో నియమితులయ్యారు. ఈ రంగంలో చెప్పుకోదగిన అభివృద్ధి సాధించడం జరిగింది. శాఖా సంస్థ నెలకొల్పబడినప్పుడు కీర్తిశేషులు డాక్టర్ భాభా ఈ రంగంలో ఏవిధంగా అభివృద్ధి సాధించాలో స్పష్టంగా వివరిస్తూ పథకాలు రూపొందించారు. అది అప్పుడు ప్రాథమిక దశలో ఉన్నప్పటికీ ఉత్తరోత్తరా అత్యున్నత స్థాయి అందుకోగలదని, భౌతిక విజ్ఞానశాస్త్ర పీఠంగా రూపొందగలదనీ ఆయన గాఢంగా ఆశించారు. మున్ముందు, రెండు దశాబ్దాల కాలంలో విద్యుదుత్పాదనకు అణుశక్తి వినియోగించడం సాధ్యమైనప్పుడు విదేశీ నిపుణులకై ఎదురుచూడవలసిన అవసరం ఉండదని, దేశీయులే ఈ కార్యక్రమాలు నిర్వహించగలరని ఆయన సరిగానే ఊహించారు.

ఇక అనాటినుంచి ప్రయోగశాలల ఏర్పాటుకై కృషి ప్రారంభమయింది. ముందుగా ప్రయోగశాలలు నిర్మించి సాధనసామగ్రులు సమకూర్చి, వాటితో శాస్త్రజ్ఞులను నియమించడం జరగలేదు. దానికిబదులుగా ముందుగా శాస్త్రజ్ఞులను నియమించడం, వారికోసం అనువైన ప్రయోగశాలలు నిర్మించడం జరిగింది.

1948లో అణుశక్తి వ్యవహారాల సంఘం ఏర్పాటయింది. అణుశక్తి ఉత్పాదనకు ఉపయుక్తం అయ్యే ఖనిజాలకై అన్వేషణ జరపడం, వాటిని వినియోగంలోకి తీసుకొనిరావడం, శాంతియుత ప్రయోజనాలకై అణుశక్తి వినియోగం, పరిశోధన, అణుశక్తి శాస్త్ర రంగంలో శాస్త్రవేత్తలకు, సాంకేతికజ్ఞులకు శిక్షణ ఇవ్వడం వంటివి ఈ సంస్థ లక్ష్యాలు. ఈ లక్ష్యాలన్నీ సాధించడానికి ఏకకాలంలో కృషి ప్రారంభమైంది. అణుశక్తి ఉత్పాదనకు ఉపయుక్తం అయ్యే ఖనిజాల అన్వేషణ, వినియోగం నిమిత్తం ప్రత్యేక విభాగం ఒకటి ఏర్పాటు అయింది. ఈ రంగంలో శాస్త్రజ్ఞులు ఇతర ఉద్యోగులకు అవసరమైన శిక్షణ ఇవ్వవలసిందిగా ప్రాతిపదిక పరిశోధన సంస్థను కోరడం జరిగింది. ఇదే విధంగా 1954లో ట్రాంబేలో అణుశక్తిసంస్థనెలకొల్పబడింది. దీనికిప్పుడు భాభా అణుశక్తి పరిశోధన కేంద్రం అని నామకరణం చేశారు. ఈ కేంద్రంలో మూడు రియాక్టర్లు, అనేక ఇంజనీరింగుశాస్త్రవిభాగాలు ఏర్పాటు అయ్యాయి. దరిమిలా 1956లో ఒక మెగావాట్ శక్తిగల అప్సర అనే పేరుతో ఒక రియాక్టరు, 1960లో కెనడాసహాయంతో 40 మెగావాట్ల శక్తిగల మరో రియాక్టరు, 1961లో జెర్లినా అనే పేరుతో మరో రియాక్టరు నెలకొల్పడం జరిగింది. వీటితోపాటు యురేనియమ్ లోహ కర్మాగారం [illegible] నెలకొల్పడం జరిగింది.

అణుశక్తికి శాంతియుత ప్రయోజనాలకు వినియోగించాలని మనం లక్ష్యంగా పెట్టుకొన్నందువల్ల ఈ రంగంలో పరిశోధనల మూలంగా ప్రజలకు వెనువెంటనే ప్రయోజనాలు కలిగేలా చెయ్యడానికి కృషి జరిగింది. రేడియో ధార్మిక శక్తిగల ఐసోటోపులను తయారుచెయ్యడానికి, పరోక్షంగా విద్యుదుత్పాదనకు ఈ అణుశక్తిని వినియోగిస్తున్నారు. ట్రాంబేలో పెద్దమెత్తున అత్యధిక సంఖ్యలో ఉత్పత్తి అవుతున్న రేడియో ధార్మికశక్తిగలఐసోటోపులు వైద్యంలోను, పరిశ్రమలలోను, వ్యవసాయంలోను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

అణుశక్తిద్వారా విద్యుచ్ఛక్తి ఉత్పాదనకై మూడు కేంద్రాలు నెలకొల్పారు. తారాపూర్‌లో 380 మెగావాట్ల విద్యుదుత్పాదక కేంద్రం నిర్మాణం పూర్తి కావస్తున్నది. ఈ కేంద్రం నిర్మాణం 1968 అక్టోబరు నాటికి పూర్తి అవుతుంది. ఈ కేంద్రంనుంచి గుజరాతు మహారాష్ట్రలలోని పరిశ్రమలకు విద్యుచ్ఛక్తిసరఫరాచేశారు. రాజస్థాన్‌లో రాణాప్రతాప్ సాగర్‌లోను, మద్రాసు రాష్ట్రంలో కల్పాక్కమ్‌లోను, మరో రెండుకేంద్రాలు నిర్మిస్తున్నారు. చతుర్థ ప్రణాళిక అవధి నాటికి ఈ రెండు కేంద్రాలలోనూ కలిపి 1000 మెగావాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తి అవుతుంది.

జలవిద్యుదుత్పాదనపథకాలద్వారామొత్తం దాదాపు 40 మిలియన్లకిలోవాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పాదన కాగలదని అంచనా. వీటితోపాటు రాసవిద్యుత్కేంద్రాల నుంచి కూడా విద్యుచ్ఛక్తి సరఫరా అవుతోంది. మున్ముందు అణుశక్తి వినియోగం ద్వారా చవగ్గా విద్యుచ్ఛక్తి ఉత్పాదన చేయడానికి అవకాశాలు వున్నాయి. తారాపూర్, రాణా ప్రతాప్ సాగర్ కేంద్రాలు విదేశీ సాంకేతిక సహాయంతో నిర్మిస్తున్నారు. మూడవ కేంద్రం కేవలం భారతీయ సాంకేతికజ్ఞుల, శాస్త్రజ్ఞుల సహాయంతో నిర్మించడానికిపూనుకొన్నారు. ఈ కేంద్రాలు నిర్మాణం పూర్తి అయితే అణుశక్తి శాస్త్రజ్ఞులకు, సాంకేతికజ్ఞులకు అనుభవం లభించడమేకాక దేశ ఆర్థికాభివృద్ధికి దోహదం కలుగుతుంది.

ఆంధ్ర ప్రాంతంలోని ప్రస్తుత న్యాయ పరిపాలనా పద్ధతి

మార్పుచేసే ప్రశ్న లేదని రాష్ట్రమంత్రి శ్రీ కె. వి. నారాయణరెడ్డి స్పష్టీకరణ

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి) హైదరాబాద్, ఆగస్టు 17— ఆంధ్ర ప్రాంతంలో న్యాయ పరిపాలనలో పాత పద్ధతిని తిరిగి ప్రవేశపెట్టే ప్రశ్నే లేదని న్యాయ శాఖ మంత్రి శ్రీ కె. వి. నారాయణరెడ్డి నేడు స్పష్టంచేశారు.

ప్రతి తాలూకాకు మునిసిఫ్-మాజిస్ట్రేటు కోర్టును నెలకొల్పే తెలంగాణా పద్ధతిని 11 ఆంధ్ర జిల్లాలలోని ఎనిమిది జిల్లాలలో ప్రవేశపెట్టడం జరిగిందని, ఈ పద్ధతి పని చేసే తీరుతెన్నులు సంతృప్తికరంగా వున్నవని మంత్రి శ్రీ నారాయణరెడ్డి నేడు పత్రికలవారికి తెలియజేశారు.

చిన్న చిన్న పట్టణాలలోను, తాలూకాలలోని న్యాయవాదులు ఈ కొత్త పద్ధతి పట్ల హర్షం వెలిబుచ్చారని ఆయన అన్నారు. అయితే మరణవాఙ్మూలాలు నమోదు చేయడానికి హాజరు కావలసిందిగా మాజిస్ట్రేట్లను కోరడంవల్ల వాస్తవంగా న్యాయ నిర్వహణ కార్యక్రమం మందగిస్తున్నట్టు కొన్ని ఫిర్యాదులు వచ్చినప్పటికి, ఈ కొత్త పద్ధతి సంతృప్తికరంగానే వున్నదని ఆయన తెలిపారు.

ఈ కొత్త పద్ధతిని ప్రవేశపెట్టడం వల్ల తమ పక్షుల ప్రయోజనాలు దెబ్బతిన్నట్లు కొన్ని జిల్లాల బార్ కౌన్సిల్స్ విజ్ఞప్తి చేసినట్లు కూడా ఆయన తెలిపారు. ఈ పథకం పనిచేసే తీరుతెన్నులు గురించి పరిశీలించడానికి హైకోర్టుతో సంప్రదించిన మీదట ఒక స్పెషలాఫీసరను ప్రభుత్వం నియమించింది.

ఈ పథకం నిర్వహణలోని కొన్ని అంశాల గురించి స్పెషలాఫీసర్ తన నివేదికలో సూచించారు. వాటిని పరిశీలించడం జరుగుతుందని మంత్రి చెప్పారు. కొన్ని కోర్టులలో [illegible] చాలా వరకు అపరిష్కృతంగా వుండిపోతున్న దృష్ట్యా అటువంటి లోపాలను సవరించవలసిన అవశ్యకతను ప్రభుత్వం గుర్తించినదని.

కాని పాతపద్ధతిని తిరిగి ప్రవేశపెట్టవలసిన అవశ్యకత ప్రభుత్వానికి కానరావడంలేదని ఆయన అన్నారు.

ఈ కొత్త పథకం అన్ని వర్గాల మోదం పొందినదని, సంతృప్తికరంగా పని చేస్తున్నదని అందువల్ల న్యాయ పరిపాలనలో పాత పద్ధతిని తిరిగి ప్రవేశపెట్టవలసిన అవసరంలేదని ప్రభుత్వం భావిస్తున్నదని ఆయన తెలిపారు.

అవసరమైన చోట్ల అడిషనల్ కోర్టులను ప్రభుత్వం ఏర్పాటు చేయగలదని మంత్రి హామీ ఇచ్చారు.

విమానాశ్రయాలలో యాత్రిక సౌకర్యాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 17— పౌర విమానయానం యాత్రికశాఖమంత్రి డాక్టర్ కరణ్‌సింగ్ ఆగస్టు 20వ తేదీన బయలుదేరి మాస్కో, లండన్, వాషింగ్టన్, న్యూయార్క్, మాంట్రియల్‌కు వెడతారు.

ఈ నగరాలలోని అంతర్జాతీయ విమానాశ్రయాలలో యాత్రికులకై కల్పించినసౌకర్యాలను డాక్టర్ కరణ్‌సింగ్ పరిశీలిస్తారు. పాలెం, శాంతాక్రజ్, మద్రాస్ విమానాశ్రయాలలో ఇట్టి సౌకర్యాలను కల్పించాలని ప్రభుత్వం ఉద్దేశిస్తున్నది.

డాక్టర్ కరణ్‌సింగ్ ఎయిర్ ఇండియా కార్యాలయాలను కూడాచూచి వాటిలో ప్రయాణికుల సౌకర్యార్థం చేయవలసిన మార్పులను పరిశీలిస్తారు. లండన్ న్యూయార్క్‌లలో ట్రావెల్ ట్రేడ్ ప్రతినిధులను కలుస్తారు. ఢిల్లీకిసెప్టెంబర్ మూడవ తేదీనఆయన తిరిగి వస్తారు.

పెత్తందారు

"మొక్కుపై మొక్కు"


"తిరపతి వెళ్ళామనుకుంటున్నాను బాబూ! మొక్కుబడి వుంది."
"వెళ్ళేముందు ఓ పని చెయ్యి భద్రం!"
ఏమిటి బాబూ!
"సక్రమంగా తిరిగి వస్తేమళ్ళీ ఓ సారి స్వామి దర్శనం చేసుకుంటానని మొక్కుకో!"
చిత్తం! చిత్తం!

సంక్షిప్త వార్తావళి

ఫ్లోరిడాలోని (అమెరికా) మియామీ జంతు ప్రదర్శనశాలకు భారత ప్రభుత్వం రెండు గున్నఏనుగులను కానుకగా ఇచ్చింది. అవి రెండేళ్ళు, ఒక ఏడాది వయస్సు కలవి. ఒకటి మగఏనుగు దానిపేరు దలీప్. రెండవది ఆడఏనుగు దానిపేరు సీత. వాటిని కేరళప్రభుత్వం నుంచి సేకరించారు.

• • •

న్యూఢిల్లీలోని అమెరికా దౌత్య ప్రతినిధి శ్రీ జోసెఫ్‌గ్రీన్ ఆగస్టు 16 వ తేదీన విదేశాంగమంత్రి శ్రీ ఎం.సి. చాగ్లాను కలుసుకున్నారు. పశ్చిమ ఆసియా సంక్షోభంపై ఇండియా అమెరికాల మధ్య సాగుతున్న సంప్రతింపులలో వారి చర్చలు భాగమని భావిస్తున్నారు. ఇటీవల వాషింగ్టన్‌లో భారత రాయబారి శ్రీ బి.కె. నెహ్రూ అమెరికా విదేశాంగ మంత్రి శ్రీ డీన్‌రస్క్‌తో చర్చలు జరిపారు.

• • •

పొలాలలో ఒంటరిగా వున్న ఒక ఇంటిలో నివసిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన తొమ్మండుగురు సభ్యులను హత్య చేయడం మొత్తం కెనడాకు దిగ్భ్రాంతి కలిగించింది. ఈ దారుణ సంఘటన సస్కట్‌చెవాన్‌కు సమీపాన జరిగింది. హంతకుని కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. హతులలో కుటుంబ యజమాని జేమ్స్ పీటర్‌సన్, (47) ఆయన భార్య ఏడుగురు పిల్లలు వున్నారు. ఒక్క నాల్గేళ్ళ బాలిక మాత్రం సజీవంగా వున్నది.

• • •

పాకిస్తాన్‌కు మంజూరుచేసిన ఋణాలను ప్రయివేటు సంస్థలు, ఆర్థిక సహాయం చేయడానికై వినియోగించడానికి పోలెండు, చెకొస్లోవాకియా అంగీకరించినట్టు పాకిస్తాన్ ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షుడు మిర్జా ముజఫర్ అహ్మద్ తెలియజేసినట్టు కరాచీ వార్త. ప్రాగ్, వార్సా, వాషింగ్టన్‌లను సందర్శించి వచ్చిన తర్వాత శ్రీ అహ్మద్ ఈ విషయాన్ని వెల్లడిస్తూ ఇతోధిక ఋణ సహాయానికై తాముచేసిన విజ్ఞప్తిని పరిశీలించడానికి చెక్ బృందమొకటి రానున్న రెండు మాసాలలో తమదేశాన్ని సందర్శించనున్నట్టు తెలిపారు.

• • •

నేపాల్ ఈ సంవత్సరం 35 వేల టన్నుల సిమెంటును దిగుమతి చేసుకొననున్నట్టు ఖట్మండూ వార్త. అందులో 32 వేల టన్నులను ఇండియా ఒక్కటే సరఫరా చేయనున్నట్టు ఆగస్టు 17 వ తేదీన జాతీయ వార్తాసంస్థ వెల్లడించింది. మిగిలిన మూడు వేల టన్నుల సరకు రష్యా, చైనాల నుంచి దిగుమతి కానున్నది.

• • •

చైనా సాంస్కృతిక విప్లవ పరిణామాలు

ప్రావ్దా పత్రిక వ్యాఖ్య

మాస్కో, ఆగస్టు 17— చైనాలో సాంస్కృతిక విప్లవంవల్ల ఉత్పన్నమైన భీకరమైన పరిస్థితి, విపరీత పరిణామాలు మావో సిద్ధాంతాలు విఫలమైనాయనడానికి సూచన అని సోవియట్ కమ్యూనిస్టుపార్టీ దినపత్రిక ప్రావ్దా నిన్న సంపాదకీయంతో కూడిన వ్యాసాన్ని ప్రచురించింది. ఈ విప్లవం చైనాను మిగతా ప్రపంచం నుంచి వేరు చేస్తున్నదని అభిప్రాయపడింది.

మావో సేటుంగ్ స్వయంగా నాయకత్వం వహిస్తున్న సాంస్కృతిక విప్లవం చైనా ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా పరిణమిస్తున్నదని దానికి సంస్కృతితో, కాని సోషలిస్టు విప్లవంతో కాని సంబంధం లేదని ఈ వ్యాసంలో ప్రావ్దా పేర్కొన్నది.

ఈ సాంస్కృతిక ఉద్యమం పార్టీని యువ కమ్యూనిస్టు లీగను అభ్యుదయ శక్తులగు రైతులను కార్మికులను అణచడానికి ఒక ముసుగుగా వినియోగించుకుంటున్నారని ప్రావ్దా ప్రచురించిన వ్యాసంలో అభిప్రాయపడడం జరిగింది. ఆ వ్యాసంలో ఇంకా ఇలా కలదు:–

"లక్షలాది ప్రజలు ఆకలిబాధతో మరణించారు. ఈ విప్లవం నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించలేకపోయింది.

చైనా కమ్యూనిస్టుపార్టీలోను, ప్రజలలోను అసంతృప్తి పెరుగుతున్నది. పికింగ్ నాయకులు సృష్టిస్తున్న ఆర్థిక రాజకీయ విపరీత పరిణామాలను ప్రజలు సహించలేకుండా ఉన్నారు.

వుహాన్, షాంఘై క్వాంగ్‌చౌ, చుంకింగులోను టిబెట్, ఇన్నర్ మంగోలియాలలోను జరుగుతున్న సాయుధ సంఘర్షణలు కొత్త క్లిష్టతలను సృష్టించగలవు.

చైనా సైన్యంలోకూడా మావో ఇజంపై వ్యతిరేకత హెచ్చుతున్నది.

పికింగ్‌లోని సోవియెట్ దౌత్య కార్యాలయం

పికింగ్‌లోని సోవియెట్ దౌత్య కార్యాలయంపై చైనా రెడ్‌గార్డులు కొత్త దాడులను ప్రారంభించారని సోవియెట్ కమ్యూనిస్టుపార్టీ పత్రిక ప్రావ్దా తెలుపుతున్నది.

ప్రావ్దా పత్రిక రెడ్ గార్డులు సోవియెట్ దౌత్య కార్యాలయంపై జరిపిన దాడులను ఖండించడం మినహా వివరాలను ఏమి ప్రచురించలేదు.

కేరళలో కడచిన కొన్ని వారాలలో విద్యార్థుల ఆహారాందోళన కొనసాగినందువల్ల రోడ్డు రవాణా సంస్థకు చెందిన 75 బస్సులకు నష్టం వాటిల్లినట్టు తిరువేంద్రం వార్త

ప్రపంచాధిపత్యంకోసం పీకింగ్ తహతహ

జపాన్ విదేశాంగమంత్రి టొకియోమికితో చర్చలలో భారత ఉపప్రధాని వివరణ

ఆసియాలో చైనా పెద్ద ప్రమాదకారిగా రూపొందినదని ఉభయదేశాల నాయకుల అంగీకారం

టోక్యో, అగస్టు 17— ప్రపంచాధిపత్యం కోసం చైనా యత్నిస్తున్న దృష్ట్యా చైనాపట్ల ఇండియా అప్రమత్తతతో వ్యవహరించక తప్పదని జపాన్ విదేశాంగ మంత్రితో భారత ఉప ప్రధాని శ్రీ మురార్జీదేశాయ్ చెప్పినట్టు నిన్న ఇక్కడ తెలియవచ్చింది.

అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక పరిస్థితి, ముఖ్యంగా ఆగ్నేయాసియా పరిస్థితిని గురించి నిన్న ఉదయం వీరువురు 90 నిమిషాలపైగా చర్చలు జరిపారు.

ఉభయదేశాలమధ్య సంబంధాలతోపాటు చైనా ప్రమాదం, వియత్నాం పోరాటం, ప్రాంతీయ సహకారానికి సంబంధించిన సమస్యలుకూడా ఈ సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్టు తెలుస్తున్నది.

ఆసియా ఖండానికి చైనా ప్రమాదకారిగా వున్నదన్న ఇండియా అభిప్రాయంలో జపాన్ ఏకీభవించినట్టు తెలుస్తున్నది.

ప్రస్తుతం చైనాలో జరుగుతున్న సాంస్కృతిక విప్లవం ఫలితంగా చైనా విదేశాంగ విధానంలో ఎట్టిమార్పు రానున్నదో ఊహించడం కష్టమని రెండు దేశాల నాయకులు అంగీకరించారు.

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడానికి తగినంత సమాచారం లభించలేదని వారు భావించారు.

చైనాతో శాంతియుత సహజీవనం నెరపాలని ఇండియా అభిలషిస్తున్నదని, అయితే చైనా అందుకు అనుగుణంగా వ్యవహరించడంలేదని శ్రీ దేశాయి చెప్పారు.

చైనా ఏనాటికైనా శాంతియుతసహజీవన సిద్ధాంతానికి అంగీకరించగలదన్న ఆశాభావాన్ని ఆయన వెలిబుచ్చారు.

చైనా వైఖరిలో మార్పు వచ్చిన సూచనలు ఏవీ లేవని శ్రీ దేశాయ్ చెప్పారు. అంతే గాకుండా ఇండియా, పాకిస్తాన్‌ల వివాదాలలో చైనా ప్రత్యక్షంగా జోక్యం చేసుకొంటున్నదని కూడా శ్రీ దేశాయ్ అన్నారు. ఈ పరిస్థితుల వల్ల కమ్యూనిస్టు చైనా పట్ల అప్రమత్తతతో మెలగవలసిన ఆవశ్యకత కలదని శ్రీ దేశాయ్ స్పష్టం చేశారు.

వియత్నాం సమస్య

వియత్నాం సమస్యల పరిష్కార మార్గం కనుగొనవలసినది వియత్నాం ప్రజలేనని ఇండియా, జపాన్ నాయకులు అంగీకరించారు.

అంతర్జాతీయ పర్యవేక్షక సంఘం అధ్యక్షహోదాలో ఇండియా వియత్నాం సమస్య పరిష్కారానికి కృషిచేయ వచ్చునని ఒక దశలో జపాన్ విదేశాంగ మంత్రి శ్రీ మికి సూచించారు.

అయితే ఈ సూచనతో శ్రీ దేశాయ్ ఏకీభవించలేదు.

ఆసియా ఆర్థికాభివృద్ధికి ఇండో-జపాన్ సహకారం

ఆసియాని ఆర్థికాభివృద్ధిలో ఇండో-జాపనీస్ సహకారాన్ని గురించి ప్రముఖంగా చర్చించారు. అట్టి సహకారం అత్యవసరమని ఉభయులు అంగీకరించారు.

ఈ ప్రాంతానికి ఆర్థిక సహకారాన్ని పెంపొందించడంలో జపాన్ పాత్రను మికి వివరించారు.

ఇండో-జాపనీస్ సంబంధాలు

ఇండో-జాపనీస్ సంబంధాలను గురించి కూడా సుదీర్ఘంగా చర్చలు జరిపారు. రెండు దేశాల మధ్య సంబంధాలు పరస్పర సహకారం ప్రాతిపదికగా అభివృద్ధి చెందడంపట్ల శ్రీ మికి సంతృప్తి వెలిబుచ్చారు.

ఇండియా ఆర్థిక పరిస్థితిని గురించి శ్రీ దేశాయి సమగ్రంగా వివరించారు. భారత ఆర్థిక వ్యవస్థను సుస్థిరం చేయడానికి చేపట్టిన పథకాలను గురించి ఆయన వివరించారు.

తమ సమస్యలను తాము పరిష్కరించుకొనవలసిన ఆవశ్యకతను ఇండియా గుర్తించినదని ఆయన అన్నారు.

ఇండో-పాక్ సంబంధాలు

రాజకీయ, ఆర్థిక రంగాలలో ఇండియా ఎదుర్కొంటున్న చిక్కులను వివరించేటప్పుడు పాకిస్తాన్‌తో ఇండియా సంబంధాలను గురించి వివరించారు

జపాన్ ఆర్థిక మంత్రితో శ్రీ దేశాయ్ చర్చలు

నిన్న జపాన్ ఆర్థిక మంత్రితో శ్రీ మురార్జీదేశాయ్ చర్చలు జరిపారు.

శ్రీ మురార్జీ గౌరవార్థం జపాన్ విదేశాంగ మంత్రి విందు

భారత ఉపప్రధాని శ్రీ మురార్జీ దేశాయ్ రెండవరోజు కార్యక్రమం నిన్న జపాన్ విదేశాంగ మంత్రి టేకియోమికి ఏర్పాటు చేసిన విందుతో ముగిసింది.

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం

నోటిఫికేషన్

1967 సెప్టెంబరులో జరుగు యూనివర్సిటీ పరీక్షలు ఈ క్రింద తెలిపిన తేదీలలో జరుగును. సవివరమైన టైమ్ టేబుల్స్ కాలేజీల ప్రిన్సిపాల్సుకు పంపబడును. అంతేకాక ఈ టైమ్ టేబుల్స్ సెప్టెంబర్ మొదటి వారంలో ఆంధ్రప్రదేశ్ గజెట్‌లో ప్రచురించబడును.

క్ర. నెం. పరీక్ష పేరు

1. పార్టు I బి.ఎ. బి.ఎస్.సి. బి.కాం. డిగ్రీ (మూడేళ్ళ పాత నిబంధనలు) పార్టు I మొదటి సంవత్సరం బి.ఎ. బి.ఎస్.సి. బి.కాం. డిగ్రీ (రివైజ్డ్ నిబంధనలు) పరీక్షలు
ప్రారంభమగు తేదీ: 18 సెప్టెంబర్ 1967.
2. పార్టు I సెకండ్ ఇయర్ బి.ఎ. బి.ఎస్‌సి. & బి.కాం. డిగ్రీ (రివైజ్డ్ రెగ్యులేషన్స్) పరీక్షలు.
ప్రారంభమగు తేదీ: 19 సెప్టెంబర్ 1967
3. పార్టు II ఆఫ్ బి.ఎ., బి.ఎస్‌సి బి.కాం. డిగ్రీ (మూడేళ్ళ పాత నిబంధనలు) మరియు పార్టు II ఆఫ్ మొదటి సంవత్సరం బి.ఎ.,బి.ఎస్.సి & బి.కాం. డిగ్రీ (రివైజ్డు రెగ్యులేషన్స్) పరీక్షలు
ప్రారంభమగు తేదీ: 25 సెప్టెంబర్ 1967
4. పార్టు II. ఆఫ్ సెకండ్ ఇయర్ బి.ఎ. బి.ఎస్‌సి & బి. కాం. డిగ్రీ (రివైజ్డ్ రెగ్యులేషన్స్) పరీక్షలు
ప్రారంభమగు తేదీ: 26 సెప్టెంబర్ 1967
5. పార్టు II ఆఫ్ థర్డు ఇయర్ బి.ఎ. బి. ఎస్‌సి. & బి కాం డిగ్రీ (రివైజ్డ్ రెగ్యులేషన్స్) పరీక్షలు
ప్రారంభమగు తేదీ: 27 సెప్టెంబర్ 1967

హాల్ టికెట్‌లు, టైమ్ టేబుల్స్ మరియు అభ్యర్థులకు సూచనల ప్రతులను పరీక్ష కేంద్రములలోని చీఫ్ సూపరింటెండెంట్లకు పంపించెదరు. వీరివద్దనుంచి అభ్యర్థులు తమతమ హాల్ టికెట్‌లను ఆయా పరీక్షల ప్రారంభమగుటకు మూడు రోజులుముందుగా తీసుకోవలెను.

(సం) కె.వి.వి. సుబ్బరాజు,
రిజిస్ట్రార్.

కొత్త ఏజంటు

17-8-67 నుండి "ఆంధ్రజ్యోతి" దినపత్రిక వారపత్రికలను వారిస్వంత బాధ్యతపై విక్రయించుటకు ఏజంటుగా ఈ క్రిందివారిని నియమించడమైనది.

వి. వెంకన్న
ప్రొ॥ విజయలక్ష్మీ పాన్ షాప్ &
న్యూస్ ఏజంటు
సిద్దిపేట — మెదక్ జిల్లా

సర్క్యులేషన్ మేనేజర్,
"ఆంధ్రజ్యోతి".
విజయవాడ.2.

పరిష్కృత ప్రకటన

రూ 20/-లకే వాచి

మేము కొత్తగా కనిపెట్టిన స్కీముద్వారా రు 147/-లు విలువగల రోమర్ సావ్యుకైర్ వాచి రు 20/- లకే పొందండి. ఈ రోజే ఆర్డరు చేయండి. **Romer Agencies (AJ—15) Box 1441, DELHI-6**

కొలంబో వద్ద చైనా నౌకలో చోరీలు

సింహళంలోని మావో అనుకూల వర్గాలే కారణమా?

కొలంబో, అగస్టు 17—చైనా నౌకల నుంచి సరకు దొంగతనం చేస్తున్నది చైనా ఏజెంట్లేనా,

తమ నౌక నుంచి "దొంగతనాలు" జరుగుతున్నవని చైనా పంపిన నిరసనలపై స్థానిక పత్రికలు అనుమానాలు వెలిబుచ్చుతున్నవి.

ఈ దొంగతనం చేస్తున్న వారిలో కొంత మంది సింహళంలోని మావో ముఠాకు చెందినవారు కావచ్చునని ఒక పత్రిక పేర్కొన్నది.

ఈ రేవులలో వున్న కూలీల ముఠాలకు ఏ రాజకీయ పక్షంతో సంబంధం కలదో దర్యాప్తు జరపాలని సింహళం విదేశాంగశాఖ భావిస్తున్నట్టు "సిలోన్ అబ్జర్వర్" పత్రిక తెలియచేసింది.

చట్ట వ్యతిరేక చర్యల నిరోధం బిల్లు

స్వతంత్ర పార్టీ నాయకుడు దహ్యాభాయ్‌పటేల్ విమర్శ

న్యూఢిల్లీ, అగస్టు 17.1967వ సంవత్సరపు అక్రమ కార్యకలాపాల నిరోధం బిల్లును నిన్న రాజ్యసభలో స్వతంత్రపార్టీ నాయకుడు శ్రీ దహ్యాభాయ్‌పటేల్. పి. ఎస్. పి. సభ్యుడు శ్రీ త్రిలోకిసింగ్ వ్యతిరేకించారు.

16 వ రాజ్యాంగ సవరణవటం ఇప్పుడు ప్రవేశపెట్టబడిన బిల్లు ఉద్దేశాన్ని నెరవేర్చగలదని వారు అన్నారు. 16 వ సవరణ చట్టం వేర్పాటు కార్యకలాపాలను చట్ట వ్యతిరేకంగా ప్రకటించింది. రాజ్యాంగంలో 19వ సూత్రం కూడా ఇటువంటినియంత్రణలనే విధిస్తున్నదని శ్రీ పటేల్ అన్నారు. కాబట్టి ఈ బిల్లును ఎందుకు ప్రవేశపెట్టారో తనకు అర్థం కావడం లేదని ఆయన అన్నారు. రాజ్యాంగంలో 32 వ సూత్రం పార్లమెంటు ఇటువంటి శాసనాలను చేయకూడదని నిషేధిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

ఈ బిల్లు వాక్‌స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛగా ఉద్యమాలను నడపడాన్ని నిషేధిస్తున్నట్టు ఆయన చెప్పారు.

దొడ్డిదారిన అధికారాన్ని హస్తగతం చేసుకొనడానికి, ప్రజల ప్రాథమిక హక్కులను హరించడానికి ఈ బిల్లు ఉద్దేశింపబడిందని స్వతంత్ర పార్టీ నాయకుడు అన్నారు.

ఇటువంటి శాసనాలను ప్రవేశపెట్టినందుకు న్యాయశాఖ ఇది వరకే ప్రభుత్వాన్ని విమర్శించిందని ఆయన అన్నారు.

పార్లమెంటు జాయింట్ సెలెక్టు కమిటీ వత్తిడికి లొంగకుండా బిల్లుకుసంబంధించిన అన్ని విషయాలను నిష్పక్షపాతంగా పరిశీలించాలని ఆయన అన్నారు. గత సంవత్సరం ప్రవేశ పెట్టబడి ప్రజాభిప్రాయం ఒత్తిడి ఫలితంగా తిరిగి ఉపసంహరించుకోబడిన బిల్లుకంటే ఇప్పుడు ప్రవేశపెట్టబడిన బిల్లు ఎంతమాత్రం మేలైనది కాదని ఆయన అన్నారు.

పశ్చిమ ఆసియాపై ప్రధాని ఇందిరకు టిటో సందేశం

కయిరో, అగస్టు 17— యుగోస్లావియా అధ్యక్షులు టిటో భారత ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధికి ఒక సందేశాన్ని కైరోలోని భారత రాయబారికి అందజేశారు.

ఈ సందేశంలోని విషయాలేమిటో తెలియరాలేదు. కాని పశ్చిమ ఆసియా సంక్షోభంపై అలీన రాజ్యాలు అనుసరించవలసిన పాత్ర గురించి దీనిలో ప్రస్తావించబడి ఉండవచ్చని రాజకీయ వర్గాలు తలుస్తున్నాయి.

దమాస్కస్, బాగ్దాద్‌లలో సిరియా, ఇరాక్ అధినేతలతో సంప్రదించి యుగోస్లావియా అధ్యక్షులు టిటో నిన్న ఇక్కడికి వచ్చారు. పశ్చిమ ఆసియాపై రెండవసారి సంప్రదింపులకై టిటో, నాసరులు రైలులో నిన్న రాత్రి అలెగ్జాండ్రియా వెళ్ళారు.

ఇరాక్ అధ్యక్షునికి టిటో ఆహ్వానం

బాగ్దాద్, అగస్టు 17— ఇరాక్ అధ్యక్షులు అబ్దుల్ రహమాన్ ఆరిఫ్‌ను యుగోస్లావియాను సందర్శించవలసిందిగా మార్షల్ టిటో ఆహ్వానించారు. టిటో ఆరిఫ్‌లు రెండు రోజులు సంప్రదించిన మీదట వెలువడిన సమష్టి ప్రకటనలో ఈ అంశాన్ని వెల్లడించారు.

ఆరిఫ్ యుగోస్లావియా ఎప్పుడు వెళ్ళేదీ తేదీ నిర్ణయంకాలేదు. ఈ ఇరువురు నాయకులు పశ్చిమ ఆసియా సమస్య, ఉభయ దేశాలు ఎదుర్కొంటున్న అంతర్జాతీయ సమస్యలను చర్చించారు.

పాకిస్తాన్ విదేశాంగ మంత్రి పీర్జాదా

బీరూట్, అగస్టు 17— పాకిస్తాన్ విదేశాంగ మంత్రి షరీఫుద్దీన్ పీర్జాదా లెబనాన్ విదేశాంగ మంత్రి డాక్టర్ జార్జి హకీంతో పశ్చిమ ఆసియా పరిస్థితి చర్చించారు. జెరూసలేమ్‌లోని అరబ్ విభాగం అరబ్ భూభాగాల నుంచి ఇజ్రయేలీను వెళ్ళగొట్టడం గురించి వీరు ఉభయులూ చర్చించారు. పీర్జాదా పాకిస్తాన్ మొదటి నుంచి అరబ్ రాజ్యాలను సమర్థిస్తూనే ఉన్నదని ప్రకటించారు.

బ్రిటిష్ విదేశాంగ మంత్రి అభిప్రాయం

ఆస్లో, అగస్టు 17— పశ్చిమ ఆసియా సమస్య పరిష్కారానికి ఐక్యరాజ్య సమితే సరైన వేదిక అని బ్రిటిష్ విదేశాంగ మంత్రి జార్జిబ్రౌన్ పేర్కొన్నారు.

నార్వే రాజధానికి వచ్చిన సందర్భంగా పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ జార్జిబ్రౌన్ సూయెజ్ కాలువను తెరవడం నౌకా వాణిజ్య రాజ్యాలకు మాత్రమేకాక వర్ధమాన దేశాలకు కూడా అవసరమని అభిప్రాయపడినారు.

ఈ కాలువ మూసివేత బ్రిటిష్ ఆర్థిక వ్యవస్థకు అధికభారమైనా దీన్ని తెరిపించే విషయమై అది ఏమీ చేయజాలదని జార్జిబ్రౌన్ అన్నారు. భద్రతాసంఘం ఈ సమస్యకు పరిష్కారాన్ని అన్వేషించాలని ఆయన సూచించారు.

మిజో దుండగుల దాడిలో ఇద్దరు పోలీసుల మృతి

చురాచంద్‌పూర్ సబ్‌డివిజన్‌లో జరిగిన సంఘటనలో మరికొందరికి గాయాలు

ఇంఫాల్, అగస్టు 17— మణిపూర్‌లో కల్లోలిత ప్రాంతమైన చురాచంద్‌పూర్ సబ్ డివిజన్‌లోని కాంగ్‌కాప్ సమీపంలో సెంట్రల్ రిజర్వు పోలీసు దళంపై ఆటోమాటిక్ ఆయుధాలను ధరించిన కుకీ, మిజో దుండగులు ఆకస్మిక దాడి జరపగా ఇద్దరు పోలీసులు మృతి చెందినట్టు నేడు అధికారరీత్యా తెలియవచ్చింది.

ఈ ప్రాంతం ఎగువబర్మా పరిహద్దులో వున్నది. మొన్న 14వ తేదీన ఈ సంఘర్షణ జరిగినట్టు అధికారరీత్యా అందిన వార్తలు తెలుపుతున్నవి.

నలుగురు సాయుధ పోలీసులకు ఈ సంఘర్షణలో తీవ్రంగా బుల్లెట్ గాయాలు తగిలాయి.

ఈ వార్త అందిన వెంటనే అదనపు పోలీసు దళాలను ఆ ప్రాంతానికి హుటాహుటిని తరలించడం జరిగింది.

ఇక్కడకు అందిన సమాచారం ప్రకారం. సెంట్రల్ రిజర్వు పోలీసు దళానికి. కుకీ, మిజో దుండగులకు మధ్య గత 14 వ తేదీన జిరిబమ్ సబ్ డివిజన్ లో ఫాయిజాక్ ముంట్ వద్ద తీవ్రంగా తుపాకులతో పోరాటం జరిగిందని ఈ సంఘర్షణలో నలుగురు పోలీసులు మృతిచెందారని తెలుస్తున్నది. తరువాత నలుగురు మిజో దుండగుల మృత దేహాలను అడవులనుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నిన్న ఇక్కడకు చేరిన మరొక సమాచారం ప్రకారం చురాచంద్‌పూర్ సబ్ డివిజన్‌లో దట్టమైన అడవిలో సదరు తేదీన సైనికులకు, విద్రోహుల ముఠాకు మధ్య జరిగిన తీవ్ర సంఘర్షణలో తొమ్మిదిమంది కుకీ, మిజో దుండగులు మరణించారు.

ఆటోమేటిక్ ఆయుధాలు ధరించిన సుమారు మూడు వందలమంది నాగాదుండగులు ఇటీవల ఉఖ్రుల్ సబ్ డివిజన్‌లోని కాల్పుల విరమణ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించినట్టు విశ్వసనీయవర్గం నుంచి అందిన వార్తలు తెలుపుతున్నాయి.

అజ్ఞాత నాగాల సైన్యంలో బ్రిగేడియరుగా వ్యవహరించబడుతున్న ఏవోహెసమా నాయకత్వాన ఒక ముఠా చివాజ్ జరోయ్‌లోని నాగ గ్రామ వాసుల నుంచి బలవంతంగా ఏడు వేల రూపాయల రొక్కాన్ని, కొంత బియ్యాన్ని సేకరించినట్టు తెలుస్తున్నది.

మాలాసిన్హామీద కేసుపెట్టనందుకు రాజ్యసభలో విమర్శ

న్యూఢిల్లీ, అగస్టు 17— సినిమాతార కుమారి మాలాసిన్హా మీద ప్రాసిక్యూషన్ కేసు నడపనందుకు రాజ్యసభలో నిన్న కాంగ్రెసు సభ్యులు, ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు.

తనవద్ద నున్నడబ్బు నేపాలుకు చెందిన ఒక రాణాది అని మొదట చేసిన ప్రకటనను మాలాసిన్హా తరువాత ఉపసంహరించుకొంది.

ఈ విషయంపై అవిరామంగా వస్తున్న ప్రశ్నలకు సమాధానంగా ఆర్థికశాఖ స్టేట్ మంత్రి శ్రీ కె. సి. పంత్ కుమారి మాలాసిన్హా ఇంటిమీద ఇన్‌కమ్‌టాక్స్ అధికారులు దాడిజరిపారని కొంతడబ్బునుకూడ స్వాధీనం చేసుకున్నారని అన్నారు. మొదట ఈ డబ్బు నేపాలుకు చెందిన ఒక రాణాది అని కుమారి మాలాసిన్హా చెప్పిందని, తరువాత దానిని ఉపసంహరించుకొని ఆదాయపు పన్ను కట్టిందని శ్రీ పంత్ అన్నారు. మాలాసిన్హా 13.5 లక్షలు తనవద్ద ఉన్నట్టు ప్రకటించిందని ఆయన అన్నారు.

ఇటలీ రేవు

చైనా నౌక "లిమింగ్"

జెనోవా (ఇటలీ), అగస్టు 17— ప్రచార వివాదాలను పెద్ద పెట్టున ప్రదర్శిస్తూ వుండే చైనా నౌక మంటపీటికై చేసిన విజ్ఞప్తిని ఇటలీ రేవు అధికారులు నిన్న నిరాకరించారు. ఇటలీ రేవు అధికారులు ఆ వివాదాలను నిర్మూలించాలని లేకుంటే రేవు నుంచి వెళ్ళిపోమ్మని ఈ నౌకను కోరారు. ఈ వాణిజ్య నౌక పేరు "లిమింగ్".

సౌదీఅరేబియా సాయుధ దళాలకు పాకిస్తాన్ శిక్షణ

వచ్చే నెలనుంచి ప్రారంభం

న్యూఢిల్లీ, అగస్టు 17— సౌదీఅరేబియా రక్షణ దళాలకు వచ్చే నెలారంభం నుంచి పాకిస్తాన్ శిక్షణ గరపుతుంది. ఈ సందర్భంలో త్రివిధ బలాలకు చెందిన ప్రతినిధివర్గం త్వరలో ఆ దేశం సందర్శిస్తుంది.

ఈ మేరకు అగస్టు ఏడవ తేదీన రావల్పిండిలో ఒక ఒప్పందం కుదిరింది.

ఈ కొత్త ఒప్పందం క్రింద సౌదీఅరేబియన్ సాయుధ దళాలకు పాకిస్తాన్ నిపుణులు శిక్షణ గరుపుతారు. సౌదీఅరేబియాకు పాకిస్తాన్ నుంచి సహాయం, సాంకేతిక సలహాలు కూడా లభిస్తాయి.

తమ సేనలకు అత్యంతాధునిక సామగ్రిని సరఫరా చేయవలసినదిగా బ్రిటన్, అమెరికా ప్రభుత్వాలకు సౌదీఅరేబియా ఇటీవల కోరింది.

ఎం. ఆర్. రాధ కేసు విచారణ

సైదాపేట హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణన్ సాక్ష్యం

మద్రాసు, అగస్టు 17— ప్రస్తుతం ఇక్కడ సెషన్స్‌కోర్టు విచారణ జరుపుతున్న ఎం. ఆర్. రాధ కేసులో సైదాపేట పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణన్. ఎం. జి. ఆర్. గార్డెన్స్‌లో సూపర్‌వైజర్ రత్నం నిన్న ప్రాసిక్యూషన్ తరపునసాక్ష్యం చెప్పారు.

లక్ష్మణన్ తన సాక్ష్యంలో ఇలా చెప్పాడు:

"నేను సైదాపేట పోలీస్ స్టేషన్ నుండి రాధవెంట రాయపేట ఆసుపత్రికి వెళ్ళాను. రాధ తనను ఆసుపత్రిలో కారు నుంచిదింపి చక్రాలుగల స్ట్రెచర్ మీద పడుకుండగా ఏవో విషయాలు వ్రాసుకున్న నాల్గుపేజీల పేపర్లు నాకు ఇచ్చారు. మొదటి మూడు పేజీలు కార్బన్ పేపర్‌తో వ్రాసినవి. నాల్గవది సిరాతో వ్రాసినది. ప్రతి పేజీమీద రాధ సంతకం వున్నది.

"నేను ఆ పేపర్‌లోని అంశాలను ఒక పారి స్థూలంగా చదివిన తర్వాత దాని మీద సంతకం పెట్టాను. ఆ పేపర్‌ను నేను చెంగల్పట్టు పోలీసు సూపరింటెండెంటుకు అదే రోజున అప్పగించాను. ఆ పేపర్ మీద రక్తపు మరకలు వున్నాయి."

క్రాస్ పరీక్షలో సాక్షి ఇలా చెప్పాడు. "రాధ నాకు ఏ పేపరును ఇవ్వలేదనడం నిజం కాదు. తెల్ల కాగితం మీద ముద్దాయి సంతకాన్ని పెట్టించామనడం కూడా నిరాధారం.

రత్నం సాక్ష్యం

రత్నం ఇలా సాక్ష్యం చెప్పాడు: "ముద్దాయి. నేను జనవరి 12 వ తేదీ సాయంకాలం 5 గంటలకు ఎం. జి. ఆర్. గార్డెన్స్‌కు వచ్చారు. రిసెప్షన్ హాలులోకి తోడ్కొని వెళ్ళాను.

"ఎం. జి. రామచంద్రన్ క్రిందకు దిగి, రిసెప్షన్ హాలుకు వచ్చిన తర్వాత కొద్దిసేపటికి నాకు శబ్దం వినిపించింది.

ఆ తర్వాత కొద్ది సేపటికే, పోర్టికోలో వి.ఎన్. జానకి, కళ్యాణి. పరిపూర్ణమ్మాళ్ పరితపిస్తూ ఏడ్చుచు వుండడం నేను చూశాను. చేతిలో రివాల్వరుతో వున్న రాధను కూడా నేను చూశాను. పండితుడు ఆ సమయంలో నాను వెనకనే వస్తున్నారు.

"వాసు నాకు రివాల్వర్ ఇచ్చి, దాచి వేయమని చెప్పాడు. రాధ ఎం జి అర్‌ను కాల్చి, తన్ను కూడా కాల్చుకున్నట్టు వాసు నాకు చెప్పాడు'

క్రాస్ పరీక్షలో సాక్షి ఇలా అన్నాడు: "నేను ఒత్తిడికిలొంగి, తప్పుడుసాక్ష్యమిస్తున్నానడం నిజం కాదు. నేను ఎం.జి ఆర్. గార్డెన్స్‌లో సంఘటన జరిగిన వెంటనే లాయిడ్స్ రోడ్డులో నివసిస్తున్న ఎం జి ఆర్. సోదరుడు ఎం జి. చక్రపాణికి ఫోను చేసి, ఆ విషయాన్ని చెప్పలేదు." తర్వాత విచారణ వాయిదా పడింది.

ఎనుగులోని బ్రిటిష్ హైకమిషన్‌వద్ద వేలాది మహిళలు నిరసన ప్రదర్శన జరిపినట్టు బియాఫ్రా రేడియో ప్రకటించింది. లాగోస్ ప్రభుత్వానికి బ్రిటన్ సైనిక సహాయాన్ని సమకూర్చుతున్నదని ఆరోపణపై బియాఫ్రా నుంచి బ్రిటన్‌ను బహిష్కరించాలని వారు కోరారు.

భాషా సమస్యకు ఆమోదయోగ్యమైన పరిష్కారం

త్వరలో కాంగ్రెసు వర్కింగ్ కమిటీ పరిశీలన

మద్రాసు, అగస్టు 17 — కాంగ్రెసు వర్కింగ్ కమిటీ తిరిగి త్వరలో సమావేశమైనప్పుడు కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ కామరాజ్ భాషా సమస్యను చర్చకు పెట్టి. అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని కనుగొనడానికి ప్రయత్నించగలరని కేంద్ర ప్రభుత్వం మాజీ ఆహారమంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యం నేడిక్కడ పత్రికా గోష్ఠిలో చెప్పారు.

హిందీ నాన్-హిందీ ప్రాంతాలకు మాజీ ప్రధానులు ఇచ్చిన హామీలకు, కేంద్ర ప్రభుత్వం విధానానికి అనుగుణమైన పరిష్కారం మొకటి కలదని. దాని ప్రకారం కేంద్రప్రభుత్వ వ్యవహారాలను ఇంగ్లీషు హిందీ భాషలు రెండింటిలోను నిర్వహించవలసి వుంటుందని, విద్యారంగంలో త్రిభాషా పథకాన్ని అమలుపరచవలసి వున్నదని. ఇది అందరికీ ఆమోదయోగ్యమైనదని శ్రీ సుబ్రహ్మణ్యం వివరించారు.

ఈ పత్రికా గోష్ఠికి శ్రీ కామరాజ్ కూడా హాజరైనారు.

"బెంగాల్ మంత్రులను ఘెరావ్ చెయ్యండి"

కాంగ్రెసు వాదులకు మాజీ ముఖ్యమంత్రి సలహా

కలకత్తా, అగస్టు 17— పశ్చిమ బెంగాల్ ఐక్యసంఘటన ప్రభుత్వం మంత్రులను, శాసన సభ్యులను తమ ఎన్నికల వాగ్దానాలను అమలు జరపేటట్టు చేయడానికి "ఘెరావ్" చేయాలని బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి శ్రీ పి.సి.సేన్ కాంగ్రెసు వాదులకు మొన్న సలహా ఇచ్చారు.

స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ప్రదేశ్ కాంగ్రెసు ఆధ్వర్యాన కలకత్తా మైదానంలో ఏర్పాటు చేయబడిన ఒక గొప్ప బహిరంగసభలో మాట్లాడుతూ శ్రీ సేన్ పై సలహా ఇచ్చారు.

కిలో 75 పైసలకు బియ్యాన్ని అందజేస్తామని, చట్టబద్ధమైన రేషనింగ్ ఉన్న ప్రాంతాలకు వారానికి తలసరి మూడు కిలోల బియ్యం సరఫరా చేయగలమని కాంగ్రెసేతర పార్టీలు ఎన్నికల ముందు వాగ్దానం చేశాయని ఆయన అన్నారు.

కేంద్రం సరఫరా చేస్తేనే తాము ఈ మొత్తాన్ని ప్రజలకు అందజేస్తామని, ఎన్నికలముందు వారు చెప్పలేదని ఆయన అన్నారు. పైగా రాష్ట్రంలోనే తగినన్ని బియ్యం ఉన్నట్టుకాని అవినీతికరమైన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని ప్రొక్యూర్ చేయడం లేదని, అప్పుడు వారుప్రజలను నమ్మించడానికి ప్రయత్నించారని శ్రీ సేన్ అన్నారు.

ఐక్య సంఘటన ప్రభుత్వం తన వాగ్దానాలను ఎంతవరకు నిలబెట్టుకుంటుందో ఇప్పటికైనా ప్రజలు గుర్తించి ఉంటారని తాను భావిస్తున్నట్టు ఆయన చెప్పారు.

కేరళకు ఆహార ధాన్యాల సరఫరా

కేంద్ర ప్రభుత్వంపై మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఆరోపణలు

త్రివేండ్రం, అగస్టు 17— కేరళలో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేరళకు బియ్యం కేటాయింపులను కేంద్రం తగ్గించినదని మార్క్సిస్టు కమ్యూనిస్టుపార్టీ కేరళ రాష్ట్ర కమిటీ నిన్న ఆరోపించింది.

గత జనరల్ ఎన్నికలలో వామపక్షంతో ఏర్పడిన యునైటెడ్ ఫ్రంట్ అభ్యర్థులను ఎన్నుకొన్నందుకు కేరళ ప్రజలపై కోపంతో కేంద్రం బియ్యం కోటాను తగ్గించినట్టు కూడా ఆ కమిటీ ఆరోపించింది.

రాష్ట్రానికి సరిపోయే ఆహార ధాన్యాలను కేంద్రం సరఫరా చేయజాలదనీ, విదేశాల నుంచి దిగుమతి చేసుకొనడానికి కేరళ ప్రభుత్వానికి అనుమతించడం లేదని మార్క్సిస్టు కమిటీ ఒక తీర్మానంలో పేర్కొన్నది. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి శ్రీ ఇ. ఎం. ఎస్. నంబూద్రిపాద్ కూడా హాజరైనారు.

ఆహార ధాన్యాల సేకరణలో కేరళ ప్రభుత్వం విధానాన్ని కేంద్ర విమర్శించడం తమ బాధ్యతలను తప్పించుకొనడానికి ప్రజలలో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని అపహాసాలు చేయడానికి ఉద్దేశించినదని కూడా ఆ తీర్మానంలో పేర్కొన్నారు.

దక్షిణ రాష్ట్రాల ముఖ్య మంత్రుల సభ వాయిదా

హైదరాబాద్, అగస్టు 17— బెంగుళూరులో అగస్టు 19 వ తేదీన చేనేత పరిశ్రమ సమస్యలను చర్చించడానికి జరగవలసివున్న దక్షిణ రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం ఈ నెల ఆఖరువరకు వాయిదా పడినట్లు ఇక్కడ అధికార పూర్వకంగా తెలియవచ్చింది.

కృష్ణా-గోదావరి నదీజలాల సమస్యను పరిశీలించడానికి ప్రధాని ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొనడానికి ఢిల్లీ వెళ్లిన ఆంధ్రప్రదేశ్, మైసూరు ముఖ్యమంత్రులు ఇంకా కనీసం రెండు రోజులవరకు అక్కడనే వుండవలసి వున్న దృష్ట్యా ఈ చర్య గైకొన్నట్టు తెలుస్తున్నది.

దక్షిణ వియత్నాంలో స్వేచ్ఛగా ఎన్నికలు

అమెరికా ప్రెసిడెంట్ జాన్సన్ విజ్ఞప్తి

వాషింగ్టన్, అగస్టు 17— దక్షిణ వియత్నాం నాయకులు వచ్చే నెల జరుపనున్న ఎన్నికలను స్వేచ్ఛా వాతావరణంలో నిష్పాక్షికంగా జరపాలని అమెరికా అధ్యక్షులు జాన్సన్ ప్రకటించారు. ఎంత జాగ్రత్తగా ఎన్నికలను నిర్వహించినా ఎక్కడో కొద్ది లోపాలు ఉండడం సహజమని కూడా జాన్సన్ అన్నారు.

దక్షిణ వియత్నాంలో జరుగబోయే ఎన్నికలను గురించి తమ అభిప్రాయాన్ని ఈ వరకే తెలిపానని ప్రెసిడెంట్ జాన్సన్ అన్నారు.

యుద్ధపరిస్థితిలోవున్న కొత్తజాతిపై ఎన్నికల నిర్వహణ స్థాయిని గురించి అసాధ్యమయిన సూచనలను తాము చేయలేమని. ఈ ఎన్నికలు ప్రజా అభిప్రాయానికి ప్రాతినిధ్యం వహించాలని ఆయన కోరారు.

దక్షిణ వియత్నాంలో ఎన్నికల ఉద్యమాన్ని గురించి వస్తున్న ఆరోపణలను ప్రస్తావిస్తూ జాన్సన్ దక్షిణ వియత్నాం అధ్యక్షస్థానానికి మొత్తం 11 మంది పోటీ చేస్తున్నారని వారికి ప్రభుత్వ విధానాలను విమర్శించే పూర్తి హక్కు కలదని జాన్సన్ అన్నారు.

ఉత్తర వియత్నాంలో ఎన్నికలు లేవు. ప్రభుత్వ విధానాలను విమర్శించే అవకాశమే లేదు. ఒకవైపు యుద్ధం జరుగుతున్నా దక్షిణ వియత్నాంలో ఎన్నికలు జరుగుతుండడాన్ని అహ్వానించాలని అమెరికా అధ్యక్షులు అన్నారు.

ఉత్తర వియత్నాం గ్రామాలపై దాడులు

హనోయ్, అగస్టు 17— ఈ వారం నిస్సైనిక మండలంపై అమెరికా విమానాలు దాడులు చేసినప్పుడు ఉత్తర వియత్నాం గ్రామాలపై బాంబులను వేశాయని ఉత్తర వియత్నాం విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి తెలిపారు.

విన్‌లిన్ ప్రాంతంలో అమెరికా విమానాల దాడులకు మూడు గ్రామాలు గురియై ప్రాణనష్టం, ఆస్తినష్టం కల్గిందట. ఉత్తర వియత్నాంపై అమెరికా యుద్ధాన్ని తీవ్రం చేయ నిర్ణయించడం దాని దురాక్రమణ తత్వాన్ని తెల్పుతున్నదని ఆ ప్రతినిధి అన్నారు.

దక్షిణ వియత్నాం ఎన్నికలకు విఘాతం కల్పించే ప్రయత్నం

సైగాన్, అగస్టు 17— సైగాన్‌పై శతఘ్నులతో గెరిల్లాలు బ్యాలెట్ పెట్టెలు, పోలింగ్ కేంద్రాలపై దాడులను జరిపి వచ్చేనెల జరగవలసిన ఎన్నికలకు విఘాతాన్ని కల్పించడానికి సన్నాహం చేస్తున్నారట.

సెప్టెంబర్ మూడవ తేదీన పోలింగ్ జరుగకుండా వియత్కాంగ్‌లు భగ్నం చేయదలుస్తున్నారు. బ్యాలెట్ పెట్టెలను, పోలింగ్ కేంద్రాలలోను వియత్కాంగ్‌లు బాంబులనువేసే ప్రయత్నంలో ఉన్నారని పట్టుబడిన ఒక గెరిల్లా తెలిపాడు.

యుద్ధ పరిస్థితి

కూతంలో జరిగిన పోరాటంలో మెకాంగ్ డెల్టా ప్రాంతమందు ప్రభుత్వ సైనికులు వియత్కాంగ్ బెటాలియన్‌తో తలపడ్డారు. ఈ పోరాటంలో 33 మంది గెరిల్లాలు చంపబడినారు.

వియత్కాంగ్, ఉత్తర వియత్నాం సైనికులతో ప్రభుత్వ దళాలు రెండుసార్లు తలపడినవి. వాతావరణం సరిగా లేనందువల్ల కొద్దిరోజుల నుంచి అమెరికన్ విమానాలు ఉత్తర వియత్నాంపై దాడులు జరపడంలేదు.

"నాటో కూటాన్ని పటిష్ఠం చేయాలి"

ప్రెసిడెంట్ జాన్సన్, కీసింగర్‌ల ఉద్ఘాటన

వాషింగ్టన్, అగస్టు 17— ఉత్తర అట్లాంటిక్ రక్షణ వ్యవస్థ ప్రపంచ శాంతికి దోహదకరమని. దాన్ని మరింత పటిష్ఠం చేయవలసిన ఆవశ్యకత కలదని పశ్చిమ జర్మనీ ఛాన్సలర్ కుర్టుకీసింగర్, ప్రెసిడెంట్ జాన్సన్‌లు నిన్న ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.

రెండు రోజుల చర్చల తర్వాత ఒక సంయుక్త ప్రకటన విడుదలచేస్తూ ప్రపంచశాంతికి ఉత్తర అట్లాంటిక్ రక్షణ వ్యవస్థను బలిష్ఠమైనదిగా చేయడం అవసరమని ఉద్ఘాటించారు.

జర్మన్ ఏకీకరణకు శాశ్వత శాంతి స్థాపనకు ఈ వ్యవస్థ మాత్రమే తోడ్పడగలదని వారు స్పష్టంచేశారు.

ఫిలింఫాన్స్ మహాసభ

నెల్లూరులో 19, 20వ తేదీల కార్యక్రమం వివరాలు

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

నెల్లూరు, అగస్టు 17— ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఫాన్స్ అసోసియేషన్ ఆరవ మహాసభలు ఇక్కడి టౌన్‌హాలులో 19 20వ తేదీలలో జరుగుతాయి.

19వ తేదీ సాయంత్రం 5-30 గంటలకు జరిగే మహాసభలకు రాష్ట్ర సమాచారశాఖ మంత్రి శ్రీ కొండాలక్ష్మణ్‌బాపూజీ ప్రారంభోత్సవం చేస్తారు ప్రముఖ కళాసంపన్నులు శ్రీ కె. వి. గోపాలస్వామి అధ్యక్షత వహిస్తారు. ప్రసిద్ధ సినీ దర్శకులు శ్రీ సి. ఎస్. రావు ప్రసంగిస్తారు.

20 వ తేదీన బ్యాలటు విజేతలైన సినిమా కళాకారులకు ఉత్తరప్రదేశ్ గవర్నరు డాక్టరు బెజవాడ గోపాలరెడ్డి బహుమతి ప్రదానం చేస్తారు ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి అధ్యక్షత వహిస్తారు. రాష్ట్ర మంత్రి శ్రీ చెంచురామానాయుడు ప్రారంభోత్సవం చేస్తారు, ప్రసిద్ధ తమిళ నటులు శ్రీ జెమినీగణేశ్ ప్రసంగిస్తారని కార్యదర్శి శ్రీ తుమ్మలపాటి కుటుంబరావు తెలియ చేశారు.

పశ్చిమ జర్మని తన సాయుధ దళాల సంఖ్యను తగ్గించినపక్షంలో పశ్చిమ జర్మనీలో వున్న తమ బలగం మంది కొంత మందిని ఉపసంహరించుకొనగలదని ప్రెసిడెంట్ జాన్సన్ హెచ్చరించినట్టు కొన్ని పత్రికలలో పడిన వార్తలను వైట్‌హౌస్ ప్రతినిధి ఖండించారు.



దిగుమతి చేసిన మేలిరకం ఉక్కుతో తయారైన బ్లేడులను ఈ పెన్సిల్ షార్పెనర్‌లకు అమర్చారు. మీరు అభిలషించే నైపుణ్యంతో చాలాకాలము మన్నుచూ, ఆఫీసులకు, స్కూళ్ళకు, ఆర్టిస్టులకు డ్రాఫ్ట్స్‌మెన్‌కు బాగా పనికివచ్చును.

ఫౌంటెన్ పెన్నుల పాళీలు

దిగుమతి చేసిన మేలిరకం ఉక్కుతో అత్యాధునికమైన యంత్రాలలో తయారుచేయబడినవి. బరుకు వగైరా లేకుండా సాఫీగా వ్రాయుటకు పనికివస్తవి. దేశంలోని ప్రముఖ ఫౌంటెన్ పెన్ ఉత్పత్తిదారులు ఎన్నికచేసినవి.

ఉత్పత్తిచేయువారు:
సురేంద్ర ప్రాడక్ట్స్ కం.
27/17. తూర్పు పటేల్ నగర్, న్యూఢిల్లీ-8.

ఇతర వ్యాపార వివరములకు:
పి. విశ్వనాథం, గాంధీనగర్, విజయవాడ-3.

నదీజలాలపై పాత ఒప్పందాలను తిరగదోడే యత్నం

ఢిల్లీ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా వ్యతిరేకించే సూచన

భీమ, ఎగువ కృష్ణా, కోయినా ప్రాజెక్టులపై అభ్యంతరం

న్యూఢిల్లీ ఆగస్టు 16 — ఆంధ్ర, మహారాష్ట్ర, మైసూరు రాష్ట్రాలు కృష్ణా నదీజలాల వినియోగం గురించి రేపు ఇక్కడ జరుగగల మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశమై నిర్ణయిస్తారు. ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

కృష్ణానదీ జలాల వినియోగం విషయంలో తలఎత్తిన వివాదాలను పరిష్కరించడానికి ప్రధాని కృషి చేస్తారని తెలుస్తున్నది.

నాగార్జునసాగర్ ఆనకట్టపై క్రెస్టు గేట్ల ఏర్పాటుకు మహారాష్ట్ర, మైసూరు రాష్ట్రాలు నిరసన తెలియజేసినది.

అదే విధంగా భీమా, ఎగువకృష్ణా ప్రాజెక్టుల నిర్మాణం, కోయినా ఆనకట్ట ఎత్తు పెంచడం గురించి ఆంధ్రప్రదేశ్ తీవ్ర అభ్యంతరం తెలియజేయగలదని భావిస్తున్నారు.

ఈ సమావేశానికి నిర్దిష్టమైన అజెండా లేదని. అయితే కృష్ణానదీజలాల వివాదంపై కేంద్ర ఇరిగేషన్ మంత్రిత్వశాఖ రూపొందించిన పత్రాన్ని మాత్రం ముఖ్యమంత్రులకు ఇవ్వడం జరుగుతుందని తెలుస్తున్నది. ఈ పత్రంలో నాగార్జున సాగర్‌ను గురించి వివరించారు.

ఈ పత్రం ప్రాతిపదికపై చర్చలు వుండగలవని భావిస్తున్నారు.

పాత ఒప్పందాలను తిరగ దోడడానికి ఆంధ్ర సమ్మతించకపోవచ్చునని తెలుస్తున్నది. 1963 లో హఫీజ్ మహమ్మద్ ఇబ్రహీం చేసిన కేటాయింపులను 1976 వరకు కొనసాగించాలని ఆంధ్ర వాదించ గలదని తెలుస్తున్నది.

ఈ కేటాయింపు ప్రకారం కృష్ణానదీ జలాలలో మహారాష్ట్రకు 400, మైసూరుకు 600, ఆంధ్రకు 800 శతకోటి ఘనపుటడుగులు లభించాయి.

నాగార్జునసాగర్ ఆనకట్టపై క్రెస్టుగేట్ల నిర్మాణంపై మహారాష్ట్ర లీగల్ నోటీసు యివ్వగలనని ప్రకటించడంతో ఈ వివాదం తారాస్థాయికి చేరింది.

నెహరూ హామీ : మహారాష్ట్ర వాదన

బొంబాయి, ఆగస్టు 16— స్వర్గీయ ప్రధాని శ్రీ జవహర్‌లాల్ నెహరూ కృష్ణా-గోదావరి నదీ జలాలపై యిచ్చిన హామీని కేంద్రం అమలులో పెట్టాలని మహారాష్ట్ర కోరుతున్నది.

మహారాష్ట్రకు చెందిన అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులకు అనుమతి లభించగలదని, మహారాష్ట్ర ఇరిగేషన్ ప్రాజెక్టులకు నీటి కొరత వుండబోదని నెహరూ హామీ ఇచ్చినట్టు ప్రభుత్వ ప్రతినిధి నేడు వెల్లడించారు.

మహారాష్ట్ర ప్రభుత్వం లీగల్ చర్య గైకొనగలదని తెలిపినప్పుడు నెహరూ యిట్టి హామీ యిచ్చారని ఆ ప్రతినిధి అన్నారు. స్వర్గీయ ప్రధాని యిచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వం గౌరవించాలని ఆయన అన్నారు

ముఖ్యమంత్రి శ్రీ వి. పి నాయక్ ఇరిగేషన్ మంత్రి శ్రీ ఎస్.బి. చావన్. నీటి పారుదలశాఖ అధికారులు నేడు ఢిల్లీ వెళ్ళారు ఢిల్లీలో ప్రధాని ఏర్పాటుచేసిన మైసూరు ఆంధ్ర, మహారాష్ట్ర, ముఖ్యమంత్రుల సభలో వారు పాల్గొంటారు.

కేంద్ర ఇరిగేషన్ మంత్రి డాక్టర్ కె. ఎల్ రావు నెహరూ యిచ్చిన హామీని పరోక్షవిధంగా వ్యాఖ్యానించ ప్రయత్నిస్తున్నారని ఆ ప్రతినిధి ఆరోపించారు.

మహారాష్ట్రకు చెందిన 31 పథకాలకు కేంద్ర అనుమతి లభించవలసి వున్నది.

గోదావరి నదీజలాలలో 400 శతకోటి ఘనపుటడుగుల నీటిని మహారాష్ట్రకు కేటాయించడం జరిగిందని అయితే మైసూరు ఆంధ్రలకు కేటాయింపుపై ఎటువంటి పరిమితి లేదని ఆయన అన్నారు.

శ్రీ బిజూపట్నాయక్ పన్ను బకాయిలు

40 లక్షలకు పైగా

న్యూఢిల్లీ, ఆగస్టు 17— ఒరిస్సా మాజీ ముఖ్యమంత్రి శ్రీ బిజూ పట్నాయక్ 40.85 లక్షల రూపాయలమేరకు ఆదాయం పన్ను బకాయి వున్నారు. ఆయనకు సంబంధించిన వివిధ వాణిజ్య సంస్థలు 64 38 లక్షల మేరకు బకాయి వున్నాయి.

ఈ విషయం రాజ్యసభలో శ్రీ బంక బిహారీదాస్ అడిగిన ప్రశ్నకు ఉప ప్రధాని వ్రాతపూర్వకంగా తెలిపిన జవాబులో వెల్లడయింది.

శ్రీ బిజూ పట్నాయక్ వ్యక్తిగతంగా 40 85 లక్షలు, కళింగ ఎయిర్‌లైన్స్ 9.71 లక్షలు కళింగ ఇండస్ట్రీస్ 2. 84 లక్షలు, కళింగట్యూబ్ 47. 48 లక్షలు, పట్నాయక్ మైన్స్ 3.67 లక్షలు పట్నాయక్ అండ్ కంపెనీ 73 వేలు ఆదాయం పన్ను బకాయి క్రింద చెల్లించవలసి వున్నది.

గుంటూరులో ఇండో. సోవియెట్ సంఘం మహాసభ

సన్నాహాలపై శ్రీ జి. క్యాటగడ్డ వివరణ

విజయవాడ, అగస్టు 16 — ఇండో.సోవియెట్ సాంస్కృతిక సంఘం 8 వ అఖిల భారత మహాసభ నవంబర్ 24, 25, 26 తేదీలలో గుంటూరులో పెద్దఎత్తున జరపడానికి విపుల సన్నాహాలు జరుగుతున్నట్టు ఆహ్వాన సంఘం కార్యకర్తలలో ఒకరైన శ్రీ జి క్యాటగడ్డ నేడొకఇంటర్వ్యూలో తెలిపారు.

రష్యాలో అక్టోబర్ సోషలిస్టు విప్లవ 50 వ వార్షికోత్సవం జరిపే చరిత్రాత్మక తరుణంలో ఆంధ్రలో ఇట్టి మహాసభ జరపడం ఎంతో ప్రాధాన్యంగల విషయంగా ఆయన అభివర్ణిస్తూ మహాసభ సందర్భంలో శ్రీయుతులు వి. కె. కృష్ణమీనన్, కె. డి. మాలవీయా, శ్రీమతి అరుణాఅసఫాలీ, కె. పి. ఎస్. మీనన్, అర్జున్అరోరా, బలరాజ్ సహానీ. రజనీపటేల్, మోహన్ కుమార మంగళం రాగలరని అన్నారు

మహాసభ సన్నాహాలు ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్- చాన్సలర్ డాక్టర్ డి. ఎస్. రెడ్డి అధ్యక్షులుగా "ఆంధ్రజ్యోతి" ఎడిటర్ శ్రీ నార్ల వెంకటేశ్వరరావు ఎం.పి), స్పీకర్ శ్రీ బి. వి. సుబ్బారెడ్డివంటి ప్రముఖులు ఉపాధ్యక్షులుగా ఏర్పడిన ఆహ్వాన సంఘం అధ్వర్యాన చురుకుగా జరుగుతున్నాయని ఆయన అన్నారు.

ఈ మహాసభకు మరొక విశిష్టతను చేకూర్చేందుకు రష్యానుంచి ప్రత్యేకంగా కళాకారుల బృందంతో పాటు దేశంలో వివిధ ప్రాజెక్టులలో ఇండో-సోవియెట్ మైత్రికి సజీవ చిహ్నంగా పని చేస్తున్న సాంకేతిక నిపుణులు, విద్యావేత్తలు కూడా రాగలరని ఆయన వివరించారు

గాంధిజీ రచనల సంకలనం

కొత్తగా మరి రెండు సంపుటాల ఆవిష్కరణ

న్యూఢిల్లీ, అగస్టు 17 — మహాత్మా గాంధీ రచనల సంకలనంలో మరి రెండు సంపుటాలు మొన్న ఇక్కడ ఆవిష్కృతమైనాయి

కేంద్రప్రభుత్వం రేడియో, సమాచార శాఖవారు ఈ సంపుటాలు రెండింటిని ప్రచురించారు ఇవి ఇంగ్లీష్‌లో విరచితమైనాయి ఇవి 1922 మార్చి నాల్గవ తేదీ నుంచి 1024 అగస్టు 15 వ తేదీ వరకు నడచిన చరిత్రను వివరిస్తున్నాయి.

ఈ రెండు సంపుటాలు గాంధీజీ జీవితంలో ముఖ్య ఘట్టాలను విశదపరుస్తున్నాయి. వీటిలో 1922 మార్చి 18 వ తేదీన జరిగిన చిరస్మరణీయమైన గాంధీజీ విచారణ. ఎరవాడ సెంట్రల్ జైలులో మహాత్ముని కారాగార జీవితం పేర్కొనదగిన విశేషాలు. ఈ విషయాలు గాంధీకి లేఖలు ఆయన 1922. 1923 జైలు డైరీలు, జైలునుంచి విడుదలైన పిమ్మట తన కారాగార అనుభవాలపై గాంధిజీ రచించిన వ్యాసాలనుంచి ఉల్లేఖితమైనాయి.

కౌన్సిల్‌లో ప్రవేశం విషయమై ఉత్పన్నమైన క్లిష్ట సమస్యను. కాంగ్రెస్ నేతలకు. స్వరాజ్య వాదులకు మధ్య కలిగిన విభేదాలను ఆయన పరిష్కరించిన తీరును, హిందూ - ముస్లిం వివాదాలపై గాంధిజీ ఆత్మ పరిశోధనాత్మకమైన వ్యాసాలు కూడా ఈ సంపుటాలలో స్థానాన్ని పొందాయి

తిరుపతి దేవస్థానం చైర్మన్‌కు గాయాలు

కారు ప్రమాదంలో

తిరుపతి, ఆగస్టు 16— తిరుపతి దేవస్థానం చైర్మన్ శ్రీ పి. ఎన్. అప్పారావు నిన్న సాయంత్రం కారు ప్రమాదంలో స్వల్పంగా గాయపడ్డారు.

ఆయన ప్రయాణం చేస్తున్న వ్యాన్ కొండపై నుంచి వస్తున్న కారుతో ఢీకొన్నది. శ్రీ అప్పారావుకు తలపైన. కుడి మడమపైన దెబ్బతగిలినవి.

ప్రధానితో గ్వాలియర్ రాజమాత భేటీ

న్యూఢిల్లీ, ఆగస్టు 16—గ్వాలియర్ రాజమాత నేడు ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధిని కలుసుకున్నారు.

ఏజెన్సీ ప్రాంతాలలో పది వేల ఎకరాలలో కాఫీ తోటల పెంపకం

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి) హైదరాబాద్, ఆగస్టు 17—

విశాఖపట్నం తదితర ఏజన్సీ ప్రాంతాలలో పది వేల ఎకరాలలో కాఫీ తోటలను పెంచాలని రాష్ట్రప్రభుత్వం సంకల్పిస్తున్నదని ప్లానింగ్ మంత్రి శ్రీ కె. వి. నారాయణరెడ్డి నేడిక్కడ చెప్పారు

40 లక్షల రూపాయల వ్యయంతో గత ఆరేళ్ళలోను 1260 ఎకరాలలో కాఫీ తోటలను అటవీశాఖ పెంచినది. ఇటీవలనే విశాఖపట్టణంజిల్లాలో పర్యటించిన ప్లానింగ్ మంత్రి శ్రీ కె. వి. నారాయణరెడ్డి పత్రికా విలేకరులతో మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లాలో పండుతున్న కాఫీగింజలు వాణిజ్యపరంగా గణనలోనికి వచ్చాయని చెప్పారు.

ఈ ప్రయోగాల ఫలితాలు ప్రోత్సాహకరంగా వుండడంతో ఈ కాఫీ తోటలను ఇంకా విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తున్నదని కాఫీ తోటల పెంపకం నిమిత్తం భూములను దీర్ఘకాలిక కౌలుక్రింద ప్రయివేట్ సంస్థలకు. వ్యక్తులకు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నదని ఆయన తెలిపారు.

మిరియాల తోటలు

దేశీయాంతర ద్రవ్యాన్ని బాగా ఆర్జించి పెట్టే మిరియాలను కూడా పండించడానికి ప్రయోగాలను అటవీ శాఖ నిర్వహిస్తున్నదని ఆయన వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఎగుమతులను అభివృద్ధి చేయడానికిగల అవకాశాలపై విదేశీ వాణిజ్యం భారతీయ ఇనిస్టిట్యూట్ వారి నివేదిక ఈ నెలాఖరుకు పూర్తి కాగలదని ఆయన చెప్పారు. ఈ నివేదికను పరిశీలించడానికి ఎగుమతుల అభివృద్ధి రాష్ట్ర సలహా సంఘం ఇక్కడ వచ్చే నెలలో సమావేశమై సముచితమైన నిర్ణయాలు గైకొనగలదని ఆయన తెలిపారు.

వృద్ధాప్యపు పెన్షన్ పథకం

న్యూఢిల్లీ ఆగస్టు 16—నిధుల కొరత దృష్ట్యా ప్రస్తుతానికి వృద్ధాప్యపు పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావించడం లేదని కేంద్రసాంఘిక సంక్షేమ శాఖమంత్రి శ్రీ అశోకమెహతా తెలిపారు.

యూనివర్సిటీలకు పూర్తిస్వాతంత్ర్యం

గ్రాంట్స్ కమిషన్ నియమించిన సంఘం సిఫారసు

న్యూఢిల్లీ, అగస్టు 16—యూనివర్సిటీలు అనుచిత ప్రభావానికి. పక్షపాతానికి. దుర్నీతికి గురికాకుండా ఉండాలంటే వాటికి పూర్తిస్వేచ్ఛ. సమగ్ర అధికారాలు ఉండాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నియమించిన సంఘం సిఫారసుచేసింది. అవినీతి నిరోధానికి సంబంధించి సంతానం కమిటీచేసిన సూచనలను పురస్కరించుకొని గ్రాంట్స్ కమిషన్ ఈ సంఘాన్ని నియమించింది

యూనివర్సిటీలు ప్రభుత్వోద్యోగులను. ముఖ్యంగా ఉన్నతాధికారులను సమకూర్చే సంస్థలుగా సంతానం కమిటీ అభివర్ణించింది. అందువల్ల అవి సమగ్ర వ్యక్తిత్వం. శీల సంపదలకు ఉన్నత ప్రమాణాలను నెలకొల్పాలని ఆ కమిటీ సూచించింది.

దేశాభ్యున్నతికి. ప్రజా జీవన ప్రమాణాభివృద్ధికి యూనివర్సిటీలు ప్రధానపాత్ర వహించవలసి ఉంటుందని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిటీ నియమించిన ఈ సంఘం అభిప్రాయపడింది యూనివర్సిటీల కర్తవ్యం జ్ఞానాన్ని పరిరక్షించడం. అభివృద్ధి చేయడంతోపాటు సమాజానికి ఉన్నత నైతిక స్థాయిని. మేధా సంపదను కలుగజేయడం కూడనని కమిటీ అభిప్రాయపడింది.

యూనివర్సిటీలకు స్వాతంత్ర్యం లేక పోయిన పక్షంలో ఇట్టి గురుతర బాధ్యతలను అవి నిర్వహించడం కష్టతరం కాగలదని కమిటీ అభిప్రాయ పడింది.

పంచదారపై పాక్షికంగా కంట్రోల్ : భిన్నాభిప్రాయాలు

న్యూఢిల్లీ, అగస్టు 16 — నేడు ప్రభుత్వం ప్రకటించిన పంచదార విధానం చెరకు ఉత్పత్తిదారులకు హెచ్చుధర ముట్టేందుకు, వినియోగదారులకు సరసమైన ధరకు పంచదార లభించేందుకు దోహదకరమని రాజ్యసభలో కాంగ్రెసు సభ్యుడు శ్రీ ఎ. జి కులకర్ణి వ్యాఖ్యానించారు.

క్వింటాల్‌కు 8.35 రూపాయల ఎక్సైజ్ సుంకం తగ్గింపు ప్రతిపాదనను ఆయన ఈ సందర్భంలో పేర్కొన్నారు. అయితే ఈ విధానం కొంత అసంతృప్తిని మహారాష్ట్ర. ఆంధ్ర. మైసూర్‌లలోని సహకార చక్కెర మిల్లులకు కలుగించవచ్చునని పంచదార ధరను దిగుబడితో [illegible] దీనికి కారణమని ఆయన అన్నారు. జోన్ పథకాన్ని ప్రభుత్వం ఆమోదించి అయిదు మండలాలుగా విభజించడం హర్షదాయకమని ఆయన అన్నారు.

కంట్రోల్ ధరకు పంచదారను పొందే వారికి నేటి ప్రకటన అంతగా ప్రయోజనకరంకాదు అదే విధంగా పెద్దగా నష్టం కూడా కాదు.

పంచదార కంట్రోల్ ధర కొన్ని ప్రాంతాలలో కొద్దిగా హెచ్చుగా వుండవచ్చునని, మరికొన్ని ప్రాంతాలలో కొద్దిగా తగ్గవచ్చునని కేంద్ర ఆహారశాఖ మంత్రి శ్రీ జగ్జీవనరామ్ పత్రికల వారికి వివరించారు. పంచదార పంపిణీ విషయంలో ప్రస్తుతం రాష్ట్రాలలో వున్న పద్ధతి కొనసాగగలదని. అయితే హెచ్చు మొత్తాలను వినియోగించే వారు మాత్రం తమ అవసరాలకు స్వేచ్ఛా మార్కెటుపై ఆధారపడవలసి వుంటుందని ఆయన అన్నారు

వచ్చే సంవత్సరం ప్రభుత్వం ఫ్యాక్టరీల నుంచి దాదాపు 30 లక్షల టన్నుల పంచదారను సేకరించగలదని, ఇది నూటికి 60 వంతులని ఆయన అన్నారు.

స్వేచ్ఛా మార్కెటులో లభించే పంచదారకు కంట్రోల్ ధర వర్తించదని ఆయన అన్నారు స్వేచ్ఛా మార్కెటులో విడుదలచేసే పంచదారకు ఎటి ఆంక్షలు వుండవు

కేంద్ర ప్రభుత్వం సిబ్బంది వేతనాలు

పెంచే విషయమై ఉద్యోగుల ప్రతినిధులతో కార్మికశాఖ మంత్రి చర్చలు

సంప్రతింపుల ద్వారా సమస్య పరిష్కారానికి కృషి

న్యూఢిల్లీ, అగస్టు 17—

గజేంద్రగడ్కర్ కమిషన్ సిఫారసు చేసిన రూపంలో కేంద్ర ప్రభుత్వోద్యోగులకు కరవుభత్యం చెల్లించే సమస్యపై సంప్రతింపులకు "అవకాశం" వున్నదని కేంద్ర కార్మిక మంత్రి శ్రీ జె ఎల్. హాథి నేడు వెల్లడించారు.

వచ్చేనెల 11 వ తేదీన సమ్మెను నివారించడానికి కేంద్ర కార్మిక మంత్రి నేడు కేంద్ర ప్రభుత్వోద్యోగులసంఘాల సమాఖ్య ప్రతినిధులతో వరసగా సంప్రతింపులు జరిపారు.

కేంద్ర ప్రభుత్వోద్యోగులతో తన సంప్రతింపులలో ఎట్టి ప్రతిపాదనలను గురించి చర్చించలేదని ఆయన అన్నారు.

హెచ్చించిన కరువుభత్యం నగదు రూపంలో చెల్లించాలని కేంద్ర ప్రభుత్వోద్యోగులు కోరుతున్నారని. ఈ విషయంలో వారు సంప్రతింపులకు సిద్ధంగా వున్నదీ లేనిదీ తెలుసుకొనడానికి తాను యత్నిస్తున్నానని ఆయన అన్నారు.

హెచ్చించిన కరువు భత్యాన్ని వెంటనే నగదురూపంలో చెల్లించాలని ప్రతిపక్ష నాయకులు కేంద్ర ప్రభుత్వోద్యోగుల ప్రతినిధులు కోరుతున్నారు.

ఈ సమస్యపై సంప్రతింపులకు అవకాశం వున్నదనే విషయం తనకు అవగాహనయినదని ఆయన అన్నారు. పూర్తి మొత్తాన్ని వెంటనే నగదురూపంలో చెల్లించాలని కార్మికులు పట్టుపట్టారని తాను అర్థం చేసుకొన్నానని ఆయన అన్నారు.

ఉపప్రధాని జపాన్ పర్యటన నుంచి వచ్చిన తరువాత శ్రీ హాథి తన సంప్రతింపుల పురోగతిని గురించి ఆయనకు తెల్పియజేస్తారు

మరొక పర్యాయం సంయుక్త సమావేశం జరపడం గురించి శ్రీ దేశాయ్ స్వదేశం వచ్చిన అనంతరం నిర్ణయిస్తారు.

ప్రధాని హామీ

కరవుభత్యం సమస్యను అందరికి సంతృప్తికరమైన విధంగా పరిష్కరించడానికి ఏదో మార్గం కనుగొనడం జరుగగలదని ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి నేడు ఐ. ఎన్. టి. యు. సి. ఢిల్లీ శాఖ ప్రతినిధివర్గానికి హామీనిచ్చినట్టు తెలుస్తున్నది.

కేంద్రప్రభుత్వోద్యోగుల ప్రతినిధులతో కేంద్రకార్మికమంత్రి శ్రీ హాథి సంప్రతింపులు జరుపుతున్నారని, ఆయన ఏదో పరిష్కార మార్గాన్ని రూపొందించగలరని ప్రధాని తెలియజేశారు.

పరిష్కారం సాధించడంలో తాను తోడ్పడగలనని కూడా ప్రధాని హామీనిచ్చారు.

సవరణ

["ఆంధ్రజ్యోతి" అగస్టు 17 వ తేదీ సంచిక మూడవ పేజీ ఏడవకాలంలో "గుంటూరు జిల్లా సహకార పరపతి సంఘం ఎన్నికలు" అన్న శీర్షికతో వెలువడిన వార్తలో గుంటూరు జిల్లా సొసైటీ అనికాక ఎంప్లాయీ కోవరేటివ్ క్రెడిట్ సొసైటీ అని చదువుకొన వలెనని కోరుతున్నాము. —ఎడిటర్]

ఒరిస్సా రాష్ట్రంలోని పారిశ్రామిక వేత్తలు ఎగుమతుల మార్కెట్‌నుంచి ప్రయోజనాలు పొందడానికి వీలుగా ఎగుమతుల అభివృద్ధి కేంద్రాన్ని స్థాపించడానికి రాష్ట్రప్రభుత్వం నిర్ణయించినట్టు కటక్ వార్త.

ఆంధ్ర హైకోర్టుకు మరొక అయిదుగురు జడ్జీల నియామకం

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్. అగస్టు 17—ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు మరొక అయిదుగురు జడ్జీలను నియమించనున్నట్టు తెలుస్తున్నది జడ్జీలను నియమించే ఉత్తరువు భారత రాష్ట్రపతి నుంచి ఈ వారంలో ఎప్పుడైనా రావచ్చునని భావించబడుతున్నది.

కొత్త జడ్జీలుగా ఈ క్రిందివారిని నియమించుతారని తెలుస్తున్నది. శ్రీయుతులు వై. వెంకటేశ్వరరావు (హైకోర్టు రిజిస్ట్రారు) పి. కొండయ్య. ఓ. చెన్నప్పరెడ్డి. (పబ్లిక్ ప్రాసిక్యూటర్) ఎ. డి. ఎ. రెడ్డి అల్లాడి కుప్పుస్వామి.

శ్రీ ఎం. శేషాచలపతి, శ్రీ పి. సత్యనారాయణరావుగారలు పదవీ విరమణ చేసినప్పటికి హైకోర్టు తాత్కాలిక జడ్జీలుగా వ్యవహరించుచున్నారు.

అన్నంవడ్డించే విందులు

ముఖ్యమంత్రి నిర్ణయం

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్. ఆగస్టు 16 — ఇక మీదట ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి 25 మందికి మించి ఉన్న డిన్నరు పార్టీలకు గాని, అన్నం ఒకభాగంగా ఉన్న విందులకు గాని హాజరు కాబోరని తెలుస్తున్నది.

స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా నీలోఫర్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విందు సందర్భంలో ముఖ్యమంత్రి ఈ ప్రకటన చేశారు.

ఈ విందుకు హాజరైన వారిలో శ్రీమతి రాఘవమ్మ బ్రహ్మానందరెడ్డి. ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ పి. వి. నరసింహారావు ప్రభుత్వ ఉన్నతాధికారులు. డాక్టర్లు ఉన్నారు.

ఆసుపత్రి గదులను శుభ్రంగా ఉంచడం అలంకరించడం పోటీలో పిల్లల వార్డుకు చెందిన సిస్టర్ జాకబ్‌కు ప్రథమబహుమతిగా రోలింగ్ షీల్డు ఇవ్వబడింది. ద్వితీయ బహుమతి గైనకాలజీవార్డుకు చెందిన సిస్టర్ గోవిందమ్మకు లభించింది. మూడవ బహుమతి సిస్టర్ మరియమ్మకు ఇవ్వబడింది.

పశ్చిమ బెంగాల్‌లో 24న సాధారణ సమ్మె

కేంద్రంపై ఒత్తిడి తేవడానికి యునైటెడ్ పార్టీ నిర్ణయం

కలకత్తా అగస్టు 17— కేంద్రం నుంచి పశ్చిమ బెంగాల్‌కు ఎక్కువ ఆహార ధాన్యాలను సంపాదించడానికై ప్రజాభిప్రాయాన్ని సంఘటితం చేయడానికి ఈ నెల 24న పశ్చిమ బెంగాల్ అంతట సాధారణ సమ్మెను హర్తాళ్ని జరుపుటకు రాష్ట్ర మంత్రులు యునైటెడ్ పార్టీ ఇతర నాయకులు అంగీకరించారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి అధ్యక్షత వహించారు.

అధికధరలకు వ్యతిరేకంగా రాష్ట్రంలో సమైక్య ఆందోళన

ఏడు ప్రతిపక్ష పార్టీలు సమాయత్తమవుతున్నట్లు సంయుక్త ప్రకటనలో వెల్లడి

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి, హైదరాబాద్ అగస్టు 17—

అధిక ధరలు, ఆహారంతోపాటు నిత్యావసర వస్తువుల కొరత ఫలితంగా ప్రజలు పడుతున్న ఇక్కట్లను తొలగించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకొనేటట్లు చేయడానికి ప్రతిపక్ష పార్టీలు ఆందోళన జరపాలని నిశ్చయించినటు తెలుస్తున్నది.

ఏడు ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు చేసిన ఒక సంయుక్త ప్రకటనలో ప్రభుత్వం ఎక్కువ పన్నులు వేయడానికి వేతనాల స్తంభనకు. ఉద్యోగులను తగ్గించడానికి అభివృద్ధి కార్యక్రమాలలో కోత విధించడానికి సిద్ధపడినటు పేర్కొన్నారు. అంతేగాక ప్రజల సమస్యలపట్ల అలసత్వ విధానాన్ని అవలంబించుకున్నట్టు కూడా వారు విమర్శించారు.

యజమానులు, భూస్వాములు, బ్లాక్ మార్కెట్టు దారులు ప్రభుత్వం కలసి ఒక దోపిడి ముఠాగా ఏర్పడినట్టు వారు ఆ ప్రకటనలో ఆరోపించారు. ప్రజలు ఈ సవాలును ఎదుర్కోవాలని కూడా వారు హెచ్చరిక చేశారు.

ఆందోళన కార్యక్రమాన్ని గురించి చర్చించడానికి సోమవారం ఇక్కడ ఒక సమావేశాన్ని ఏర్పాటుచేశారు.

ప్రకటనపై సంతకాలు చేసినవారిలో శ్రీయుతులు ఎస్. రాజశేఖరరెడ్డి (కమ్యూనిస్టు) టి. నాగిరెడ్డి (మార్కిస్టు) ఎ. లక్ష్మీనారాయణ (జనసంఘం) ఎస్. బి. గిరి (పి.ఎస్.పి.) శ్రీమతి జె. ఈశ్వరీబాయి (ఆర్.పి.ఐ) సుల్తాన్ సలా ఉద్దీన్ ఒవైసీ (మజ్లిస్) ఉన్నారు.

ఐ. ఎన్. టి. యు. సి. కేంద్రనాయకత్వంపై గురుమూర్తి విమర్శ

కార్మికుల మధ్య సంఘర్షణకు దాని పక్షపాతవైఖరే కారణమని ఆరోపణ

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, అగస్టు 17— రాష్ట్ర పరిశ్రమల మంత్రి శ్రీ బి వి. గురుమూర్తి ఐ. ఎన్. టి. యు. సి. కేంద్ర నాయకత్వాన్ని నేడిక్కడ తీవ్రంగా విమర్శించారు ఐ. ఎన్. టి యు. సి. అధీనంలో ఉన్న వివిధ ట్రేడ్ యూనియన్ సంస్థలలో తగాదాలకు. సంఘర్షణలకు దాని పక్షపాత వైఖరే కారణమని ఆయన అన్నారు.

ఆల్విన్ మెటల్ వర్క్సుకు చెందిన రెండువేలమంది వర్కర్లు యూనియన్‌లో గ్రూపులకు వ్యతిరేకంగా నిరసనను తెలియజేయడానికి తమ ఇంటికి వచ్చినప్పుడు న్యాయమైన ఎన్నికలు జరిగితే అన్ని సమస్యలు పరిష్కారమవగలవని శ్రీ గురుమూర్తి అన్నారు. న్యాయంగా జరిగిన ఎన్నికలలో గెలుపొందినవారిని ప్రభుత్వం. యాజమాన్యంతో సహా అందరూ గౌరవించుతారని ఆయన అన్నారు.

రెండవ గ్రూపుకు వ్యతిరేకంగా వర్కర్లు చేసిన ఆరోపణలను ప్రస్తావించి వారుకూడా ఇదేవిధంగా ప్రత్యారోపణలు చేస్తున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని గురించి సమగ్రంగా దర్యాప్తు జరపగలదని అప్పటివరకు వర్కర్లు ప్రశాంతంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ. శ్రీ గురుమూర్తి ఆల్విన్ మెటల్ వర్క్సు యాజమాన్యాన్ని విమర్శించారు. దీని యాజమాన్యం బిర్లాల చేతిలో ఉన్నది.

లేబర్ కమిషనర్‌తో సంప్రతింపులు జరిపిన శ్రీ లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రభుత్వం వర్కర్ల ఇబ్బందులను పరిశీలించి ఫ్యాక్టరీ ఆవరణలోను బయటకూడా వారి భద్రతకు చర్యలు తీసుకోగలదని అన్నారు.

వర్కర్లకు నాయకత్వం వహించిన పార్లమెంటు సభ్యుడు శ్రీ వెంకటస్వామి పోటీ వర్గంవారు తమ వర్కర్లపై దాడి చేసినట్టు చెప్పారు. ప్రస్తుతం ఎదుటి వర్గం అధీనంలో ఉన్న వర్కర్స్ యూనియన్ కార్యాలయాన్ని రేపటిలోగా తమకు అప్పగించాలని ఆయన కోరారు.

ఒక వారం రోజులుగా కార్మికులలోని రెండు వర్గాలమధ్య సంఘర్షణలు జరుగుతున్నాయి. గాయాలు తగిలిన ఇద్దరు వర్కర్లను వారు మంత్రుల ముందుకు తీసుకొని వచ్చారు.

"నడుస్తున్న రేడియో"గా మారిన ఖైదీ

దువల్‌డార్, పశ్చిమ జర్మనీ, ఆగస్టు 17— దువల్‌డార్ జెయిల్‌లోని ఒక ఖైదీ ఇటీవల స్విచ్ వేసిన ఒక ట్రాన్సిస్టర్ రేడియోను మ్రింగి, నడుస్తున్న రేడియోగా మారిన ఉదంతమొకటి తెలియవచ్చింది.

జెయిల్ డాక్టరు ఒకరు నిన్న ఈ విషయాన్ని తెల్పుతూ, అది ఒక చిన్న జపనీస్ రేడియో అని అది మనిషి శరీరంలో నుంచి "సాధారణ రీతిని" వెలుపలికి వచ్చే వరకు పాడుతూనే వున్నదని చెప్పారు.

లక్నో సమీపంలో దుకాణాల లూటీ

పోలీసులచే విద్యార్థులతో సహా 117 మంది అరెస్టు

లక్నో, ఆగస్టు 17—లక్నో పొరుగు జిల్లాలకు చెందిన దాదాపు 15 వందల మంది చార్‌బాగ్ రైల్వే స్టేషన్ సమీప ప్రాంతంలో మాంసం దుకాణాలు మిఠాయి దుకాణాలు, కూల్‌డ్రింక్ స్టాళ్ళను లూటీ చేశారు.

ఈ దుండగులు పొరుగు జిల్లాలనుంచి రైలుపై వచ్చారని. వారివద్ద టిక్కెట్లు కూడా లేవని అధికారులు తెలియజేశారు.

స్టేషన్‌కు దూరంగా రైలును నిలిపివేసి. జట్టు జట్టుగా మార్గమధ్యంలోని దుకాణాలకు లూటీ చేసినట్టు అధికారులు తెలియజేశారు.

వీరిలో చాలామంది వద్ద కత్తులు. మద్యం సీసాలు వున్నవి.

దోపిడీ. అల్లర్లు ఆరోపణలపై మొన్న రాత్రి వరకు దాదాపు117 మందిని అరెస్టు చేశారు.

దుకాణాదారులను ఉచితంగా తమకు తినుబండారాలు ఇవ్వవలసినదిగా కోరడంతో ఈ అల్లర్లు ప్రారంభమైనవి.

దానికి దుకాణాల యజమానులు అంగీకరించకపోవడంతో సంఘర్షణ ప్రారంభమైనది,

అరెస్టు అయిన వారిలో కాన్పూర్. ఫైజాబాద్. గోరఖ్‌పూర్, వారణాసి, బారబంకి జిల్లాలకు చెందిన విద్యార్థులున్నారు.

ఎమ్. ఇ. రెడ్డి తిరుపతిరెడ్డిలకు ఇచ్చిన పోలీసు పతకాలు

కేంద్రంచే ఉపసంహరణ

హైదరాబాద్, అగస్టు 17 — నిరుపమాన సేవలు చేసినందుకు బహూకరించిన పోలీసు పతకాలలో సి ఐ డి. క్రైమ్ బ్రాంచి మాజీ సూపరింటెండెంట్ శ్రీ ఎం. ఇ. రెడ్డికి పోలీసు ఇన్‌స్పెక్టర్ శ్రీ పి. తిరుపతి రెడ్డికి ఇచ్చిన పోలీసుపతకాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకొన్నది.

ఈ ఇద్దరిపైన వచ్చిన ఆరోపణలను గురించి లంచగొండి నిరోధక శాఖ దర్యాప్తు చేస్తున్న దృష్ట్యా ఈ పోలీసు పతకాలను ఉపసంహరించుకొనడం జరిగింది.

అపూర్వ సాహసికుని మృతి

కేప్‌టౌన్, అగస్టు 17— 70 సంవత్సరాల క్రితం ఒక బాలికపట్ల తన ప్రేమను నిరూపించుకొనడానికి కేప్‌టౌన్ నుంచి కయిరో వరకు ఆరువేల మైళ్ళు నడచిన కర్నల్ ఇవార్డు స్కాట్ గ్రోగన్ తన 92 వ ఏట నిన్న ఇక్కడ మరణించాడు.

అంత దూరం కాలినడకన వెళ్ళిన మొట్ట మొదటివ్యక్తి ఆయనే. ఆదూరం నడవడానికి మూడు సంవత్సరాల కాలం పట్టింది. అయినా చివరకు ఆ బాలిక ప్రేమను ఆయన పొందగలిగాడు.

ఆ సుదీర్ఘ నడకలో కరల్ గ్రోగన్ పలుసార్లు ప్రాణాపాయం నుంచి బయట పడినాడు.

నాగర్ కోయిల్‌లో విషాహారంసంఘటన

40మందికి ఆసుపత్రిలో చికిత్స

నాగర్‌కోయిల్, అగస్టు 17 — విషాహారం. తినారన్న అనుమానంపై ఇక్కడ ఆసుపత్రిలో 40మందిని చికిత్సకు చేర్చారు

ఒక హోటల్‌లో "బిరియానీ" తినుకున్న అనంతరం వారు కక్కు కోవడం జరిగిందని వారిలో ఒకరు డాక్టర్. మరొక దంత వైద్యుడు విద్యార్థులు వున్నారని తెలుస్తున్నది.

కేరళరోడ్డు రవాణాసంస్థ తన బస్సు సర్వీసులలో అదనపు కండక్టర్లను నియమించే ప్రతిపాదనను విరమించినట్టు త్రివేండ్రం వార్త.

బెంగాల్ మంత్రుల బైఠాయింపు

ప్రధాని భవనం ముందు 23 నుంచి ప్రారంభం కాగలదట

కలకత్తా. అగస్టు 16— పశ్చిమ బెంగాల్ ఐక్య సంఘటన మంత్రి వర్గానికి చెందిన ఎనిమిది మంది మంత్రులు ప్రధాని నివాస భవనం ముందు బైఠాయింపు జరిపే నిమిత్తం 22 వ తేదీన ఢిల్లీ వెళ్ళనున్నట్టు తెలుస్తున్నది. తమ రాష్ట్రానికి ఎక్కువ ఆహార ధాన్యంతో పాటు వాటికి సక్రమంగా సరఫరా చేయాలనే కోరికను పురస్కరించుకొని వీరు చర్యకు సిద్ధమైనట్టు తెలుస్తున్నది.

ఈ రెండు కోర్కెలు తీరేవరకు బైఠాయింపు కొనసాగుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి ఒకరు తెలియజేశారు.

బైఠాయింపుసమ్మె ఏవిధంగా ఉండాలనే విషయం ఇంకా నిర్ణయంకాలేదు. 23 వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని ఆ ప్రతినిధి తెలియజేశారు.

ఇండో-జపాన్ సహకారం

టోక్యోలో భారత ఉప ప్రధాని శ్రీ మురార్జీ చర్చలు

టోక్యో. అగస్టు 17—ఇండియా ఉప ప్రధాని శ్రీ మురార్జీదేశాయి నిన్న ఉదయం జపాన్ విదేశాంగ మంత్రి తకెయో మికితో సంభాషణలు జరిపారు. తాను ఇక్కడ జపనీస్ నాయకులతో జరిపిన చర్చలలో ఈ చర్చలు అత్యంత ప్రధానమైనవని శ్రీ దేశాయి అన్నారు.

తరువాత ఆసియాలో ప్రస్తుత పరిస్థితిని గురించి సమీక్షించి ఇండియా. జపాన్‌ల మధ్య మరింత సహకారానికి గల అవకాశాలను గురించి పరిశీలించారు.

కమ్యూనిస్టు చైనా సైనిక పాటవాన్ని గురించి కూడా వారు చర్చించినట్టు తెలుస్తున్నది.

జపాన్ పత్రికలలో శ్రీ దేశాయ్‌కి సంబంధించిన వార్తలు మొదటి పేజీలో ప్రముఖంగా ప్రచురించారు.

టోక్యోనుంచి ప్రచురింపబడే ఆంగ్ల దినపత్రిక 'జపాన్ టైమ్స్' శ్రీ దేశాయ్ పర్యటనను భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొన్న ప్రత్యేక అనుబంధాన్ని ప్రచురించింది.

ప్రధాని సాటోతో శ్రీ దేశాయ్ చర్చలు

జపాన్ ప్రధాని ఇసాకు సాటోతో శ్రీమురార్జీదేశాయి మొన్న జరిపిన సంభాషణలలో పరస్పర సహకారం. అవగాహనలను గురించి ప్రముఖంగా చర్చించినట్టు పి టి.ఐ విలేకరి వ్రాస్తున్నాడు.

ఈ నాయకు లిరువురిమధ్య 30 నిమిషాల పాటు చర్చలు జరిగినవి.

సింహళానికి ఇండియా ఋణం

యంత్రసామగ్రి కొనుగోలుకు అయిదుకోట్లు ఇచ్చే ఒప్పందంపై సంతకాలు

న్యూఢిల్లీ. అగస్టు 17— ఇండియా నుంచి యంత్రపరికరాలను కొనుగోలుచేసే నిమిత్తం ఇండియా సింహళానికి అయిదు కోట్లు ఋణంఇచ్చే ఒప్పందంమీద నిన్న ఇక్కడ సంతకాలు జరిగాయి

ఈ ఋణం కేబిల్స్. ఫ్యాన్సు తదితర ఎలెక్ట్రికల వస్తువులు. జీపు కమ్యూనికేషన్స్ పరిశ్రమలకు కావలసిన యంత్రాలు. లారీలు ట్రక్కులు మొదలైన వాహనాలు. భూమిని త్రవ్వే యంత్రాలు వ్యాగన్‌లతో సహా రైల్వే పరికరాలు మొదలైనవాటి కొనుగోలుకు ఉపయోగించబడుతుందని తెలుస్తున్నది.

నాగార్జునసాగర్‌కు అదనపు నిధులు

కేటాయించవలసిందిగా కేంద్రానికి శ్రీ మధోక్ విజ్ఞప్తి

హైదరాబాద్. అగస్టు 17 — నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు అదనంగా నిధులను కేటాయించవలసిందిగా కేంద్ర ప్రభుత్వానికి అఖిలభారత జనసంఘం అధ్యక్షుడు శ్రీ బలరాజ్ మధోక్ విజ్ఞప్తి చేశారు.

బలరాజ్ మధోక్ 16 వ తేదీన నాగార్జునసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. ఈ ప్రాజెక్టును చూచి ఆయనకు చాలా సదభిప్రాయం కలిగింది.

ఈ ప్రాజెక్టును త్వరితగతిని పూర్తి చేస్తే ఆహారం విషయంలో దేశం స్వయం సమృద్ధిం కావడానికి ఎంతో తోడ్పడగలదని ఆయన చెప్పారు.

ఈ ప్రాజెక్టును సత్వరం పూర్తిచేయడానికి హైడ్రో ఎలెక్ట్రిక్ ప్రాజెక్టును పూర్తి చేయడానికి అదనంగా నిధులను కేటాయించవలసిందిగా కేంద్ర ప్రభుత్వానికి శ్రీ మధోక్ విజ్ఞప్తి చేశారు. దేశం ప్రయోజనాల దృష్ట్యా ఈ ప్రాజెక్టుకు ఎలాగో అలాగ అదనపు నిధులను సమీకరించాలని ఆయన కోరారు.

క్రీడాభిరామం

మెర్డేకా సోకర్ టోర్నమెంట్:

క్వార్టర్ ఫైనల్స్‌లో ఇండియా ఘనవిజయం

4-0 స్కోరుతో హాంగ్‌కాంగ్‌పై ఆధిక్యం

కౌలాలంపూర్ ఆగస్టు 17—

ఇక్కడ నిన్న రాత్రి జరిగిన మెర్డేకా సోకర్ టోర్నమెంట్ క్వార్టర్ ఫైనల్స్‌లో ఇండియా 4-0 స్కోరుతో హాంగ్‌కాంగ్‌పై ఘన విజయాన్ని సాధించింది.

హాంగ్‌కాంగ్ జట్టుకు ఇది వరసగా మూడవ ఓటమి. ఈ ఓటమివల్ల సెమీ ఫైనల్స్‌కు చేరుకోవాలన్న హాంగ్‌కాంగ్ ఆశలు అడియాసలయ్యాయి.

ఇండియా జట్టు ఇంత వరకు రెండు మ్యాచ్‌లలో గెలుపొందగా, ఒక మ్యాచ్ డ్రాగా సమాప్తమయింది.

ఈ ఆధిక్యంవల్ల ఇండియా జట్టు గ్రూప్ "బి" మ్యాచ్‌లో మలేసియాపై ఆడుతుంది. శుక్రవారం నాడు మలేసియాపై ఆడిన తరువాత, ఆదివారం నాడు దక్షిణ వియత్నాంపై ఇండియా ఆడుతుంది

నిన్న జరిగిన మరొక మ్యాచ్‌లో దక్షిణ వియత్నాం జట్టు 3-0 స్కోరుతో పశ్చిమ ఆస్ట్రేలియాను ఓడించింది. ఆట సగం ముగిసిన సమయానికి దక్షిణవియత్నాం 2-0 స్కోరుతో ఆధిక్యంలో వున్నది.

ఇండియా, హాంగ్‌కాంగ్‌ల మధ్య నిన్న తీవ్రంగా పోటీ జరిగినది. ఆట సగం ముగిసే సరికి ఇండియా జట్టుకు 2-0 స్కోరుతో ఆధిక్యత లభించింది. ఆట రెండవసగంలో మరి రెండు గోలులను కూడా చేసి ఇండియా విజయం దక్కించుకొన్నది.

మంగళవారంనాడు జరిగిన మ్యాచ్‌లలో ఇండొనేసియా 2-1 స్కోరుతో ఫార్మోజాను ఓడించింది.

ఆసియన్ గేమ్ ఫుట్‌బాల్ ఛాంపియన్ బెర్మా జట్టు 3-0 స్కోరుతో సింగపూర్‌పై ఘనవిజయాన్ని సాధించింది.

మలేసియా, దక్షిణవియత్నాంల మొన్న జరిగిన గ్రూప్ "ఎ" మ్యాచ్ 1-1 స్కోరుతో డ్రాగా సమాప్తమయింది.

పశ్చిమ ఆస్ట్రేలియా 3-1 స్కోరుతో థాయిలెండును ఓడించింది.

మొదటి ఇన్నింగ్సులో 250 పరుగులకు ఇండియా ఆలౌట్

నార్తంప్టన్ క్రికెట్ మ్యాచ్ మొదటిరోజు ఆట ఫలితాలు

నార్తంప్టన్, ఆగస్టు 17— చెషైర్ స్కూల్స్, ఆలిండియా స్కూల్స్ జట్ల మధ్య మొన్న ఇక్కడ ప్రారంభమైన రెండు రోజుల క్రికెట్ మ్యాచ్ మొదటిరోజు ఆటలో ఆట ముగిసేసరికి ఇండియా జట్టు ఆధిక్యంలో వున్నది.

మొదటి ఇన్నింగ్సులో ఇండియా జట్టు 250 పరుగులను స్కోరు చేసింది. ఆట ముగిసే సరికి చెషైర్ జట్టు ఎనిమిది వికెట్ల నష్టానికి 41 పరుగులను మాత్రమే స్కోరు చేయగలిగింది.

లక్ష్మణ్ సింగ్ 52 కొట్టారు ఎన్. ఎమ్. హెచ్. కిర్మాణి (76), ఇందర్ రాజ్ (58 నాటౌట్) లు కూడా చక్కగా బాటింగ్ చేశారు.

టీ సమయానికి ఇండియా జట్టు 250 పరుగులకు ఆలౌట్ అయింది.

స్కోరు వివరాలు

ఇండియా స్కూల్స్ జట్టు: (మొదటి ఇన్నింగ్సు): ఎ. ఏ. ఆసిఫ్ 12, లక్ష్మణ్ సింగ్ 52, ఎమ్. అమరనాథ్ 1, ఎస్. ఎం. హెచ్. కిర్మాణి 76, ఎ. నాయక్ 2, అరుణ కుమార్ రనౌట్ 10, జె. హెచ్. మహేంద్ర 0, ఇందర్ రాజ్ నాటౌట్ 58, వి. ఫెర్నాండెజ్ రనౌట్ 1, ఆర్. టాండన్ 10, ఇన్సిర్ సింగ్ 14, ఎక్స్‌ట్రా 14 మొత్తం 250 పరుగులు.

బౌలింగ్: వాకర్ 12-1-44-2, గూచ్ 20-3-80-2, హ్యూగ్స్ 1-0-5-0, రీల్ 13-3-39-1, బర్ట్రిడ్జ్ 20-5-41-0, మిల్నర్ 18-5-9-27-3

చెషైర్ స్కూల్స్: మొదటి ఇన్నింగ్సు) టి. గారిల్ 2, జె. ఆర్డు 0, ఎం. క్రాకెట్ 22, పి. లింగార్డ్ 4, ఎం. రీల్ 4, ఎస్. మిల్నర్ 3, జె. హ్యూగ్స్ 3, జె. ఎ. బర్ట్రిడ్జ్ నాటౌట్ 2, ఎ. జె. వాకర్ .., పి. గూచ్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రా 1 మొత్తం (ఎనిమిది వికెట్లకు 41.

వీరభద్రరావుకు టేబుల్ టెన్నిస్ సింగిల్స్ పతకం

గుంటూరు ఆగస్టు 17— గుంటూరు రిక్రియేషన్ క్లబ్ నిర్వహించిన బచ్చు వందరెడ్డి జన్మదినోత్సవ టోర్నమెంట్స్ వలి తాలు ఈ విధంగా వున్నాయి.

టేబుల్ టెన్నిస్ (సింగిల్స్): జి. వి. ఎస్. వీరభద్రరావు 21-16, 21-14, 21-17 స్కోరుతో వి. రమేష్‌కుమార్‌ను ఓడించారు.

క్యారమ్స్ (సింగిల్స్):— రమణ 29-18, 29-14, 29-8 స్కోరుతో జి. రాజేశ్వరరావుపై గెలుపొందారు.

డబుల్స్:— రమణ ఎమ్. నరసింహారావులు 29-14, 24-29, 29-20 స్కోరుతో మధు వెంకటేశ్వరరావులపై గెలుపొందారు.

రోడ్ ట్రాన్స్‌పోర్టు రిక్రియేషన్ క్లబ్ టోర్నమెంట్స్

విజయవాడ, ఆగస్టు 17— కృష్ణాడివిజన్ రోడు ట్రాన్సుపోర్టు రిక్రియేషన్ క్లబ్ మొన్న ఇక్కడ నిర్వహించిన టోర్నమెంట్స్‌లో ఈ క్రింది క్రీడాకారులు విజయం పొందారు.

డివిజనల్ కంట్రోలర్ శ్రీ జి. ప్రభాకర గుప్తా ఈ టోర్నమెంట్సును మొన్న ప్రారంభించారు.

విజేతలపేర్లు: 100 మీటర్ల పందెం:- ఇ. శివయ్య (విజయవాడ) 200, మీటర్లు ఇ. శివయ్య. 800 మీటర్లు ఇ. శివయ్య. లాంగ్‌జంప్ కె. పర్వయ్య (కొత్తగూడెం) హైజంప్:టి ప్రభాకరరావు (విజయవాడ), షాట్‌పట్:ఎం.ఎన్ నారాయణ (విజయవాడ) డిస్కస్:టి ప్రభాకరరావు, జావలిన్: ఎ. ఎం అలీ (ఖమ్మం), బాల్‌బాడ్మింటన్:కొత్తగూడెం. క్యారమ్స్:జగ్గయ్య పేట. చెస్ గుడు: విజయవాడ.

ఆంధ్రపిలిం వాణిజ్యమండలి అధ్యక్షుడు శ్రీ పి జి బెనర్జీ విజేతలకు బహుమతులను అందజేశారు.

ఇండియా ఆటగాడు ముఖర్జీ ఓటమి

క్యూబెక్ (కెనడా) ఆగస్టు 17— ఇక్కడ మొన్న జరిగిన ఇంటర్నేషనల్ రౌండ్ రాబిన్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంటులో ఇండియా ఆటగాడు జైదీప్ ముఖర్జీ, స్పెయిన్‌కు చెందిన మాన్యువల్ సంతానా చేతిలో ఓడిపోయాడు 2-1 స్కోరుతో ఈ విజయం సంతానాకు లభించింది.

అంతకు ముందుగా సంతానా 6-0, 6-3 స్కోరుతో ముకేశ్‌పై గెలుపొందాడు.

జాతీయ బాక్సింగ్ పోటీలు

కలకత్తా ఆగస్టు 17— నాలుగవ జాతీయ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ హైదరాబాదులో ఫిబ్రవరి ఆఖరివారంలోగానీ, మార్చి మొదటివారంలో నిర్వహింపబడతాయని ఇండియన్ ఎమెచ్యూర్స్ బాక్సింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు శ్రీ అశోక ఛటర్జీ ప్రకటించారు.

ఆంధ్రప్రదేశ్ ఎమెచ్యూర్ బాక్సింగ్ అసోసియేషన్ ఈ ఛాంపియన్‌షిప్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

కాళహస్తి వద్ద కారు, లారీ ఢీ

ఒకవ్యక్తి దుర్మరణం

కాళహస్తి ఆగస్టు 17— మద్రాసు నుంచి తిరుపతి వెళుతున్న కారు, లారీ ఢీకొన్న దుస్సంఘటనలో మొన్న కారు యజమాని శ్రీ సుదర్శనంనాయుడు అక్కడికక్కడేమరణించారు. కారులోని అరుగురు తీవ్రగాయాలతో స్పృహలేకుండా పడిపోయారు.

వారికి కాళహస్తి ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేసిన పిదప తిరుపతి రుయా ఆసుపత్రికి పంపారు. వారు అక్కడ కోలుకుంటున్నారు.

మృతుడు పూతలపట్టు సమీపం తిరుమాసి వాస్తవ్యుడని తెలుస్తున్నది.

అర్బన్ పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరు శ్రీ ఆర్. భాస్కరరెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

ఇండో—సోవియెట్ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యాన విజయవాడలో భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంలో జరిగిన సభలో సినీనటుడు శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావు ప్రసంగిస్తున్న దృశ్యం

తిరుపతి దుర్ఘటన వాస్తవ కారణాలు

ప్రకటించాలని శ్రీ లచ్చన్న విజ్ఞప్తి

శ్రీకాకుళం, ఆగస్టు 17— వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద 17 మంది దుర్మరణం చెందడం గత చరిత్రలో ఎప్పుడు జరగలేదని 14వ తేదీన రాష్ట్ర స్వతంత్ర పార్టీ అధ్యక్షుడు శ్రీ గౌతు లచ్చన్న పేర్కొన్నారు.

దేవస్థానం అధికారులు, ప్రత్యేకించి ప్రభుత్వం ఈ దుర్ఘటనను గురించి తక్షణమే వాస్తవమైన కారణాలను ప్రకటించాలని శ్రీ గౌతు లచ్చన్న కోరారు

వాడవాడల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

నెల్లూరు, ఆగస్టు 17— స్వాతంత్ర్య దినోత్సవం ఇక్కడి కాలేజీలలో, హైస్కూల్సులో, ప్రభుత్వ ఆఫీసులలో, మునిసిపల్ ఎలిమెంటరీ పాఠశాలలలో కస్తూరిదేవి గరల్సు హైస్కూలులో, ఎ.బి.ఎం. గరల్సు స్కూల్‌లో వైభవంగా జరిపారు. జాతీయ పతాకాలను ఎగురవేశారు. బాలలకు మిఠాయిలు పంచారు. దర్గామిట్ట పోలీసు మైదానంలో కలెక్టరు ఇన్‌చార్జి శ్రీ జి. వి. చలపతి జాతీయ పతాకంను ఎగురవేశారు. జిలా అధికారులు, ఉపాధ్యాయులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు. జిల్లా పోలీసు సూపరింటెండెంటు శ్రీ కె. విజయరామారావు అతిథులకు స్వాగతం పలికారు. జిలా పరిషత్ ఆఫీసు, మునిసిపల్ ఆఫీసు, రెడ్‌క్రాస్ నర్సరీ స్కూలులో జాతీయ పతాకాలు ఎగురవేశారు. తిప్పరాజువారి సత్రం వద్ద వృద్ధ కాంగ్రెసు కార్యకర్తలు శ్రీ ఇంద్రగంటి సుబ్రహ్మణ్యం, శ్రీ గండవరపు హనిమారెడ్డి జెండాలు ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవం గురించి ఉపన్యసించారు. గాంధి విగ్రహానికి పూలమాలలు వేశారు.

తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం, ఆగస్టు 17— స్వాతంత్ర్యోత్సవం సందర్భంగా తాలూకాఫీసులో తహశీల్దారు శ్రీ దాసరాజు వెంకట సుబ్బారావు జాతీయపతాక ప్రతిష్ఠాపన చేశారు. మునిసిపల్ ఆఫీసులో అధ్యక్షులు డాక్టరు కోదే వెంకటరావు పతాకావిష్కరణ చేశారు. ప్రాథమిక పాఠశాలల బాలబాలికల ఊరేగింపు జరిపారు.

కస్పాపెంటపాడులో పాఠశాలకు శ్రీ ఎరుబండి జియ్యన్న తల్లి శ్రీమతి రత్నమ్మ రేడియో సెటు బహూకరించారు. గణపవరం పంచాయితీసమితి అధ్యక్షులు శ్రీ [illegible] వెంకట్రామయ్య సభాధ్యక్షత వహించారు. అధ్యక్షులు ప్రసంగించారు.

మున్సిఫ్ మేజిస్ట్రేటు కోర్టువద్ద శ్రీ టి. పురుషోత్తమరెడ్డి పతాకావిష్కరణ చేసి ఉపన్యసించారు. ఆర్. టి. సి. బస్సు డిపో వద్ద మేనేజరు శ్రీ టి వి. సుబ్బారావు జండా ప్రతిష్ఠించారు. శ్రీ కృష్ణా బాలాజీ టాకీస్‌లో బాల బాలికలకు ఉచితంగా సినిమా ప్రదర్శించారు

గుంటూరు

గుంటూరు, ఆగస్టు 17— పట్టణస్టేషనరీ, జనరల్ మర్చంట్సు అసోసియేషన్ వారి కార్యాలయంలో స్థానిక హిందు కళాశాల మాజీ ప్రిన్సిపాల్ శ్రీ బుద్ధిరాజు రామచంద్రరావు అధ్యక్షతన స్వాతంత్ర్యోత్సవం వైభవంగా జరిగింది శ్రీ పచ్చిపులుసు రంగనాయకులు జాతీయ పతాక నెగురవేశారు. శ్రీ నళం గోపాల నాగేశ్వరరావు స్వాగతం పలికారు. శ్రీయుతులు బి. ఎస్. ఎల్ హనుమంతరావు, కోట వెంకటేశ్వర్లు, పచ్చిపులుసు రామలింగం ఉపన్యసించారు. కార్యదర్శి శ్రీ పొట్టి రాఘవరావు వందన సమర్పణం కావించారు

నంద్యాల

నంద్యాల, ఆగస్టు 17— స్థానిక పురపాలక సంఘం కార్యాలయం ఆవరణలో శాసనసభ్యులు శ్రీ ఎస్. బి. నబిసాహెబ్ జండా ప్రతిష్ఠాపన చేశారు. సెక్రెటరీ శ్రీ వై. వి. రమణారెడ్డి వందనసమర్పణం చేశారు. పిల్లలకు మిఠాయిలను పంచారు. సబ్ కలెక్టరు శ్రీ ఆర్ కె ఆర్. గోనెల హోమ్ స్టడ్ కార్యాలయం ఆవరణలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి వారి "మార్చ్ పాస్ట్"ను తిలకించారు.

స్థానిక మహోన్నత పాఠశాల ఆవరణలో శ్రీ పసపుల సుబ్బారాయుడు శెట్టి మూడు రంగుల జండాను ఆవిష్కరించారు. విద్యార్థులు "మార్చ్‌పాస్టు" చేశారు. పిల్లలకు బహుమతులను పంచారు

ఒకటవ టౌన్ పోలీసు స్టేషన్‌లో శ్రీ ఎం. కృష్ణారెడ్డి, తాలూకా పోలీసు స్టేషన్లో శ్రీ ఎం. ఎ. వి. సత్యనారాయణ, రెండవ టౌన్ పోలీసు స్టేషన్‌లో శ్రీ సర్దారీ బేగ్, పంచాయితీ సమితిలో శ్రీ జి. పుల్లారెడ్డి ఫైర్ స్టేషన్‌లో శ్రీ ఇ. ఎం. రంగస్వామి, అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో శ్రీ డి. వెంకటేశ్వరయ్య, గ్రామసేవక్ సెంటరులో శ్రీ బి ఎల్. నరసింహారావు హెడ్ పోస్టాఫీసులో శ్రీ ఎస్. డి. కులకర్ణి పతాకావిష్కరణలు కావించారు.

స్థానిక కుష్ఠు ప్రేమ సంఘం, సమాజ సేవా సంస్థలవారు ప్రకాశ్ భవనంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దీనులకు, బీదలకు, అనారోగులకు ఆహార పదార్థాలను పంచారు. కుష్ఠు ప్రేమ సంఘం, సమాజ సేవా సంస్థల కార్యదర్శులు శ్రీ అప్పల ఆంజనేయులుగుప్త, శ్రీమతి చక్కా అనంతలక్ష్మి వి, పలువురు సర్వోదయ కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసాపురం

నరసాపురం, ఆగస్టు 17— స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా స్థానిక ప్రభుత్వ కార్యాలయాలపైన, విద్యాశాలలపైన జాతీయ పతాకాలు ఎగురవేశారు. స్థానిక కళాశాల ఎన్. సి. సి నేవీ విద్యార్థుల గౌరవ వందనం కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీ టి. రామారావు స్వీకరించారు. బాల బాలికలకు మిఠాయిలు పంచారు.

ఆకివీడు

ఆకివీడు ఆగస్టు 17— స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులో శ్రీ పులపర్తి వెంకటసుబ్బారావు జమీందార్, శ్రీ వెంకట లక్ష్మి సినిమాహాలులో శ్రీ జి పూర్ణచంద్రరావు శ్రీ లక్ష్మి భవనంలో శ్రీ అన్నం సోమరాజులు, జాతీయ జెండాలు ఎగురవేసి బాల బాలికలకు మిఠాయిలు పంచారు. స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా శ్రీ వెంకట లక్ష్మిటాకీస్‌లో రష్యన్ సర్కస్‌ను విద్యార్థులకు కన్‌సెషన్ రేట్లకు చూపారు. సినిమా హాలువద్ద బాల బాలికలకు స్థానిక రిప్రజెంటేటివ్ శ్రీ చలసాని వెంకటేశ్వరరావు బిస్కట్లు పంచారు. జ్యోతి బుక్ హౌస్‌వద్ద స్వాతంత్ర్య దినోత్సవ ప్రాముఖ్యత గురించి ఎం.డి. రఫీ ఉపన్యసించారు

మార్కాపురం

మార్కాపురం, ఆగస్టు 17— స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శ్రీ కొప్పరపు వెంకటకృష్ణవిలయం, పఠనాలయంలోను, రెవిన్యూ డివిజనల్ ఆఫీసును, బ్లాకు నిర్వహణాధికారుల కార్యాలయాలలోను జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, పరిషత్ మహోన్నత పాఠశాలలోను జాతీయ పతాకాలను ఎగురవేశారు.

బాలికల ఉన్నత పాఠశాలలో సమితి అధ్యక్షులు శ్రీ జంకె రామిరెడ్డి జాతీయ పతాకను ఎగురవేశారు. ఇక్కడ జరిగిన సభలో కార్యదర్శి ఎ. వి. రమణయ్య, ప్రధానోపాధ్యాయిని కుమారి వి. విమల బాలికల కర్తవ్యాన్ని గురించి ఉపన్యసించారు. పరిషత్ మహోన్నత పాఠశాలలో జరిగిన సభకు శ్రీ జంకె రామిరెడ్డి అధ్యక్షత వహించారు. శ్రీయుతులు డాక్టరు ఎన్. వెంకటేశ్వర్లు కె రామకోటిశాస్త్రి, ఒ. వి. రమణయ్య, యక్కలి రామయ్య ప్రధానోపాధ్యాయుడు శ్రీ వై. ఎల్. నరసింహారావు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు జరిపి బహుమతులను పంచారు. ఆంధ్రరత్న ట్యుటోరియల్ కాలేజిలో శ్రీ కె టి. నరసింహాచార్యులు అధ్యక్షతన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు వైభవంగా జరుపుకున్నారు.

పొన్నూరు

పొన్నూరు, ఆగస్టు 17— స్వాతంత్ర్య దినోత్సవాలు పొన్నూరు, ఓడ్రుబోలు పట్టణాలలో ఘనంగా జరిగాయి. మూర్తిమహల్ వద్ద జుడిషియల్ సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీ జి నరసింహదాసు జాతీయ పతాకను ప్రతిష్ఠించి, పతాకవందనం చేశారు. థియేటరు యజమాని శ్రీ ఆలపాటి త్రిపురాపాణి పిల్లలకు మిఠాయిలు పంచారు. వైజ్ఞానిక చలనచిత్రాలను ప్రదర్శించారు. శ్రీ భావనారాయణస్వామి గ్రంథాలయం దగ్గర సంస్కృత కళాశాల ఉన్నత పాఠశాల అభ్యుదయ మండలి పక్షాన జరిగిన ఉత్సవంలో డిప్యూటీ తహసీల్‌దారు శ్రీ ఎం. వి. ఎల్. నరసింహారావు పతాక ప్రతిష్ఠ చేశారు అభ్యుదయ మండలి అధ్యక్షులు శ్రీ పి. వి. ఆర్. అప్పారావు బాల బాలికలకు బిస్కట్లు పంచారు. పి బి ఎన్. కాలేజీలో కళాశాల దాత శ్రీ పి. సుబ్బారాయుడు జాతీయ జెండాను ప్రతిష్ఠ చేశారు ప్రిన్సిపాల్ శ్రీ జి శ్రీమన్నారాయణ స్వాతంత్ర్య వందనం స్వీకరించారు. ఎన్. సి. సి. కవాతును శ్రీ ఉప్పల నాగేశ్వరరావు, శ్రీ పి. చెంచయ్య నిర్వహించారు. పిల్లలకు మిఠాయిలు పంచారు. జిల్లా పరిషత్తు యసూర్ సెకండరీ స్కూల్, గరల్సు హైస్కూల్, వివిధ విద్యా సంస్థలలో జాతీయపతాకాలు ప్రతిష్ఠించారు, మిఠాయిలు పంచారు.

పొన్నూరు గాంధీ మండపం దగ్గర పొన్నూరు - విడ్డుబోలు ఖాదీ సవివారల సంఘంవారు స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకొన్నారు. వివిధ ప్రభుత్వ కార్యాలయలపై పతాకాలు ప్రతిష్ఠించారు. పట్టణం త్రివర్ణ పతాకాలతో అలంకరితమైనది,

చోడవరం

చోడవరం, ఆగస్టు 17— చోడవరంలో స్వాతంత్ర్యదినోత్సవాన్ని జరిపారు. తాలూకా ఆఫీసువద్ద జాతీయ జెండాను చోడవరం తహశీల్దారు ఎగురవేశారు. వివిధ పాఠశాలలకు చెందిన వెయ్యిమంది విద్యార్థులకు మిఠాయిలను పంచారు. శాసనసభ్యులు శ్రీ వి. పాలవిల్లి ప్రసంగించారు. శ్రీయుతులు గోవిందరాజన్, వి. పాలవిల్లి, వి సూర్యనారాయణమూర్తి పేదవారికి అహారాన్ని పంచారు.

విజయవాడ

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

విజయవాడ, ఆగస్టు 17— స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడ కోపరేటివ్ సెంట్రల్ స్టోర్సు కార్యాలయంపై మొన్న ఉదయం డిప్యూటీ రిజిస్ట్రార్-ఆఫీసరు ఇన్‌చార్జి శ్రీ ఆకెళ్ళ కామేశ్వరరావు త్రివర్ణ పతాకను ఆవిష్కరించి, దాని ప్రాధాన్యతను వివరించారు. పట్టణంలో గల 36 బ్రాంచీల సిబ్బంది, హెడ్డాఫీసు సిబ్బంది ఉత్సవంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

శీతానగరం పబ్లిక్ వర్క్‌షాపు ఆఫీసర్లు, కార్మికులు అమితోత్సాహంతో "పండుగ" జరుపుకున్నారు. ఉదయం వర్కుషాపు ఆవరణలో జనరల్ సూపరింటెండెంటు శ్రీ జె. రంగనాయకులు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పిల్లలకు స్వీట్సు పంచిపెట్టారు. సాయంత్రం శీతానగరం పి. డబ్ల్యు. డి. వర్కుషాపు డెమొక్రటిక్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన నాటిక, నాటకం ప్రదర్శించారు.

మల్లికార్జునపేట బుద్ధారాములు చౌక్‌లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శ్రీ పొలమరశెట్టి వెంకటేశ్వరరావు జండా ఎగురవేశారు. పలువురువక్తలు స్వాతంత్ర్య దినోత్సవం ప్రాముఖ్యం గురించి ఉపన్యసించారు. పిల్లలకు మిఠాయిలు పంచారు.

కొత్తపేటలోగల కాంతి ట్యుటోరియల్ కాలేజిలో స్వాతంత్ర్య దినోత్సవం వైభవోపేతంగా జరిగినది. సభకు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ సూర్యకుమార్ అధ్యక్షత వహించారు. ఆంధ్రా ప్రతిష్ఠాపన శ్రీ పోతిన మల్లయ్య పాత్రుడు కావించారు. కాలేజీ విద్యార్థినులు దేశమాతకు హారతి ఇచ్చారు. శ్రీ పాయిబాబ సభికులకు స్వాగతం చెప్పారు. వేదికపై వున్న వారిని శ్రీ రసూల్ పుష్పమాలాంకృతులను కావించారు. పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు స్వాతంత్ర్య దినోత్సవం వైభవం గురించి ప్రసంగించారు. సభానంతరం సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. శ్రీ పోతిన మల్లయ్య పాత్రుడు బహుమతి ప్రదానం చేశారు. శ్రీ గోపాలకృష్ణారావు వందనసమర్పణ. కుమారి అన్నపూర్ణ రమాదేవి "జనగణమన" గీతాలాపనతో సభ ముగిసినది.

కృష్ణలంక ప్రజాసేవా సంఘంవారి ఆధ్వర్యాన డాక్టరు కె ఎల్. రావు, చౌకలో కావన సభ్యులు డాక్టరు టి. వి ఎస్ చలపతిరావు జాతీయ జండాను ఎగురవేశారు. కృష్ణలంకకు కావలసిన అభివృద్ధి కార్యక్రమాలను శ్రీ ఎన్. వి. సుబ్బారావు పఠిదీకరించారు. శ్రీ కోరా ఆదినారాయణమూర్తి పిల్లలకు మిఠాయిలు పంచారు.

సి. ఆర్. జి.ఎం హైస్కూల్ ఆవరణంలో స్వాతంత్ర్య దినోత్సవం వైభవోపేతంగా జరిగినది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ టి. భవాని ఉదయం మునిసిపాలిటి స్పెషల్ ఆఫీసరు శ్రీ కె. మాధవరావును ఆహ్వానించారు స్పెషల్ ఆఫీసరు జాతీయ పతాకావిష్కరణ కావించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ చీఫ్ ఇన్‌స్ట్రక్టరు శ్రీ ఒగ్గు నరసింహారావు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్. సి.సి. ఆఫీసరు శ్రీ వి భీమారావు బాలబాలికలచే జాతీయదళ విన్యాసాలు, ప్రతిజ్ఞ చేయించారు తదుపరి ఆంధ్రా బెటాలియన్ రైఫిల్ షూటింగులో ప్రథమ, ద్వితీయబహుమతులు పొందిన కుమారి ఎస్ రాజ్యలక్ష్మి, వి. విర్కులకు కప్పులను బహూకరించారు

కృష్ణాజిల్లాలో కమ్యూనికేషన్ల అభివృద్ధి

పరిషత్తు స్థాయీసంఘంచే రు. 7.69 లక్షలు కేటాయింపు

"ఆంధ్రజ్యోతి" (ప్రతినిధి) మచిలీపట్నం, ఆగస్టు 17—

కమ్యూనికేషన్ల అభివృద్ధికి రు. 7.69 లక్షలను కృష్ణా జిల్లా పరిషత్తు ఏడవ స్థాయీ సంఘం మంజూరు చేసింది.

ఈ మొత్తంలో గుడివాడ సబ్ డివిజన్‌కు రు. 3.58 లక్షలు, విజయవాడ సబ్ - డివిజన్‌కు రు. 3.31 లక్షలు. నాగాయలంక నుంచి నాలి వరకు మెటల్‌రోడ్డు వేయడానికి 60 వేల రూపాయలను స్థాయీ సంఘం మంజూరు చేసింది.

గుడివాడ సబ్-డివిజన్‌లోని 11/6 మైలు నుంచి 12/7 మైలువరకు గల రోడ్డును మెటలింగ్ చేయడానికి "పైప్ కల్వర్టు"లను నిర్మించడానికి 20 వేల రూపాయలను స్థాయీ సంఘం మంజూరు చేసింది.

పై పనులకే కాక గంపలగూడెం నుంచి వావిళ్ళకు రోడ్డు వేయడానికి 30 వే. పెద్దపులిపాక నుంచి జయంతి రోడువరకు మెటలింగ్ చేయడానికి రు. 25,000. కంచికచెర్ల - గొట్టుముక్కల రోడ్డు, పెద్దాపురం-జయంతి రోడ్డులలో "కల్వర్టు"లను నిర్మించడానికి 12 వేల రూపాయలు మంజూరు చేశారు.

1967-68 సంవత్సరంలో గొల్లపల్లి, గుడ్డేపల్లి జుజ్జూరు మొగలూరు పెద్దవరం, రమణక్కపేట, రెడ్డిగూడెం, చనుబండ, గన్నవరంలలో పరిషత్తు హైస్కూళ్ళలో 11 వ తరగతిని, మండవాడులో పదవ తరగతిని, పెనుమల్లి, పమిడిముక్కల(?) ముది, కోసూరు, వెంట్రప్రగడ, గురజాడ, పెదముత్తేవి భుజబలపట్నం, నున్న రామన్నగూడెం కోనాయపాలెం, పల్లెర్లమూడి, నెమలి, గుంటుపల్లిలలో తొమ్మిదవ తరగతిని 1967-68 లో ప్రారంభించుటకు ఆర్థికసహాయాన్ని స్థాయీసంఘం మంజూరు చేసింది. ఇంతేకాక ఆయా హైస్కూళ్ళలో ఆయా తరగతులను ప్రారంభించవలసిందిగా జిల్లా విద్యాధికారికి స్థాయీసంఘం సిఫార్సు చేసింది.

పదవ తేదీన జరిగిన సమావేశంలో పై మంజూర్లు చేశారు. సమావేశానికి చెయిర్‌మన్ శ్రీ పి కోటేశ్వరరావు అధ్యక్షతవహించారు.

మదరాసు ముఖ్యమంత్రి శ్రీ అన్నాదురై ఆగస్టు 15 వ తేదీన మాట్లాడుతూ తమ రాష్ట్రంలోని ప్రతి పంచాయతీ యూనియన్‌లో బడిపిల్లలకు మధ్యాహ్న భోజన వసతి కల్పించడానికి ఒకే వంటశాలను ఏర్పాటు చేయడానికి సంకల్పించినట్లు తెలియజేశారు.

కంట్రాక్టరుకు స్వర్ణపతకం

విజయవాడ, ఆగస్టు 17— నాగార్జున సాగర్ నిర్మాణ కార్యక్రమంలో మరుపురాని పాల్గొనటూ డామ్ నిర్మాణపు పనులను శ్రద్ధాసక్తులను కనబరచిన ప్రముఖ కంట్రాక్టరు శ్రీ సాగి కృష్ణంరాజును మొన్న కొల్లేరు ప్రారంభోత్సవం సందర్భంలో ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి అభినందించి ఆయన కృషికి చిహ్నంగా స్వర్ణపతకాన్ని బహూకరించారు.

నెల్లూరులో సభలు, ఊరేగింపులపై నిషేధం

నెల్లూరు ఆగస్టు 17— ఇక్కడ విద్యార్థులు హోటళ్ళు రెస్టారెంటుల వద్ద పికెటింగు జరపాలని ప్రతిపాదించిన సందర్భంలో ఇండియన్ పోలీసు 30 వ సెక్షన్ ప్రకారం పదిహేను రోజులపాటు సభలు ఊరేగింపులను నిషేధిస్తూ నెల్లూరు జిలా పోలీసు సూపరింటెండెంట్ 16 వ తేదీ సాయంత్రం ఉత్తరువు జారీచేశారు.

పరిస్థితి మామూలుగానే వున్నది నెల్లూరులో హోటళ్ళు, రెస్టారెంటులను పోలీసులు కాపలా కాస్తున్నారు. రక్షణ విషయంలో హోటల్ యజమానులకు నెల్లూరు పోలీసు సూపరింటెండెంటు హామీ ఇచ్చారు. హోటళ్ళను తెరవవలసిందిగా ఆయన వారిని కోరారు. ఇతర పోలీసు అధికారులతో కలిసి ఆయన 15వ తేదీ సాయంత్రం పట్టణంలో తిరిగారు. బుధవారం నుంచి హోటళ్ళు రెస్టారెంట వద్ద పికెటింగు జరపాలని విద్యార్థులు నిర్ణయించారు.

ఆకాశవాణి

శనివారం, ఆగస్టు 19

విజయవాడ

357.1 మీ (840 కిలోసైకిల్స్)

ఉ॥ 6.00 వందేమాతరం, శుభోదయం. 6.10 భక్తిరంజని: శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం. 6.40 ఆంగ్లంలో వార్తలు. 6.45 సూక్తి ముక్తావళి. 6.50 బజారు ధరలు. 6.55 విరామ సంగీతం. 7.00 తెలుగులో వార్తలు. 7.15 సంగీత శిక్షణ. 7.30 పాలవెల్లి. 8.00 ఆంగ్లంలో వార్తలు. 8.30 వాద్య బృందం. మ॥ 12.30 కార్మికుల కార్యక్రమం. 1.00 తరుణభారతి. 1.30 ఆంగ్లంలో వార్తలు. 1.50 తెలుగులో వార్తలు. సా॥ 5.30 స్థానిక ప్రకటనలు. 5.35 అధ్యాత్మ రామాయణకీర్తనలు. 6.00 ఆంగ్లంలో వార్తలు. 6.05 ప్రాంతీయ వార్తలు. 6.15 వాద్య బృందం. 6.25 ప్రకటించబడును. 6.30 పంటసీమలు. 7.00 తెలుగులో వార్తలు. 7.15 హైదరాబాద్ వలె. 7.30 సంగీత రసన. 7.45 నాటిక. 8.00 కల్పలత: శ్రోతలు కోరిన పాటలు. 8.30 రేడియో న్యూస్‌రీల్. 8.50 విరామ సంగీతం. 9.00 ఆంగ్లంలో వార్తలు. 9.15 ఢిల్లీనుంచి రిలే. 9.30 అఖిలభారత సంగీత కార్యక్రమం. 11.00 ఆంగ్లంలో వార్తలు. 11.05 జనగణ మన. ప్రసార సమాప్తి.

హైదరాబాద్-ఎ

405.4 మీ (740 కిలోసైకిల్స్)

ఉ॥ 6.00 వందేమాతరం, మంగళధ్వని. 6.10 భక్తిరంజని. 6.40 ఆంగ్లంలో వార్తలు. 6.45 సూక్తిముక్తావళి. 6.50 వాద్యగోష్ఠి. 7.00 తెలుగులో వార్తలు. 7.15 సంగీత శిక్షణ. 7.30 గాన సుధ. 7.45 సుగమ సంగీత్. 8.00 ఆంగ్లంలో వార్తలు 8.30 విజయవాడ వలె. మ॥ 12.30 కార్మికుల కార్యక్రమం. 1.00 తరుణభారతి. 1.30 ఆంగ్లంలో వార్తలు. 1.40 చిత్రసీమ. 1.50 తెలుగులో వార్తలు. 2.00 చిత్రసీమ. 3.30 బాలానందం. సా॥ 5.30 స్థానిక ప్రకటనలు. 5.35 విజయవాడ వలె. 6.00 ఆంగ్లంలో వార్తలు. 6.05 ప్రాంతీయ వార్తలు. 6.25 ముఖ్య ప్రకటనలు 6.30 వ్యావసాయిక విషయాలు. 7.00 తెలుగులో వార్తలు. 7.15 వెలుగుబాట 7.45 పరిమిత కుటుంబం-నాటిక 8.00 పరిచయపత్రం. 8.30 రేడియో న్యూస్‌రీల్. 8.50 చిత్రసీమ. 9.00 ఆంగ్లంలో వార్తలు. 9.30 అఖిల భారత సంగీత కార్యక్రమం. 11.00 ఆంగ్లంలో వార్తలు. 11.10 వాతావరణ సూచన. జనగణ మన. ప్రసార సమాప్తి.

హైదరాబాద్-బి

213 మీ (1010 కిలోసైకిల్స్)

మ॥ 2.00 చిత్రపట్ కే 3.00 లక్ష్మణ పండిట్: ఖయాల్. సా॥ 8.00 బెంగాలీ ఖాయ్: ఖయాల్. 9.00 ఫుల్ నాట్. 10.00 జనగణ మన. ప్రసార సమాప్తి.

మద్రాస్-ఎ

416.7 మీ (720 కిలోసైకిల్స్)

ఉ॥ 6.00 వందేమాతరం, మంగళధ్వని. 6.40 విరామసంగీతం 6.45 సంగీతామృతం. 8.45 చిత్రగానం 10.15 సంగీత మంజరి. 10.30 మధురగీతం. 10.55 ఆంగ్లంలో వార్తలు. మ॥ 12.00 కార్మికుల కార్యక్రమం. 1.30 వాద్యగోష్ఠి. 1.45 చిత్రగానం. సా॥ 5.30 సంగీతసౌరభం. 6.00 విరామ సంగీతం. 6.15 చిత్రగానం. 7.30 వ్యవసాయ దారులకు. 8.00 శ్రోతలు కోరిన పాటలు. 9.00 ఆంగ్లంలో వార్తలు. 10.30 చిత్రగానం. 12.00 జనగణమన. ప్రసార సమాప్తి.

మద్రాస్-బి

211.3 మీ (1420 కిలోసైకిల్స్)

ఉ॥ 6.00 మద్రాస్ ఎ వలె. 6.40 ఆంగ్లంలో వార్తలు. 6.45 మద్రాస్ ఎ వలె. 7.00 తెలుగులో వార్తలు. 7.30 మద్రాస్ ఎ వలె. 8.00 ఆంగ్లంలో వార్తలు. మ॥ 1.50 తెలుగులో వార్తలు. సా॥ 6.00 ఆంగ్లంలో వార్తలు. 6.15 విరామ సంగీతం. 6.20 స్థానిక ప్రకటనలు. వాణిజ్యవార్తలు. 7.00 తెలుగులో వార్తలు. 7.15 చిత్రగానం. 8.15 వాద్యసంగీతం. 8.45 విరామ సంగీతం. 9.00 ఆంగ్లంలో వార్తలు. 9.15 ఢిల్లీనుంచి రిలే. 10.30 ఆంగ్లంలో వార్తలు. 10.30 వాతావరణ సూచన. జనగణమన. ప్రసార సమాప్తి.

విపణి వీధి

బులియన్ మార్కెట్

విజయవాడ, ఆగస్టు 17—

వెండి 1 కిలోగ్రామ్	367.00
" 10 గ్రాములు	3.70

కొబ్బరికాయలు [1000]

విజయవాడలో	425.00
పాలకొల్లులో	410.00
అమలాపురంలో	400.00

ధాన్యం

అక్కుళ్ళు	31.13
సెంబర్లు	37.13

బియ్యం

అక్కుళ్ళు	66.50
సెంబర్లు	78.02

అపరాలు

కందులు	130.00
మినుములు	182.00
పెసలు	130.00
శనగలు	170.00
వేరుశనక్కాయ	117.39
వేరుశనగ పప్పు	181.25
వేరుశనగ నూనె	337.10

మద్రాసు మార్కెట్

(ఓపెనింగ్)

మద్రాసు, ఆగస్టు 17—

వేరుశనగ నూనె	310.00
వేరుశనగ పిండి	40.50
వేరుశనగపప్పు	130.00
ఆముదపు నూనె	290.00

హైదరాబాద్ ధరవరలు

హైదరాబాదు, ఆగస్టు 17—

(శ్రీ కె. జయప్రకాష్‌రామ్ అండ్ కో వారి వద్ద నేటి ధరవరలు ఈ విధంగా వున్నాయి. ఫోన్ నెం. 43989)

[ధరలు 100 కి. లకు]

పసుపు	220[illegible]	234.00
కందులు	133.00	136.00
ఎర్ర కందులు చిన్నవి	125.00	129.00
పెసలు	120.00	125.00
మినుములు	185.00	200.00
శనగలు	180.00	188.00
ఉలవలు	70.00	74.00
ప్రత్తి గింజలు	62.00	65.00
మంచినూనె	33.50	—
పెద్ద కందిపప్పు	183.00	185.00
చిన్న కందిపప్పు	174.00	75.00
మినపపప్పు	270.00	277.00
పెసరపప్పు	182.00	184.00
పిరి శనగపప్పు	195.00	200.00
ఇలాచికాయ	125.00	135.00
ధనియాలు	125.00	150.00
శనగపప్పు	205.00	210.00
బెల్లం	62.00	175.00
మిర్చి	220.00	258.00
చింతపండు	240.00	390.00
ఉల్లిగడ్డలు	24.00	26.00
గోధుమలు	140.00	150.00
ఎర్ర గోధుమలు	—	—
మక్క గోధుమలు	—	—
కుసుములు	100.00	105.00
నువ్వులు [తెల్లవి]	230.00	240.00
ఇలాచి పలుకులు చిన్నవి	125.00	136.00
ఇలాచి పలుకులు పెద్దవి	195.00	200.00
ఆముదాలు	125.00	128.00
తైదలు	71.00	72.00

అప్పు పొందండి

రు. 500 — నుంచి రు. 12 000 — వ్యక్తి జామీనుమీద వివాహము వ్యాపారము. ఇల్లు కారు, స్కూటరు వగైరాలకు 60 తేలికైన నెలసరి వాయిదాలలో చెల్లించవలెను దగును ఉచిత ప్రాస్పెక్టసుకు నేడే ఇంగ్లీషులో లేక హిందీలో వ్రాయండి.

UBER FINANCE (P) LTD.
A-4 Seetla Amritsar

ఆంధ్రజ్యోతి
సచిత్ర వార పత్రిక

★

వనితావనిలో శ్రీమతి సావిత్రి గణేశన్ పాఠకుల ప్రశ్నలకు సమాధానాలిస్తారని తెలియచేయడానికి సంతోషిస్తున్నాము.

పాఠకులు తమ ప్రశ్నలను వెంటనే

★

వనితావని
ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక,
పోస్టుబాక్సు నెం. 334. విజయవాడ-2.కు పంపాలి.

కలకత్తాలోని పాకిస్తాన్ దౌత్య ప్రతినిధి వ్యవహారం

చర్య తీసుకోగలనన్నందుకు ఇండియాకు తీవ్ర ఆక్షేపణ

ఇస్లామాబాద్ ఆగస్టు 17—

క్రితం నెల జరిగిన ఒక సరిహద్దు సంఘటనతో సంబంధం కల్గి ఉన్నాడనే ఆరోపణపై కలకత్తాలోని తమ డిప్యూటీ హైకమిషనర్ హుసేన్ ఇమామ్‌పై భారత ప్రభుత్వం చర్య తీసుకుంటామని ప్రకటించినందున పాకిస్తాన్ ప్రభుత్వం తీవ్ర ఆక్షేపణను తెలిపింది.

ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషనర్ తమ దేశాంగ కార్యాలయానికి రాసిన, గత సోమవారం ఈ సంఘటన సందర్భంగా భారత దేశాంగ మంత్రి ఎం. సి. చాగ్లా చేసిన ప్రకటనపై పాకిస్తాన్ ప్రభుత్వం అభ్యంతరాన్ని తెలిపారు.

కలకత్తాలోని పాకిస్తాన్ డిప్యూటీ హై కమిషనర్ జులై నాలుగవ తేదీన సరిహద్దువరకు వెళ్ళి వచ్చారని పశ్చిమ బంగ ప్రభుత్వం పంపిన ప్రాథమిక నివేదికవల్ల తెలుసున్నది. ఆయన ముగ్గురు వ్యక్తులతో కలసి ఒక కారును సరిహద్దు పోలీసు కస్టమ్సు అధికారులు అడ్డగించకుండా తీసుకువెళ్లారని, ఆ కారులో వారు సరిహద్దు దాటి పలాయనమైనారని శ్రీ చాగ్లా గత సోమవారం చెప్పారు.

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నుంచి పూర్తి నివేదిక అందిన తర్వాత ఏ చర్య తీసుకోవాలో ఆలోచిస్తామని శ్రీ చాగ్లా అన్నారు.

ఏదో ఒక వార్తా పత్రికలో ప్రచురింపబడిన కట్టుకథను బట్టి తమ దౌత్యప్రతినిధి భారత ప్రభుత్వం పీడిస్తున్నదని పాకిస్తాన్ ప్రభుత్వం నిన్న భారత ప్రభుత్వాన్ని నిందించింది

అసోసియేటెడ్ ప్రెస్ ఆఫ్ పాకిస్తాన్ హుసేన్ ఇమామ్ తన భార్యను కొడుకును మాత్రమే సరిహద్దు వరకు తీసుకొని వెళ్ళాడని తెలిసింది. ఆ సరిహద్దు నిషిద్ధప్రాంతం కాదు కావున పశ్చిమబెంగాల్ ప్రభుత్వానికి ఆయన ముందుగా తెలపాల్సిన అవసరం లేదనికూడా ఈ వార్తాసంస్థ వాదించింది.

సెప్టెంబర్ 11న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమ్మె

సంయుక్త కార్యాచరణ సంఘం కార్యదర్శి పీటర్ అల్వారిస్ వెల్లడి

బొంబాయి ఆగస్టు 17 — కేంద్ర ప్రభుత్వోద్యోగుల సంఘాలు సమాఖ్యల సంయుక్త కార్యాచరణ సంఘం కార్యదర్శి శ్రీ పీటర్ అల్వారిస్ నిన్న ఇక్కడ పత్రికా విలేకరులతో మాట్లాడుతూ సెప్టెంబర్ 11 వ తేదీన కేంద్ర ప్రభుత్వోద్యోగులు సమ్మె జరిపేందుకు కార్యాచరణ సంఘం విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు.

కార్మిక నిబంధనల ప్రకారం సమ్మెకు నాలుగురోజులు ముందుగా ఇవ్వవలసిన నోటీసు ఆగస్టు 26వ తేదీన ఇవ్వడం జరుగుతుందని ఆయన అన్నారు.

తమకు చెల్లింపవలసిన కరవుభత్యాన్ని డబ్బురూపంలో చెల్లించాలనే కోర్కెను పురస్కరించుకొని రెండున్నర లక్షల మంది కేంద్ర ప్రభుత్వోద్యోగులు సెప్టెంబర్ 11న సమ్మె చేస్తారని ఆయన అన్నారు.

ఈ సందర్భంలో ఆగస్టు 24వ తేదీన ఢిల్లీలోను 29, 31 తేదీలలో బొంబాయి మద్రాసులలోను గొప్ప ప్రదర్శనలు జరుగుతాయని ఆయన అన్నారు.

* * *

రైల్వే ఉపమంత్రి శ్రీ సి. ఎం. పునాచా ఆగస్టు 1[illegible]వ తేదీన షట్ప్రభలోని కర్ణాటక ఆరోగ్య సంస్థలో ఒక ప్రత్యేక వార్డుకు, అతిథి గృహానికి ప్రారంభోత్సవం చేసినట్టు బెళ్గాం వార్త

* * *

కాంగో కిరాయి సైనిక నాయకుడు మేజర్ జాన్ ష్రామ్ ఆగస్టు 16వ తేదీన మాట్లాడుతూ కిన్‌సాసాకు సహాయం చేయడాన్ని బుకావునుండి విరమించకపోతే జలంబుబా విద్యుచ్ఛక్తి సరఫరాను పేల్చివేయ గలనని బెదిరించినట్టు బుజుంబురా వార్త.

వాణిజ్యపంటల అధికోత్పత్తి

న్యూఢిల్లీ ఆగస్టు 17 — దేశవ్యాప్తంగా ఈ సంవత్సరం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంవల్ల ప్రత్తి, జూట్, నూనెగింజలు, పొగాకు మొదలయిన వాణిజ్య పంటలు బాగా పండగలవని ఆశించబడుతున్నది

ఈ సంవత్సరం ప్రత్తి 66 25 లక్షల బేళ్ళు ఉత్పత్తి కాగలదని అంచనా వేయబడింది. గత సంవత్సరం కంటే ఇది 13 లక్షల బేళ్ళు ఎక్కువ. జూట్ ఉత్పత్తి 7.5 లక్షల బేళ్ళు ఉండగలదని భావించబడుతున్నది. నూనెగింజల ఉత్పత్తి 80 లక్షల టన్నులు ఉండగలదని అంచనా వేయబడుతున్నది.

జాతీయాదాయం నూటికి 13 వంతులు పెరుగుదల

వర్షాలు సక్రమంగావుంటే సాధ్యపడగలదని ప్లానింగ్‌మంత్రి శ్రీ మెహతా ఆశాభావం

న్యూఢిల్లీ, ఆగస్టు 17—

దుర్భిక్షంవల్ల గత రెండు సంవత్సరాలుగా తగ్గిపోయిన జాతీయాదాయం ఈ ఏడాది మామూలుగా వర్షాలు పడిన పక్షంలో వర్తమాన ఆర్థిక సంవత్సరంలో జాతీయాదాయం నూటికి 12 నుంచి 13 వంతులకు పెరగగలదని ప్లానింగ్ మంత్రి శ్రీ అశోక్ మెహతా నిన్న కాంగ్రెసు ఎం. పి. ల సమావేశంలో చెప్పారు

వ్యవసాయ రంగంలో ఈ పెరుగుదల అయన చెప్పారు. నూటికి 24 వంతులవరకు ఉండవచ్చునని వర్షాలు అనుకూలంగా వున్న పక్షంలో పెట్టుబడి పెంపుదలకు అత్యధిక ప్రాధాన్యమివ్వగలమని శ్రీ మెహతా చెప్పారు.

వ్యవసాయోత్పత్తులు పెరిగిన పక్షంలో ధరల పెరుగుదల నిలిచిపోగలదని, కొంతవరకు తగ్గవచ్చుననికూడా ఆయన అన్నారు.

కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ కార్యవర్గం సమావేశంలో వార్షిక ప్రణాళికపై చర్చలో పాల్గొంటూ పైవిధంగా చెప్పారు.

నిన్న జరిగిన ఈ అసమగ్ర చర్చలో పార్టీ ఉపనాయకుడు శ్రీ ఎస్. ఎన్. మిశ్రా, శ్రీమతి తారకేశ్వరి సిన్హా, శ్రీ విభూతి మిశ్రా ప్రసంగించారు.

1964లో అభివృద్ధి పథకాలకు జాతీయాదాయంలో నూటికి పదివంతులు పొదుపు చేసినట్లు ప్లానింగ్ మంత్రి తెలియజేశారు.

1966-67లో తలసరి ఆదాయం 1964-65 కంటె నూటికి 6.5 వంతులు తక్కువని శ్రీ మెహతా చెప్పారు.

ధరల్లో ఉండే వ్యాప్తి అరికట్టడానికి గైకొన్న చర్యలను గురించి శ్రీ మెహతా వివరించారు.

ఎన్నికల పిటిషన్ల విషయంలో సభ్యులకు సహాయం

ఎన్నికల పిటిషన్ల విషయంలో సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి కూడా కార్యవర్గం చర్చించింది.

ఈ పిటిషన్ల విషయంలో సభ్యులకు హైకోర్టు, సుప్రీం కోర్టు స్థాయిలలో సహాయం చేయాలని ఈ కార్యవర్గం అభిప్రాయపడింది.

ఈ విషయంలో న్యాయవాదులైన సభ్యుల సహాయాన్ని తీసుకొంటారు.

పార్టీ నాయకురాలి హోదాలో ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి ఈ విషయాన్ని గురించి రాష్ట్రాల ముఖ్యమంత్రులకు కూడా లేఖలు వ్రాస్తున్నారు.

సభలు-సమావేశాలు

చేనేత మజ్దూర్ సంఘ్

చీరాల, ఆగస్టు 17— ఇక్కడి క్లాత్ మర్చెంట్స్ అసోసియేషన్ ఆవరణలో 19వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు చేనేత మజ్దూర్ సంఘ్ మహాసభ జరుగుతుంది. రాత్రి ఏడు గంటలకు గోపాల్ పార్కులో బహిరంగసభ జరుగుతుంది. భారతీయ మజ్దూర్ సంఘ్ ప్రధాన కార్యదర్శి శ్రీ దత్తోపంత్ ఠేంగ్డీ హాజరవుతారు.


నేడే చూడండి!
ఉదయం ఆటలతో ప్రారంభం
విజయవాడ: శేష్‌మహల్
గుంటూరు: నాజ్ లిటిల్ బిగ్ (A.C)
వైజాగ్: రామకృష్ణా పిక్చర్ ప్యాలెస్
రాజశ్రీ
రాజ్ కపూర్
మెహమూద్
ఓంప్రకాష్
అమిత &
ప్రాణ్
సంగీతం శంకర్ జైకిషన్
రచన, నిర్మాణం, దర్శకత్వం పచ్చి
ఆంధ్రా వెరైటీ రిలీజ్
సీడెడ్ వెంకటనారాయణ [illegible]
పచ్చి సమర్పించు
ఎరౌండ్ ది వరల్డ్
ప్రప్రథమ భారతీయ 70 mm & 35 mm టెక్నికలర్ చిత్రం
NAVRANG


ఇంతకు ముందెన్నో మనసులను చూసిన ఆంధ్ర
ప్రజానీకాన్ని ఆనంద డోలికలలో ముంచెత్తుతున్న
యస్.వి.యస్.ఫిలిమ్స
S.V.S FILMS
నిండు మనసులు
నిర్మాత: యం.జగన్నాథరావు దర్శకత్వం: యస్.డి.లాల్
సంగీతం: టి.వి.రాజు
ఆంధ్ర: జ్యోతీ పిక్చర్స్
వైజాగ్: ఉషా ఫిలిమ్స్
సీడెడ్: నవభారత్ ఫిలిమ్స్
మైసూర్: శివశంకర ఫిలిమ్స్
[illegible] విశ్వశాంతి ఫిలిమ్స్ [illegible]
2 వ వారం
JOTHEE

Printed and Published by K. L. N. Prasad at Andhra Printers Ltd., Vijayawada-2, Editor: Narla Venkateswara Rao.